అనుదినం... జనస్వరం


# నవతెలంగాణ

మంగళవారం 28-3-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 86 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

## కనీస వేతనాల సంగతేంటి?



### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ -హైదరాబాద్

రాష్ట్రంలోని కోటీ ఏడు లక్షల మంది కార్మికులకు 16 ఏండ్లుగా కనీస వేతనాల పెంపుదల చేయలేదంటూ దాఖలైన పిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2021లో ఐదు జీవోలు ఇచ్చిన ప్రభుత్వం వాటి అమలుకు ఎందుకు గెజిట్లను ప్రకటించలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు పెంపునకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ తెలంగాణ రీజనల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి దగ్గుల సత్యం ...2లో




# అదానీ కోసమే ఈ దిగజారుడు

### మోడీ ప్రభుత్వంపై ఐక్య పోరాటం... ప్రజలపై భారాలు పెరుగుతున్నాయ్ : సీతారాం ఏచూరి

**న్యూఢిల్లీ :** మోడీ ప్రభుత్వంపై ఐక్య పోరాటం చేస్తామని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. సోమవారం నాడిక్కడ సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం (ఏకేజీ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెండు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సమావేశాల నిర్ణయాలను ఏచూరి వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ముద్రించిన "అదానీ బెలూన్ గ్యాస్ అయిపోతోంది" అనే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ప్రతిపక్షాలను వేధించడానికి ఈడీ, సీబీఐ దుర్వినియోగంతో పాటు నేర పరువునష్టం మార్గాన్ని బీజేపీ ప్రభుత్వం ఎంచుకుందని ఏచూరి విమర్శించారు. ప్రజల విశ్వాసం ఉన్నదనీ, 2024 ఎన్నికల్లో గెలుస్తామని బీజేపీ ప్రభుత్వానికి నమ్మకం లేదని అన్నారు. అందువల్లనే ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడం వంటి చర్యలకు పూనుకుంటున్నదన్నదని దుయ్యబట్టారు.

**సమాధానం చెప్పాల్సి వస్తుందనే ....**

దేశంలో అదానీ గురించి ప్రతి రోజూ కొత్త కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయనీ, ప్రజల సంపదను అదానీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే పార్లమెంట్ సజావుగా నడవకుండా ప్రభుత్వమే అడ్డుకుంటున్నదని చూస్తుందని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమాధానం ఇవ్వకపోవడంతో అదానీ వ్యవహారంలో కుంభకోణం జరిగిందనీ, అందులో మోడీ ప్రభుత్వం జోక్యం ఉన్నదని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. అలాగే పార్లమెంట్ సజావుగా నడిస్తే, ప్రజా సమస్యలను ప్రతిపక్షాలు లేవనెత్తుతాయని పేర్కొన్నారు.

**అదానీని కాపాడేందుకే...**

అదానీ సోదరుడి ఆధీనంలో ఉన్న ...5లో



## యే దాదాగిరి బంద్ కరో

### నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన
- రాజ్యసభలో ఆర్థిక బిల్లు ఆమోదం




**న్యూఢిల్లీ :** రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు, అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాలు నల్ల దుస్తులు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించాయి. "సత్యమేవ జయతే" బ్యానర్ పట్టుకొని నినాదాలు చేస్తూ ప్రతిపక్ష నేతలు ప్రదర్శన చేపట్టారు. సోమవారం ఉభయ సభలు వాయిదా పడిన తరువాత ప్రతిపక్ష సభ్యులంతా పార్లమెంట్ ఆవరణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేబూని నినాదాల చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి విజయ్ చౌక్‌కు ...5లో



# ఇది తెలంగాణ గడ్డ...
# మీ ఆటలు సాగవు

### లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఐక్యమవుతున్నాయి

- మోడీ భయపడుతున్నాడు : తమ్మినేని
- అప్పల మోడీని దించేయాలి : ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- మహిళలకు బీజేపీ వ్యతిరేకం: మల్లు లక్ష్మి

CPIM జన చైతన్య యాత్ర

వివరాలు 6లో



## బీజేపీ ఎంపీల్లో సగం మంది దొంగలే..

### అదానీ, అంబానీకి దోచిపెడుతున్న మోడీ: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

- ఎరుపెక్కిన నారాయణపేట.. డప్పు వాయిద్యాలతో స్వాగతం



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో బీజేపీని ఓడించడమే లక్ష్యమని, ఆ పార్టీ ఎంపీల్లో సగం మంది దొంగలేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. దేశ సంపదను మోడీ అదానీ, అంబానీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. బుల్డోజర్లు ఎర్రజెండాను అడ్డుకోలేవని హెచ్చరించారు. సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కోడూరు నుంచి ప్రారంభమైంది.

డప్పు వాయిద్యాలు, మహిళలు మంగళహారతులతో ముందు ...12లో



## లాభాలు అదానీకి.. చందాలు బీజేపీకి..

### అదానీ కోసం ఆస్ట్రేలియా బొగ్గు దిగుమతి

- రాష్ట్రాలపై కేంద్రం కక్ష..అడ్డదారిలో కూల్చాలని కుట్ర:మంత్రి కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల

దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్ వ్యక్తులకు తొత్తులుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ లాభాలు అదానీకి ఇస్తుండగా.. చందాలు బీజేపీ వసూలు చేసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి తొవ్వ చూపుతున్నదని.. ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి రాష్ట్రంలో జరుగుతుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్ర ...2లో

## మోడీ సర్కార్‌పై ఐక్య పోరాటం చేయాలి

- జనచైతన్య యాత్రలో..సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, అబ్బాస్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో ప్రధాని మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేయాలని, మతోన్మాద బీజేపీని కేంద్రంలో గద్దె దించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ ...12లో

# జనచైతన్య యాత్రకు జనం జేజేలు...

### బీజేపీ వ్యతిరేకత కనిపిస్తున్నది

- యువత స్పందిస్తున్నది. : యాత్ర రథసారధి పోతినేని సుదర్శన్ రావు



"ప్రజల్లో సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రకు మంచి స్పందన వస్తున్నది..బీజేపీ, కేంద్ర ప్రభుత్వ విధానాలపై స్పష్టంగా చెబుతున్నాం..కుల,మతాల రొచ్చుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్న తీరును జనం దృష్టికి తీసుకుపోతున్నాం..మతోన్మాద ప్రమాదాన్ని సమాజానికి చెబుతున్నాం..వందలాది మోటార్‌సైకిళ్లు, ప్రజానాట్య మండలి బృందాలతో యాత్ర ముందుకు సాగుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జనచైతన్య యాత్ర రథ సారథి పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. యాత్రలో ప్రజాస్వామ్యం, మతోన్మాదం, సామాజిక న్యాయం తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు చెబుతున్నామని చెప్పారు. యాత్ర జరుగుతున్నతీరు, ప్రజల స్పందన తదితర అంశాలపై నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి బి.బసవపున్నయ్యకు పోతినేని ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

**జన చైతన్య యాత్ర లక్ష్యమేంటి ?**

బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర చేపట్టింది. సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజికన్యాయం కోసం పార్టీకేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. 17 నుంచి ఈనెల 29 వరకు జరగనున్నాయి. వేలాది కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు పాల్గొంటున్నారు.

**మోటార్ సైకిళ్ల ప్రభావం ఎలా ఉంది ?**

చాలా బాగుంది. పట్టుదలగా మోటార్ సైకిళ్ల ప్రదర్శన జరుగుతున్నది. దాదాపు 250 మోటార్ ...5లో

### రోజుకో కొత్త మలుపు...

- పేపర్ లీకేజీ కేసులో సంచలన విషయాలు
- సిట్ అదుపులో మరో ఐదుగురు?

వివరాలు 2లో..

### పోలవరంపై విచారణ వాయిదా వేయండి

- ఇంకా సంప్రదింపుల దశలోనే సీఎంలు, కేంద్రమంత్రి మధ్య భేటీ
- సుప్రీం కోర్టుకు కేంద్రం లేఖ



వివరాలు 5లో..

### కవిత పిటిషన్ విచారణ వాయిదా

- నళిని చిదంబరం పిటిషన్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పిటిషన్ ట్యాగ్
- మూడు వారాల తర్వాత సుప్రీం పరిశీలన



వివరాలు 5లో..

# అదానీ జేబులో పీఎఫ్ పైసలు

### అదానీ గ్రూపు షేర్లకు ఈపీఎఫ్ఓ రక్ష

- క్లిష్ట సమయంలోనూ పెట్టుబడులు కొనసాగింపుపై అనుమానాలు..

**న్యూఢిల్లీ :** తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతున్న అదానీ గ్రూపు కంపెనీలకు ఉద్యోగ, కార్మికుల సొమ్మును పణంగా పెడుతున్నారు. అదాని కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపణల తర్వాత ఆ కంపెనీల షేర్లు తీవ్ర పతనాన్ని చవి చూస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో అదానినీ కాపాడటానికి ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ఉద్యోగుల సొమ్మును వాడుతోంది. దాదాపుగా 27.73 కోట్ల మంది ప్రయివేటు, ప్రభుత్వ రంగ ఉద్యోగ, కార్మికుల సొమ్ము ఇందులో ఉంది. హిండెన్‌బర్గ్ దెబ్బతో అనేక పెద్ద ఇన్వెస్టర్లు అదానీ కంపెనీల్లో పెట్టుబడులకు వెనుకాడుతుండగా.. మరోవైపు ఈపీఎఫ్ఓ మాత్రం అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్)లో పెట్టుబడులను కొనసాగిస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. ఈపీఎఫ్ఓలోని 15 శాతం కార్పస్ ఫండ్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులుగా పెడుతోంది. 2022 మార్చి నాటికి రూ.1.57 లక్ష కోట్ల నిధులను బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లోని పలు సూచీల్లో ఇన్వెస్ట్ చేసింది. మరో రూ.8,000 కోట్లను 2022-23లో పెట్టుబడులుగా పెట్టింది.

అదానీ గ్రూపు అక్రమాలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ జనవరి 24న రిపోర్టు ...2లో



## గవర్నర్‌పై పిటిషన్ విచారణ ఏప్రిల్ 10కి వాయిదా

**న్యూఢిల్లీ :** తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్ 10కి వాయిదా వేసింది. పది ముఖ్యమైన బిల్లులను ఆమోదించడం లేదని, ఆయా బిల్లులను ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గవర్నర్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయనీ, కనుక తమకు సమయం కావాలని కేంద్రం తరపు న్యాయవాదులు కోరారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు పిటిషన్‌పై విచారణను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ ధర్మాసనం వాయిదా వేశారు.

## పోలవరం ఎత్తు 45.72 మీటర్లు

- స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ ఎత్తు 45.72 మీటర్లని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ టుడు తెలిపారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 1980 నాటి గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం.. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం ఎత్తు 45.72 మీటర్లని తెలిపారు. పోలవరం డ్యాం ఎఫ్ఆర్ఎల్ తగ్గింపుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన చేసినట్టు తమకు సమాచారం లేదని తెలిపారు.పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 2017-18 సంవత్సరాల లెక్కల ప్రకారం రూ.55,548.87 కోట్లుగా 2019లో సవరించిన వ్యయ కమిటీ (ఆర్‌సీసీ) చేసిన సిఫారసును జలశక్తి సలహా కమిటీ ఆమోదించినా ఆ తరువాత వేసిన కమిటీ ఆ మొత్తాన్ని తగ్గిస్తూ సిఫారసు చేశాయని జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ టుడు తెలిపారు. కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2020 మార్చిలో నియమించిన ఆర్‌సీసీ పోలవరం అంచనా వ్యయాన్ని 2013-14 లెక్కల ప్రకారం రూ.29,027.95 కోట్లుగా, 2017-18 లెక్కల ప్రకారం రూ.47,725.74 కోట్లుగా సిఫారసు చేసిందని మంత్రి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ. 13,463.21 కోట్లు చెల్లించినట్టు మంత్రి తెలిపారు.

**కేంద్ర ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం...**
**రూ.53 వేల కోట్లు అదనపు భారం**

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 56 ప్రాజెక్టులకు సంబంధించి అంచనా వ్యయం 52.36 శాతం,(అదనంగా రూ.53 వేల కోట్లు) పెరిగినట్టు గణాంకాలు, కేంద్ర కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావ్ ఇందర్‌జిత్ సింగ్ వెల్లడించారు. వైసీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,01,272 కోట్ల వాస్తవ అంచనా విలువతో ప్రారంభించిన 56 ప్రాజెక్ట్ పనుల అంచనా విలువ రూ.1,54,300 కోట్లకు పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ 56 ప్రాజెక్టులలో 24 ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన జాప్యం కారణంగా నిర్ణీత గడువులోగా పూర్తి కాలేదు.

**పోలవరం అంచనా వ్యయం**
**రూ.10 వేల కోట్ల నుంచి 55 వేల కోట్లకు**

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అంచనా వ్యయం 10,151 కోట్ల నుంచి 55,548 కోట్ల రూపాయలకు పెరిగినట్లు మంత్రి తన జవాబులో వెల్లడించారు. 2009 ఫిబ్రవరిలో రూ.10,151 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కావడానికి 2014 ధరలకు అనుగుణంగా సవరించిన అంచనాల ప్రకారం రూ.55,548 కోట్ల వ్యయం చేయాల్సి ఉంది. అంటే 2009లో నిర్ణయించిన అంచనా వ్యయం కంటే మరో 45,397 కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్నట్లు మంత్రి రావ్ ఇందర్‌జిత్ పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నంలో హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలోని విశాఖ రిఫైనరీ అధునీకరణ ప్రాజెక్ట్‌కు రూ.20,928 కోట్ల వ్యయం అవుతుందని 2020 జూలైలో అంచనా వేయగా, 2023 అక్టోబర్‌లో సవరించిన అంచనా వ్యయం రూ.26,264 కోట్లకు చేరింది. అంటే రూ.5,336 కోట్ల అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు.

**2027నాటికి కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్**

రూ.1,045 కోట్ల వ్యయంతో కోటిపల్లి-నర్సాపూరం రైల్వే లైన్ ప్రాజెక్ట్‌కు 2001లో ఆమోదం లభించినట్లు మంత్రి తెలిపారు. నాటి అంచనాల ప్రకారం 2009 మార్చి నాటికి ఇది పూర్తి కావలసి ఉంది. నిధుల కొరత, అటవీ భూముల సేకరణలో జరిగిన అసాధారణ జాప్యం కారణంగా ఈ ప్రాజెక్ట్ 216 నెలలు ముందుకు కదలలేదు. తాజాగా రూ.2,500 కోట్ల అంచనా వ్యయంతో 2027 మార్చి నాటికి కోటిపల్లి-నర్సపూర్ రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే శాఖ కసరత్తు చేస్తోందని మంత్రి వెల్లడించారు.

## కనీస వేతనాల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

వేసిన పిల్‌ను సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను జూన్ 19కి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్రంలో 149 ప్రభుత్వ, ప్రయివేటు విభాగాల్లో కోటీ 7 లక్షల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు పనిచేస్తున్నారు. వారికి 2007లో కనీస వేతన పెంపు జరిగింది. ఐదేండ్లకోసారి కనీస వేతనాల పెంపునకు ప్రభుత్వం జీవోలు ఇవ్వాలి. ఇప్పటికి మూడుసార్లుగా పెంపు జరగాలి. చేయలేదు. 20021 జూన్‌లో ప్రభుత్వం 5 జీవోలు ఇచ్చింది. జీవో ఎంఎస్ నెంబర్లు 21, 22, 23, 24, 25 జారీ చేసిన ప్రభుత్వం వాటి అమలుకు గెజిట్‌లను మాత్రం పబ్లిష్ చేయలేదు. ఇది చట్ట వ్యతిరేకం. కార్మికుడిపై ముగ్గురు ఆధారపడతారు. అంటే 3 కోట్ల మందికిపైగా కొనుగోలు శక్తి ప్రమాణాలు పెరుగుదల లేకుండా ప్రభుత్వం చేసింది. కార్మికులు కష్టాలు పడుతున్నారు. జీవన ప్రమాణాలు ఘోరంగా మారాయి. దయనీయంగా దిగజారాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఐదు జీవోల అమలుకు వీలుగా ప్రభుత్వం గెజిట్ ప్రకటించేలా ఉత్తర్వులు ఇవ్వాలి. సెమీ స్కిల్ వర్కర్‌కు 2007లో రూ.437గా నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పుడు రూ.919లకు, సిల్క్ వర్కర్‌కు రూ.469 నుంచి రూ.1039లకు, హైస్కిల్డ్ వర్కర్‌కు రూ.469 నుంచి రూ.1173లకు పెంపుదల చేయాల్సివుంది.. అని పిటిషనర్ పిల్‌లో పేర్కొన్నారు. విచారణ జూన్ 19కి వాయిదా పడింది.

## అదానీ జేబులో పీఎఫ్ పైసలు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అప్పటి నుంచి అదానీ కంపెనీల షేర్లు పేక మేడల కూలిపోయి.. ఇప్పటికీ తీవ్ర ఒత్తిడిలోనే ఉన్నాయి. ఎల్ఐసీ తర్వాత అదానీ కంపెనీల్లో అత్యధికంగా ఈపీఎఫ్ఓ ట్రస్టీ పెట్టుబడులే ఉన్నాయి. అదానీ స్టాక్స్ 50 శాతం మేర క్షీణించాయి. ఈ సూచీల్లో పెట్టుబడులపై పెద్ద ఇన్వెస్టర్లతో పాటు రిటైల్ మదుపర్లు ఆచీతూచీ వ్యవహరిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ఈపీఎఫ్ఓ మరిన్ని పెట్టుబడులకు సిద్ధం అవుతోందనే రిపోర్టులు ఉద్యోగ, కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అదాని స్టాక్స్‌ల్లో ఈపీఎఫ్ఓ పెట్టుబడులపై సెంట్రల్ ప్రావిడెండ్ ఫండ్ కమిషనర్ నీలమ్ శామి రావును ది హిందూ పత్రిక మార్చి 23న వివరణ కోరగా ఆయన స్పందించలేదు. అదానీ స్టాక్స్‌ల్లో తక్కువ పెట్టుబడులే ఉన్నప్పటికీ.. ట్రస్టీ రాబడిని దెబ్బతీస్తుందని ఓ అధికారి పేర్కొన్నారు. కాగా.. సోమవారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగే రెండు రోజుల బోర్డు సమావేశంలో ఈ అంశం తెరపైకి రావొచ్చున్నారు. అదానీ షేర్లలో భారీ క్షీణత వల్ల రిటర్న్‌లు తగ్గొచ్చు. దీంతో పీఎఫ్ సభ్యులకు చెల్లించే వార్షిక వడ్డీ రేటులో కోత విధించే అవకాశం ఉంది. మార్చి 24 నుంచి ఇప్పటి వరకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ 49 శాతం, ఏపీసెజ్ స్టాక్స్ 19 శాతం పతనమయ్యింది. సోమవారం సెషన్‌లోనూ బీఎస్ఈలో అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 1 శాతం పతనమై రూ.1,723కు దిగజారింది. ఇంట్రాడేలో 1,682 కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఏపీసెజ్ షేర్ 1.43 శాతం నష్టపోయి 629 వద్ద ముగిసింది.

# అదానీ గ్రూపు కార్యకలాపాలపై దర్యాప్తు జరపాలి : సీపీఐ(ఎం) డిమాండ్

**ప్రతిపక్ష నేతలపై వేధింపులకు ఖండన**
**బీజేపీ వైఖరికి నిరసన**



**న్యూఢిల్లీ :** ఈ నెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో సమావేశమైన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పలు కీలకాంశాలపై చర్చించిన అనంతరం ఒక ప్రకటన జారీ చేసింది. ప్రతిపక్ష నేతలపై వేధింపు చర్యలను తీవ్రంగా ఖండించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచడాన్ని నిరసించింది. అదానీ గ్రూపు వ్యవహారంపై తక్షణమే జెపిసిని ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది.

**ప్రతిపక్ష నేతలపై వేధింపులు**

ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా వారిని ఎంపీలుగా అనర్హులుగా చేసేందుకు నేరపూరితమైన పరువునష్టం మార్గాన్ని బీజేపీ ఉపయోగించుకోవడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీకి శిక్ష పడిన తీరు, ఆ వెను వెంటనే ఆయనను చట్టసభ సభ్యుడిగా అనర్హుడిగా ప్రకటించేందుకు తొందరపడడం చూస్తుంటే విమర్శలను ఏమాత్రమూ తట్టుకోలేని తీవ్ర అసహనం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది బీజేపీ హేయమైన నిరంకుశ ధోరణి, స్వభావాన్ని ప్రతిబింబిస్తోంది.

ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఇప్పటికే దారుణంగా దుర్వినియోగం చేస్తున్న క్రమంలో ఈ సంఘటన అన్నింటికంటే ముందుంది. అత్యంత అల్పమైన కారణాలతో రాజకీయ ప్రత్యర్ధులపై అనేక రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్, బీజేపీలు కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాయి. కేసులు పెట్టాయి. ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీశ్ శిసోడియా ఇప్పటికే అరెస్టయి జైల్లో వున్నారు. చాలా ఆలస్యంగానైనా లక్ష్యంగా చేయబడి, వేధింపులకు గురవుతున్న వారిలో లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్, వారి కుటుంబం (ఆర్జేడీ), కవిత (బీఆర్ఎస్) ఇంకా చాలా మంది వున్నారు.

**అదానీని విచారించాలి**

2014 నుంచి భారతదేశాన్ని శాసిస్తున్న కార్పొరేట్-మతోన్మాద సంబంధాల్లో అత్యంత హేయమైన తీరును హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసింది. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు, ఫోర్బ్స్ అంచనాల ప్రకారం, అదానీ గ్రూపు మార్కెట్ పెట్టుబడుల విలువ 710కోట్ల డాలర్లుగా వున్నాయి. 2022 వచ్చేసరికి, ఒక్కసారిగా ఈ ఆస్తులు 20వేల కోట్ల డాలర్లకు ఎగబాకాయి. 2014లో అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో అదానీ స్థానం 609గా వున్నది, 2022 వచ్చేసరికి నాటకీయంగా ప్రపంచంలోనే రెండో సంపన్నుడిగా మారాడు.

అదానీ గ్రూపు పాల్పడిన దారుణమైన, హేయమైన తప్పుడు చర్యలను, తప్పొప్పులను బీజేపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సమర్ధిస్తోంది. అదానీ గ్రూపునకు, ఆశ్రిత పెట్టుబడిదారులతో వున్న సంబంధాల కారణంగానే, ప్రజలు ఎంతగానో కష్టపడి సంపాదించుకుని, ఎస్‌బీఐ, ఎల్ఐసీ వంటి జాతీయ బ్యాంకుల్లో దాచుకున్న పొదుపు మొత్తాలను వేలాది కోట్ల రూపాయిల మేర దోచుకోవడానికి వీలు కల్పించింది. అదానీ వ్యవహారం బట్టబయలైనప్పటికీ ఆ మొత్తం అధ్యాయంపై ఏ రకమైన విచారణ జరిపించడానికైనా తీవ్రంగా తిరస్కరిస్తోంది.

అదానీ గ్రూపు తప్పుడు చర్యలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటిస్తోంది. చట్ట నిబంధనలకు అనుగుణంగా అదానీ గ్రూపుపై చర్యలు తీసుకోవాలి.

> **కేంద్ర కమిటీ సమావేశం**
> ఏప్రిల్ 27, 28, 29 తేదీల్లో పార్టీ కేంద్ర కమిటీ సమావేశం న్యూఢిల్లీలో జరగనుంది.

**పార్లమెంట్‌ను స్తంభింపచేసిన బీజేపీ !**

తమ పాలనలో అనూహ్యంగా పెరిగిన వ్యాపారవేత్తలతో సంబంధాలపై వచ్చే ప్రశ్నలను తట్టుకోలేని బీజేపీ, పార్లమెంట్‌లో దీనిపై చర్చ జరిగేందుకు లేదా జేపీసీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను అంగీకరించేందుకు మొండిగా తిరస్కరిస్తోంది.

భారతదేశ ప్రజాస్వామ్యం స్థితిగతులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటనను సాకుగా తీసుకుని రోజుల తరబడి పాలక పార్టీ సభ్యులు లోక్‌సభ కార్యకలాపాలను స్తంభింప చేయడం గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగనిది. ఎలాంటి చర్చ జరగకుండానే కేంద్ర బడ్జెట్‌ను గిలెటిన్ చేసేందుకు కూడా ఈ పరిస్థితి దారి తీసింది.

> **కేరళ ఎల్‌డీఎఫ్‌ను లక్ష్యంగా చేసుకోవడంపై ఖండన**
> ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని, కేరళ ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకోవడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా నిరసించింది. కేరళలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా బీజేపీతో కలిసి ఇదే తరహా చర్యలకు పాల్పడు తోంది. ఇటువంటి ప్రయత్నాలకు కేరళ ప్రజలు దీటైన సమాధానం ఇవ్వాలి.

**రాజ్యాంగ అధికారాలకు విఘాతం**

పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింప చేయడంతో పాటూ, కేంద్ర న్యాయ శాఖ మంత్రి, ఉప రాష్ట్రపతి వంటి రాజ్యాంగ అధికారులు పదే పదే చేస్తున్న ప్రకటనలతో న్యాయ వ్యవస్థపై దాడులు కొనసాగుతునే వున్నాయి. న్యాయవ్యవస్థపై కార్యనిర్వాహక వర్గం నియంత్రణ వుండేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తప్పనిసరిగా ఓడించాలి.

బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ లక్ష్యాలను సాధించే పాత్రను గవర్నర్లు పోషించడం కొనసాగుతోంది.

**పదును తేలుతున్న మతోన్మాద ధోరణులు**

మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన సభ్యులపై పథకం ప్రకారం దాడులకు పాల్పడుతున్న సంఘటనలు పెరుగుతుండడం పట్ల పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గో సంరక్షకుల పేరుతో ముస్లిం యువతను హతమార్చుతున్న సంఘటనలు కూడా అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. చర్చిలపై , క్రైస్తవులపై ముఖ్యంగా క్రైస్తవ గిరిజనులపై అనేక రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయి. వీటన్నింటికీ సంబంధించి వివిధ కొత్త తప్పుడు కథనాలు, చరిత్రలు కల్పించబడుతున్నాయి. ముఖ్యంగా సమీప భవిష్యత్తులో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మతోన్మాద ధోరణులకు మరింత పదును పెట్టేందుకు ఈ చర్యలకు పాల్పడుతున్నారు.

ఓబీసీ కోటా కింద ముస్లింలకు రిజర్వేషన్లు రద్దుచేయాలని కర్నాటక బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే సమయంలో ఇది చోటు చేసుకుంది. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలపై విస్తృత దాడులు, వేధింపులు ఉధృతమయ్యాయి.

**పెరుగుతున్న ఆర్థిక భారాలు**

ఎలాంటి చర్చ జరగకుండానే 2023-24 సంవత్సర కేంద్ర బడ్జెట్‌ను ఆమోదించడాన్ని పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఆర్థిక మాంద్యం, ఉపాధి ఉత్పత్తి లేదా సామాన్యుల కొనుగోలు శక్తి పెరగడం వంటి సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ దారు ణంగా విఫలమైంది. దీనికి విరు ద్ధంగా, ఆర్థిక లోటును కుదించేందుకు గానూ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిస్తోంది. మరోపక్క సంపన్నులకు మరింతగా పన్ను రాయితీలు ఇస్తోంది. గత రెండేండ్లలో భారతదేశంలోని ఒక శాతం మంది సంపన్నుల వద్ద 40.5శాతం సంపద పోగు పడిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించిన సమయంలో ఇది జరిగింది. ఆ రకంగా, ఈ సంకుచిత బడ్జెట్ ఆర్థిక సంక్షోభాన్ని మరింత ఉధృతం చేస్తుంది.

ప్రజలపై మరిన్ని భారాలు మోపబడుతున్నాయి. అందులో తాజాది ఎల్‌పీజీ ధరల పెంపు. నిరుద్యోగం, ఆకలి పెరుగుతూనే వున్నాయి. మరోపక్క అసమానతలనేవి అసహ్యకరమైన స్థాయిలకు విస్తరించబడుతున్నాయి.

**ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌ను నాశనం చేస్తున్నారు**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం ప్రభుత్వం తప్పనిసరి చేసిన జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ యాప్‌లో సాంకేతిక ఇబ్బందులు వున్న కారణంగా కార్మికులు సగానికి సగం వేతనాలు కోల్పోయినట్లు వార్తలందుతున్నాయి. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్మిక శక్తిలో ప్రధానంగా వున్న మహిళా కార్మికులు యాప్‌ను ఉపయోగించాలంటే స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసేందుకు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు భారీగా కోత కోయడం, దానికి తోడు వేతనాల చెల్లింపులు సుదీర్ఘ కాలం పెండింగ్‌లో వుంచడంతో పాటూ యాప్‌ను కూడా ప్రవేశపెట్టడంతో ఈ పథకం అసమర్ధంగా తయారైంది.

> **త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు**
>
> త్రిపుర శాసనసభకు జరిగిన ఎన్నికల ఫలితాలపై పొలిట్‌బ్యూరో ప్రాథమికంగా విశ్లేషణ జరిపింది. ప్రతిపక్ష పార్టీలు పనిచేయలేని, నిరంతరంగా దాడులకు గురయ్యే ఒక అసాధారణ పరిస్థితిలో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయని పేర్కొంది. గత ఐదేండ్ల కాలంలో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించారని పేర్కొంది. ఆ భయానక పరిస్థితులను, భౌతిక దాడులను తట్టుకుని ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియచేసింది.
>
> ఆశించిన రీతిలో ఓట్లను, సీట్లను గెలుచుకోవడంలో విఫలమవడంతో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ దారుణమైన, భయంకరమైన దాడులకు దిగడం ఆరంభించింది. సీపీఐ(ఎం)ను ప్రధాన లక్ష్యంగా చేసుకుని సాగుతున్న దాడులను పొలిట్‌బ్యూరో ఖండించింది. భయోత్పాతం, బెదిరింపులు, దోపిడీలు, కార్యాలయాలు, ఇళ్ళకు నిప్పంటించడం, ఆస్తులను ధ్వంసం చేయడం, జీవనోపాధికి ఉపయోగించే సాధనాలైన రిక్షాలు, మూడు చక్రాల బళ్ళు వంటి వాటిని నాశనం చేయడం, పంటలను ముఖ్యంగా రబ్బర్ తోటలను ధ్వంసం చేయడం, చేపల చెరువుల్లో విషం కలపడం వంటివి వెయ్యికి పైగా సంఘటనలు చోటు చేసుకున్నాయి.
>
> సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్‌లకు చెందిన ఏడుగురు పార్లమెంటరీ సభ్యుల బృందం త్రిపురలో పర్యటించి, పరిస్థితులను సమీక్షించింది. ఆ బృందంపై కూడా పోలీసుల సమక్షంలోనే బీజేపీ-ఆర్ఎస్ఎస్ దుండగులు దాడి జరిపారంటే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో ఎంత ప్రమాదకరమైన పరిస్థితి నెలకొందో అర్ధమవుతోంది.

మీడియా వ్యవస్థపై పట్టు వున్న మోడీ ప్రభుత్వం ఎన్నికలవరంగా అజేయులమనే ధోరణిని ప్రచారం చేస్తూ వస్తోంది. కానీ ఇది పూర్తిగా తప్పుదారి పట్టించే ధోరణి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో, బీజేపీ గుజరాత్‌ను నిలబెట్టుకోగా, హిమాచల్ ప్రదేశ్‌లో సిట్టింగ్ ప్రభుత్వాన్ని కోల్పోయింది. గత 15ఏండ్లుగా తన నియంత్రణలో వుంటూ వచ్చిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా కోల్పోయింది.

మూడు ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తంగా 180సీట్లకు గానూ బీజేపీ కేవలం46సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. త్రిపురలో బీజేపీ ఎంఎల్ఎల సంఖ్య 46 నుంచి 32కి పడిపోయింది. నాగాలాండ్‌లో 12సీట్లు గెలుచుకుని 2వ స్థానంలో నిలిచింది.

**ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు**

మేఘాలయలో కేవలం రెండు సీట్లను గెలుచుకుని మిగిలిన 58సీట్లలో డిపాజిట్లను కూడా కోల్పోయింది. పోలైన ఓట్ల దృష్ట్యా చూసినట్లైతే, త్రిపురలో బీజేపీకి 38.97 శాతం ఓట్లు వచ్చాయి. నాగాలాండ్‌లో 18.81శాతం ఓట్లు రాగా, మేఘాలయలో కేవలం 9.33శాతం ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, స్థానిక ప్రాంతీయ పార్టీలతో కలిసి మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వంలో వుంది.

పూనే జిల్లాలోని కాస్బా పేట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ సిట్టింగ్ స్థానం, గత రెండు దశాబ్దాలుగా నిరంతరంగా బీజేపీ అధీనంలో వున్న సీటును కాంగ్రెస్ అభ్యర్థి కైవసం చేసుకున్నారు.

పశ్చిమ బెంగాల్‌లోని సాగర్‌దిఘి ఉప ఎన్నికల్లో 2011 నుండి తృణమూల్ గెలుస్తూ వచ్చిన సీటును కాంగ్రెస్ గెలుచుకుంది. 2021లో తృణమూల్ ఈ సీటును బీజేపీపై 50వేల ఓట్ల మెజారిటీతో గెలుచుకుంది. కాంగ్రెస్-వామపక్ష అభ్యర్థి దాదాపు 23వేల ఓట్ల తేడాతో ఈ సీటును గెలుచుకుని బీజేపీని మూడో స్థానానికి నెట్టివేశారు.

**ఉధృతమవుతున్న ప్రజా పోరాటాలు**

**వివిధ వర్గాల్లో పెరుగుతున్న ప్రజా పోరాటాలను పొలిట్‌బ్యూరో గుర్తించింది.**

- మార్చి 20న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) విజయవంతంగా కిసాన్ మహా పంచాయత్‌ను నిర్వహించింది. దీనికి పెద్ద సంఖ్యలో రైతాంగం హాజరైంది. వ్యవసాయంపై పెరుగుతున్న కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని పిలుపిచ్చింది.
- నాసిక్ నుండి ముంబయికి మహారాష్ట్ర కిసాన్ సభ మార్చి 12న మూడో లాంగ్ మార్చ్‌ను ప్రారంభించింది. ముంబయికి ప్రదర్శన చేరుకోవడానికి ముందుగానే, షిండే-బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిమాండ్లను ఆమోదించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉల్లిపాయలకు క్వింటాల్‌కు రూ.350 సబ్సిడీ ఇవ్వడం, 88వేల మందికి పైగా రైతులకు రుణాల రద్దుతో సహా అన్ని డిమాండ్లను అంగీకరించింది.
- అనేక రాష్ట్రాల్లో విద్యుత్ కార్మికులు సమ్మెలకు దిగుతున్నారు. దీంతో సమైక్యంగా, కృతనిశ్చయంతో కార్మిక సంఘాలు సాగించే కార్యాచరణ ముందు బీజేపీ ప్రభుత్వం తల వంచాల్సిన పరిస్థితి వస్తోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్మికులు, స్కీమ్ కార్మికులు ఇలా అందరూ సమ్మెలకు దిగుతున్నారు.
- ఏప్రిల్ 5వ తేదీన పార్లమెంట్‌కు జరిపే మజ్దూర్-కిసాన్ మార్చ్‌కు పూర్తి సంఘీభావాన్ని, మద్దతును పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

## లాభాలు అదానీకి..చందాలు బీజేపీకి..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం రాష్ట్రంపై కక్ష కట్టి వివక్ష చూపుతూ నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అడ్డదారి సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చాలని చూస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే బిల్ సంతోష్ బ్రోకర్‌గా మారి దొంగ స్వాముల ద్వారా తెలంగాణ ఎమ్మెల్యేలను కొనడానికి ఎరగా వచ్చారన్నారు. పీక్ అవర్‌లో 20 శాతం కరెంటు బిల్ పెంచాలంటూ కేంద్ర ప్రభుత్వం నూతన బిల్లును తీసుకొస్తుందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. టీఎస్పీఎస్సీలో జరిగిన లీకేజీపై బీజేపీ, కాంగ్రెస్ పసలేని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. నిజమైతే నిరూపించాలని రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎనిమిదేండ్లలో 13 పేపర్లు లీక్ అయ్యాయని, అక్కడ ఎవరైనా మంత్రి రాజీనామా చేశారా? ముఖ్యమంత్రి రాజీనామా చేశారా? ఒక్క అధికారినైనా తొలగించారా? అని ప్రశ్నించారు. దేశంలో సింగరేణి, కోలిండియా బొగ్గు ఉన్నదని, నరేంద్ర మోడీ కావాలని ఆస్ట్రేలియాతో ఒప్పందం చేసుకుంటున్నారని విమర్శించారు. అదానీ కోసం అక్కడి బొగ్గును దిగుమతి చేసుకోమంటున్నారని, రూ.3వేలకు టన్ను బొగ్గును వదులుకొని..

దానికంటే పది రెట్లు విలువ పెట్టి బొగ్గును కొనాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తాఖీదులు ఇచ్చిందని చెప్పారు. మోడీ తన దోస్తు అదానీ కోసం బొగ్గునే కాదు విమానాశ్రయాలను సైతం రాసిస్తున్నారని విమర్శించారు. ఒక్క విద్యుత్ రంగానిదే కాదు.. ప్రతి రంగంలోనూ ఇదే కథ ఉందన్నారు. డబుల్ ఇంజిన్ అంటే మోడీ, అదానీ అని విమర్శించారు. ఈ డబుల్ ఇంజిన్ ఇవాళ.. దొంగ పైసలతో రాజకీయ పార్టీలను చీల్చి.. ఎమ్మెల్యేలను కొనాలి.. ఏక్‌నాథ్ షిండేలను తయారు చేసి ప్రభుత్వాలను పడగొట్టాలని ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకోవైపు అవే పైసలతో దేశాన్ని ఆగమాగం చేసి.. బీజేపీ ఒక్కటే బతకాలన్నట్టు వ్యవహరిస్తోందన్నారు.

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిచినప్పటి నుంచి ఒక్క రూపాయి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బండి సంజయ్ గుజరాత్ వాళ్ల చెప్పులు మోయడానికి పనికొస్తారని.. సిరిసిల్ల అభివృద్ధికి పనిచేయరని అన్నారు. కేంద్రం ద్వారా విద్యాసంస్థలను ఒక్కటి కూడా తేలేని బండి సంజయ్ అమాయకులైన కార్యకర్తలను తనను అడ్డుకోవడానికి పంపిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే కేంద్రం నుంచి సిరిసిల్లకు ఏం చేశారో చెప్పాలన్నారు. కేంద్రం చేస్తున్న అవినీతి, తెలంగాణపై కక్ష, బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో చేసిన అభివృద్ధిపై ఏప్రిల్ 25లోపు గ్రామ గ్రామాన చర్చ జరపాలని ప్రతి గడపకూ విశ్లేషణ చేరాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేష్ బాబు, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్‌గా రీతు షా



**హైదరాబాద్ :** ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) చైర్‌పర్సన్‌గా రీతూ షా నియామకమయ్యారు. ఆమె క్రీమ్ స్టోన్, స్క్యాప్స్ ఐస్ వ్యాపారాలను నిర్వహిస్తుంది. ఎఫ్ఎల్ఓ 22వ చైర్‌పర్సన్‌గా రీతూ షా 2023-2024 కాలానికి నిర్వర్తించనున్నారు. ఫిక్కీకి చెందిన మహిళ విభాగానికి దేశ వ్యాప్తంగా 19 స్థానిక చాప్టర్లు ఉన్నాయి. 8000 మంది మహిళా వ్యాపారవేత్తలు, నిపుణులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎఫ్ఎల్ఓకు గౌరవ కార్యదర్శిగా ప్రాచీ త్రివేది షా, కోశాధికారిగా నిషితా మన్నె, గౌరవ జాయింట్ సెక్రటరీ స్మితా సంఘి, జాయింట్ ట్రెజరర్‌గా నీరూ మోహన్ ఎన్నికయ్యారు. అదే విధంగా యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్‌గా ఆర్తీ షా నియమితులయ్యారు. శ్రీ శ్రీనివాస డైరీ ప్రొడక్ట్స్ భాగస్వామిగా రీతూ షా ఉన్నారు. "మహిళలు మరింత ఉపాధి పొందేలా, మార్కెట్‌లలో రాణించేలా చేయడం నా లక్ష్యం. డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత కోసం కార్యక్రమాలను ప్లాన్ చేసి అమలు చేయడమే నా లక్ష్యం." అని రీతూ షా పేర్కొన్నారు.

## రోజుకో కొత్త మలుపు...

**నవతెలంగాణ-సిటీబ్యూరో**




టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ కేసులో నిందితుల జాబితా రోజురోజుకూ పెరుగుతోంది. నిందితులు ఒకరికి తెలియకుండా మరొకరికి ప్రశ్నాపత్రాలను విక్రయించినట్టు తెలుస్తోంది. 9 మంది నిందితుల అరెస్టుతో మొదలైన ఈ కేసులో ఇప్పటివరకు 15 మందిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. తాజాగా మరో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ఈ కేసులో ఇంకెంత మంది అరెస్టవుతారో వేచి చూడాలి.

**100 మార్కులపైన వచ్చిన వారిని విచారణ**

100 మార్కులపైన వచ్చిన అభ్యర్థుల లిస్ట్ తయారు చేసిన సిట్ అధికారులు వారిని కార్యాలయానికి రావాలని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం 20 మంది అభ్యర్థులు సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. దాదాపు 15 అంశాలపై వారి నుంచి వివరాలు సేకరించినట్టు తెలిసింది. ముఖ్యంగా అభ్యర్థి బయోడేటాను పరిశీలించిన అధికారులు పరీక్ష రాసే సామర్థ్యం ఉందా లేదా అని ఎఫిసియేన్సీ టెస్ట్ నిర్వహించినట్టు తెలిసింది. ఇప్పటి వరకు దాదాపు 40 మందిని విచారించిన అధికారులు వారు ఎంతవరకు చదివారు, వారి మార్కులు, ప్రస్తుతం వారు ఏం చేస్తున్నారు అనే పలు అంశాలను రికార్డ్ చేసినట్టు తెలిసింది. అవసరమైతే తిరిగి రావాల్సి ఉంటుందని అభ్యర్థులను అధికారులు ఆదేశించినట్టు సమాచారం.

**ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ**

ఏఈ ప్రశ్నాపత్రాన్ని నిందితులు డాక్యా అండ్ గ్యాంగ్ పలువురికి విక్రయించినట్టు తెలుస్తోంది. లక్షలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన అభ్యర్థులు ప్రశ్నాపత్రాన్ని కొనుగోలు చేయడానికి పెట్టిన ఖర్చును తిరిగి సమకూర్చుకునే క్రమంలో చెయిన్ ప్రాసెస్ లాగా ఒకరికి తెలియకుండా మరొకరు విక్రయించినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ఇలా దాదాపు వంద మందికి ప్రశ్నాపత్రం చేరినట్టు భావిస్తున్నారు. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు అనుమానిస్తున్నారు. కాగా రేణుక, డాక్యా నుంచి అత్యధికంగా పాలమూరు పరిసర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులకు పేపర్ వెళ్లినట్టుగా అధికారులు గుర్తించారు. సోమవారం నలుగురు నిందితులను ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా నాయక్, కేతావత్ రాజేశ్వర్‌ను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఇదిలా ఉండగా ప్రవీణ్ ఇంట్లో రెండోసారి సోదాలు చేసిన అధికారులు రూ.4 లక్షలు స్వాధీనం చేసుకున్నారని సమాచారం.

# నేడు ఇందిరాపార్కు వద్ద యూఎస్‌పీసీ మహా ధర్నా

- ఎయిడెడ్ జీతాలు, పెండింగ్ బిల్లులివ్వాలని డిమాండ్
- పెద్ద ఎత్తున తరలిరానున్న ఉపాధ్యాయులు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఎయిడెడ్ టీచర్ల మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలనీ, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టనున్నది. ఉదయం 11.00 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ధర్నా చౌక్‌లో కొనసాగనున్నది. సంఘాలు, అనుబంధాలతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులందరూ పెద్దఎత్తున పాల్గొని రాష్ట్ర సర్కారుపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా ఈ ధర్నా జరుగనున్నది. ట్రెజరీల్లో పాసై ఆర్థిక శాఖ వద్ద పెండింగులో ఉన్న బిల్లులన్నీ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా క్లియర్ చేయాలని యూఎస్‌పీసీ డిమాండ్ చేస్తున్నది. రెండేండ్లుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు వేతనాల కోసం 15వ తేదీ వరకు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మొదటి పనిదినంలోనే వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో ధర్నా జరుగనున్నది. కేటాయించిన బడ్జెట్ ఉన్నప్పటికీ మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు ఇవ్వడంలేదు. సప్లిమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, టీఎస్జీఎల్ఐ, జీపీఎఫ్ క్లైములు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు తదితర బిల్లులన్నీ నెలల తరబడి మంజూరు కావటం లేదు. యూఎస్‌పీసీ భాగస్వామ్య ఉపాధ్యాయ సంఘాలు పదే పదే ప్రాతినిధ్యం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. జీపీఎఫ్ సొమ్ము కూడా అవసరానికి ఉపయోగపడే పరిస్థితి లేకుండా పోయింది. మరో పీఆర్సీ గడువు సమీపిస్తున్నా పద్దెనిమిది వాయిదాల్లో ఇస్తామన్న రెండు నెలల గత పీఆర్సీ బకాయిలు పదకొండు నెలలు గడిచినా కేవలం మూడు, నాలుగు కు మించి జమ కాలేదు. వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగింపుకొస్తున్నా పాసైన బిల్లులకు సంబంధించిన నగదును ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆర్థిక శాఖ చొరవ చూపట్లేదు. ఈనెల 24న జిల్లా ట్రెజరీ కార్యాలయాల ఎదుట ప్రదర్శనలు నిర్వహించి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అయినప్పటికీ ఆర్థికశాఖలో చలనం లేదు. ఈ నేపథ్యంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇందిరాపార్కు వద్ద ధర్నాకు పూనుకున్నారు.

# అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

- ఈ నెల 29 నుంచి పది రోజుల పాటు సేవలు
- సమాచార, పౌర సంబంధాలశాఖ కమీషనర్ అర్వింద్ కుమార్

**నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్**

అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టులకు మార్చి 29 నుంచి పది రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ అర్వింద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా జర్నలిస్టులకు పురస్కార కార్యక్రమంలో మహిళా జర్నలిస్టులు ఉచిత వైద్య శిభిరం నిర్వహించాల్సిందిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.టి.రామారావుకి విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించిన మేరకు ఈ నెల 29 తేది నుండి మాసాబ్ ట్యాంక్‌లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయనున్నట్టు అర్వింద్ తెలిపారు. ఈ కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్‌లో రక్త పరీక్ష (సీబీపీ) , బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బి12, డి3 తదితర డయాగ్నోస్టిక్స్ పరీక్షలు , ఈసీజీ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్‌స్మియర్, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, కంటి స్క్రీనింగ్ , దంత పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు తదితర పరీక్షలు చేయనున్నారు. ఈ పరీక్షల రిపోర్ట్‌లు అదే రోజు అందజేయనున్నారు. వైద్య శిబిరం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ఈ శిబిరంలో రాష్ట్ర స్థాయి అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టులతో పాటు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుండి అక్రిడిటేషన్ పొందిన మహిళా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలకు చెందిన అక్రిడిటేటేడ్ మహిళా జర్నలిస్టుల కోసం ఆయా జిల్లా కేంద్రాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

# పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్.మూర్తి



**నవతెలంగాణ-అంబర్‌పేట**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబర్‌పేట చౌరస్తా కూడలిలో అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ లీకేజీ జరిగి పది రోజులు అవుతున్నా ముఖ్యమంత్రి స్పందించకపోవడం దుర్మార్గమని, తక్షణమే స్పందించి నిరుద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిట్ విచారణ కాకుండా హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని కోరారు. పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన నిరుద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.20,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలను పారదర్శకంగా నిర్వర్తించే వ్యవస్థను అమలు చేయాలని కోరారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బిస్వాల్ కమిటీ చెప్పిన ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వం నిలబడాలని కోరారు. అదేవిధంగా నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, అంబర్‌పేట్ సెక్రెటరీ నాగేందర్, నాయకులు స్టాలిన్, హష్మీ సహన, సంధ్య, శ్రీకాంత్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ హబ్‌గా హైదరాబాద్ : మంత్రి హరీశ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మెడికల్ హబ్‌గా హైదరాబాద్ గుర్తింపు కొనసాగించడంలో నాణ్యమైన వైద్యం అందించడంపై దృష్టి సారించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. సోమవారం హైదరాబాద్ కొండాపూర్‌లో ఆయన శ్రీనిధి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను ఆయన ప్రారంభించారు. మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ అందిస్తున్న సేవలకు ఇలాంటి ఆస్పత్రుల రాక తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీనిధి హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ రవి వర్మ భూపతి, డాక్టర్ జ్యోత్స్న భూపతి రాజు మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని తెలిపారు. 25 ఏండ్లుగా రోగులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

**నేడు మాతా, శిశు ఆస్పత్రికి శంకుస్థాపన**

200 పడకలతో హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలో నిర్మించనున్న ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రికి మంగళవారం ఉదయం 11 గంటలకు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు శంకుస్థాపన చేయనున్నారు. దీనితో పాటు వంద బెడ్ల డయాలసిస్ యూనిట్‌ను, ఎంఆర్ఐ మిషన్ ప్రారంభించడంతో పాటు నిమ్స్‌లో జరిగే కార్యక్రమంలో కొత్తగా నియమితులైన 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామక పత్రాలను మంత్రి అందజేయనున్నారు.

**28.74 శాతం మందికి కండ్లద్దాలు**

రాష్ట్రంలో కంటి వెలుగు రెండో దశ కార్యక్రమం కింద సోమవారం నాటికి 90,42,784 మందికి పరీక్షలు నిర్వహించారు.

# డీజీపీ కార్యాలయంలో వైద్య శిబిరం

**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :** డీజీపీ కార్యాలయంలో మూడ్రోజుల పాటు జరిగే వైద్య శిబిరాన్ని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడ్రోజుల పాటు పోలీసు అధికారులు, సిబ్బందికి 11 రకాల వ్యాధులపై పరీక్షలను నిర్వహిస్తున్నారని డీజీపీ తెలిపారు. ఇందులో ముఖ్యంగా ఆర్థోపెడిక్, షుగర్, బీపీ, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

సంపాదకీయం

# ... మరి ఉద్యమాలకు ఉరేయగలరా?

"అందర్నీ కొట్టేసి పెళ్ళికి మనం నలుగురమే తరలివెళితే ఏం శోభస్కరంగా ఉంటుంది?" మాయాబజార్‌లో దుర్యోధనుడి ప్రశ్న. "నలుగురమేంటి సుయోధనా! నీవు, నీ వెంట నీనూర్గురు తమ్ములూ వెళితే చాలదా?" శకుని మామ జవాబు, "అవునన్నా! అదే మన తక్షణ కర్తవ్యం!" దుశ్శాసనుడు బలపరచడం వెంటవెంటనే జరిగిపోతాయి. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో సదరు దుష్టచతుష్టయం ఇద్దరిలో పరకాయ ప్రవేశం చేసివుంది. తక్షణ సవాలుగా కనబడే వ్యక్తులను, బృందాలను సామ దాన

ఇటీవల ఎయిరిండియా 470 బోయింగ్ విమానాలను, ఎయిర్‌బస్‌లను ఆర్డరిచ్చిన తర్వాత తమదేశంలో కోటీ 47లక్షలమందికి ఉపాధి కల్పించే ఈ డీల్‌ను "చారిత్రాత్మకం" అని బైడెన్ పొగిడాడు. ఇంత పెద్ద ఆర్డరు తమ ఎయిర్‌బస్ కంపెనీకి ఎన్నడూ రాలేదని ఉబ్బి తబ్బిబ్బయ్యాయి ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు. వారికి ఏది ప్రధానమో అర్థం కావడం లేదా? వారికి వ్యాపారం ముఖ్యం. వీరికి అధికారం ముఖ్యం. విజయవంతంగా నడిచే ఈ జగల్‌బందీకి అడ్డుకట్టవేయగలిగేది ప్రజా ఉద్యమాలే!

బేధ దండోపాయాలతో లొంగదీసుకోవడం వారికి అమూల్ 'మఖన్'తో పెట్టిన విద్య! "మేడ్ ఇన్ గుజరాత్!" అంటే ఆ ఇద్దరే కాదు, ఈ ఇద్దరు కూడా పుట్టి, పెరిగి, వికసించింది ఆ నేలమీదే! కాబట్టి లోక్‌సభ ఎన్నికల నాటికి గొంతెత్తే అన్ని పార్టీలనూ పాతరేసి తమ ఏకఛత్రాధిపత్యానికి లైన్‌క్లీయర్ చేసుకోవాలనేది వారి బలమైన కోరిక.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం మనదేశంలో ఎన్నికల సందడి మొదలైంది. పేరంటానికి పిలవగలిగే వారిని పిలుస్తున్నారు. ఇన్నికోట్లు, అన్ని కోట్లు పెట్టుబడులు పెట్టేస్తున్నట్లు వాళ్ళు చెపుతున్నారు. వచ్చేస్తున్నట్లు వీళ్ళు చెప్పేసుకుంటున్నారు. ఇవి సాధారణ పరిస్థితుల్లో ఎన్నికల సిగ్నల్సే కాని, ఏమూల నుండి ఎంత చిన్న విమర్శ దూసుకొచ్చినా పెద్దకర్రతోనే బాదేస్తోంది బీజేపీ.



కాబట్టి ఎన్నికలొచ్చినట్టే. అది సినిమానా, మీడియానా, పౌరసమాజమా అనే దాంతో సంబంధం లేదు. చివరికి జడ్జీలను సైతం 'తుక్డే తుక్డే' గ్యాంగులో కలిపేశారు. "మోడీ హఠావో, దేశ్ కో బచావో" పోస్టర్లు వేసినందుకు ఢిల్లీలో ఆప్ కార్యకర్తలను కటకటాల వెనక్కి నెట్టారు. బీజేపీని సవాలు చేసిన ప్రతి ఒక్క రాజకీయపార్టీ ఈడీ దాడులో, ఐటీ దాడులో ఎదుర్కొంటోంది. సిబిఐ రాడార్‌లో చిక్కుకుని గిలగిల్లాడుతున్నాయి. కన్యాకుమారి నుండి కశ్మీర్ దాకా పాదయాత్ర తర్వాత రాహుల్‌గాంధీ ఛాతి 56×10 అంగుళాల స్థాయిలో మోడీ అండ్ కోకు కనపడుతున్నట్లుంది. 2019లో కర్నాటకలో మట్లాడిన మాటలకు ఆయనకి జైలుశిక్ష, లోక్‌సభ నుండి వెళ్ళగొట్టడం చకచకా జరిగిపోయాయి. ఎన్నికలొచ్చేసరికి రోడ్డంతా సాపుచేసి ఈ దేశాన్ని తనకి పట్టారాసిచ్చారని చెప్పుకునే ప్రయత్నం భారీగా చేస్తోంది బీజేపీ.


హిండెన్‌బర్గ్ ఆరోపణలన్నీ అదానీపైనే, అది కూల్చింది కూడా అదానీ సామ్రాజ్యాన్నే. కానీ వేళ్ళన్నీ మోడీ వైపే తిరిగాయి. నోళ్ళన్నీ మోడీ సర్కార్‌నే విమర్శించాయి. ఆ విమర్శలను పూర్వపక్షం చేసి అగ్నిపునీతుడిగా బయటికి రావల్సిన వ్యక్తి విపక్షం వెన్ను విరిచే ప్రయత్నం చేయటం దుస్సాహసమే!

వ్యక్తులను దండించగలరు. పార్టీల సమూహాన్ని వేధించగలరు. వర్గ పోరాటాలకు ఆనకట్టలు కట్టలేరు. సునామీలను నియంత్రించగల పాలకులు ఇప్పటిదాకా చరిత్రలో పుట్టలేదు. కాలాలకు అతీతంగా పోరాడి, 750మంది అమరులై, అక్షరాల మోడీ మెడలు వంచిన రైతు ఉద్యమం ప్రపంచంలోనే ఓ చారిత్రక ఘట్టం. బడా పెట్టుబడి వెన్ను కాయడమే తమ విద్యుక్త ధర్మమనుకునే పాలకులకు రైతుల పట్టుదల, కార్మికవర్గం నుండి వచ్చిన సంఘీభావం, సహకారం, ఆ పోరాటాన్ని దేశం నలుమూలల్లో రెపరెపలాడించిన అరుణపతాకం ఆ ఉద్యమానికి వెన్నుదన్నై నిలిచింది. పాలకుల్ని వెనక్కి కొట్టింది. ఇప్పటికే విద్యుత్ పంపిణీలో అంబానీ, అదానీ, టాటాలు వేళ్ళూనుకుని ఉన్నారు. వారి ప్రయోజనం కోసం దేశంలోని మొత్తం విద్యుత్‌రంగాన్ని వారికి గోరుముద్దలుగా తినిపించేందుకు విద్యుత్‌చట్టం 2003 తెచ్చింది ఎన్‌డీఏ-1 ప్రభుత్వం. మోడీ-1లోనే ప్రయత్నాలు ప్రారంభించి మోడీ-2లో సవరణచట్టం 2022 పాస్ చేసుకుని ప్రయత్నాలు ఉధృతం చేసింది ప్రభుత్వం. కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలుకు ప్రయత్నించి కార్మికుల ప్రతిఘటనతో తోకముడిచింది. తమ సంపూర్ణ పాలనున్న హర్యానాలో, సంకీర్ణ పాలనున్న మహారాష్ట్రలో బీజేపీకి శృంగభంగమైంది. రైతుల్లాగే ప్రజామద్దతు కూడాగట్టగలిగితే విద్యుత్ సవరణను వెనక్కి నెట్టడం పెద్ద సమస్యే కాదు. నూతన పెన్షన్ స్కీంకి వ్యతిరేకంగా బీజేపీ సానుభూతి పరులతో సహా కోట్లాదిమందిలో వ్యతిరేకత ప్రజ్వరిల్లుతోంది. హిమాచల్‌లో బీజేపీ నుండి అధికారాన్ని ఊడబెరికిన వాటిలో ఎన్‌పిఎస్/ఓపిఎస్ ఒకటి.

మన దేశంలో జరిగే అనేక అంశాలపై గగ్గోలు పెట్టే పశ్చిమదేశాలు ఆర్థిక విధానాలదగ్గరకు వచ్చేసరికి మోడీని మించిన చెలికాడు తమకు దొరకడని విశ్వసిస్తున్నాయి. ఇటీవల ఎయిరిండియా 470 బోయింగ్ విమానాలను, ఎయిర్‌బస్‌లను ఆర్డరిచ్చిన తర్వాత తమదేశంలో కోటీ 47లక్షలమందికి ఉపాధి కల్పించే ఈ డీల్‌ను "చారిత్రాత్మకం" అని బైడెన్ పొగిడాడు. ఇంత పెద్ద ఆర్డరు తమ ఎయిర్‌బస్ కంపెనీకి ఎన్నడూ రాలేదని ఉబ్బి తబ్బిబ్బయ్యాయి ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు. వారికి ఏది ప్రధానమో అర్థం కావడం లేదా? వారికి వ్యాపారం ముఖ్యం. వీరికి అధికారం ముఖ్యం. విజయవంతంగా నడిచే ఈ జగల్‌బందీకి అడ్డుకట్టవేయగలిగేది ప్రజా ఉద్యమాలే!

---

చట్టానికి సంబంధించిన విధి విధానాల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వడానికి, ద్వంద్వ ప్రయోజనాలకు ఉపయోగించిన కొన్ని రుణాలను వదిలిపెట్టడానికి, హిండెన్‌బర్గ్ ఉదంతం బయటపడినప్పటి నుండి సంభవించిన నష్టాల్లో కొన్నింటినైనా భర్తీ చేసుకోవడానికి... అదానీకి కంపెనీకి కొంత సమయం ఇవ్వాలన్నది మోడీ ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. అదానీని రక్షించడంతో పోలిస్తే పార్లమెంట్‌ను స్తంభింపచేయడమనేది పెద్ద విషయమే కాదు. పార్లమెంట్‌ను అదేపనిగా కించపరచడం, దాని ప్రాధాన్యత లేకుండా చేయడం అనేది అదానీ వ్యవహారంలో పాలక పార్టీ మరింత వేగంగా చేసింది.



## అదానీ కోసం
# పార్లమెంటునే తొక్కేస్తున్న ప్రభుత్వం

ఏడు రోజుల పాటు పార్లమెంటరీ కార్యకలాపాలకు అంతరాయం కలిగిన తర్వాత, బడ్జెట్ సమావేశాల రెండో భాగాన్ని కుదించాలని ప్రభుత్వం ఇప్పుడు భావిస్తోంది. పద్దులను గిలెటిన్ చేయడం ద్వారా, ఎలాంటి చర్చ లేకుండా ద్రవ్య బిల్లును ఆమోదించడం ద్వారా సమావేశాలను కుదించడానికి ప్రయత్నిస్తోంది. విదేశాల్లో ఉండగా కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ భారతదేశంలో ప్రజాస్వామ్య స్థితిగతుల గురించి చేసిన వ్యాఖ్యలకుగాను... ఆయన క్షమాపణ చెప్పాలంటూ... మార్చి 13 నుండి పార్లమెంట్ ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది పాలక పార్టీనే. పై చర్య దీని నుంచి ఉద్భవించినదే.

అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై ఎలాంటి చర్చ జరగకుండా నివారిస్తూ, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడానికి ఇదంతా కేవలం ఒక సాకేనని అర్థమైపోతోంది. ఫిబ్రవరి మొదటి వారంలో బడ్జెట్ సమావేశాల ప్రారంభం నుండి అదానీ గ్రూపునకు సంబంధించి వెలువడిన హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చ జరగాలని, సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షం గట్టిగా పట్టుబడుతూనే ఉంది. అప్పటి నుండి, వివిధ షెల్ కంపెనీల్లో గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ పాత్ర గురించి, అలాగే అంబుజా సిమెంట్-ఎసిసి కంపెనీల్లో ప్రమోటర్-ఇన్వెస్టర్‌గా ఆయన కార్యకలాపాల గురించి అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదానీ గ్రూపులో కీలక పెట్టుబడిదారైన ఎలారా అనే విదేశీ సంస్థ ఒక రక్షణ సంబంధమైన కంపెనీలో అదానీతో సహ యజమానిగా ఉందనే దిగ్భ్రాంతికరమైన అంశం బయటపడింది. ఈ విషయాలన్నింటిపైన పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. వివరించాల్సి ఉంది. కానీ, అందుకు బదులుగా రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలంటూ పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజునే జరిగిన దాడికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వం వహించడం మనం చూశాం. ఎలారా వంటి కంపెనీ భారత్‌లో ఒక రక్షణ సంస్థకు అదానీతో కలిసి సహయజమానిగా ఎలా మారిందనే కీలకమైన ప్రశ్నపై సమాధానం చెప్పకుండా దాటేయడానికి పన్నిన ఎత్తుగడేనా ఇది? రాహుల్ గాంధీకి సంబంధించినంత వరకు ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందని, మోడీ ప్రభుత్వం దాన్ని అణచివేస్తోందంటూ ఆయన చేసిన విమర్శలన్నీ దాదాపు ప్రతిపక్ష నేతలందరూ చేసే విమర్శలే. అయితే విదేశీగడ్డపై ఆయన ఇలా విమర్శ చేయడం దేశభక్తి కాదంటూ చేస్తున్న ఆరోపణలు బూటకమైనవి. ఎందుకంటే ప్రభుత్వ పాత్రను విమర్శించడం, ఒక దేశంపై దాడి చేయడం ఒకటి కాదు. కేంబ్రిడ్జిలో చేసిన ప్రసంగంలో అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని అమాయకంగా ప్రశంసించడంతో సహా బ్రిటన్‌లో రాహుల్ గాంధీ వ్యక్తం చేసిన అభిప్రాయాలన్నింటినీ ఎవరైనా సమర్థించాల్సిన అవసరం లేదు. కానీ దేశ విదేశాల్లో ఎక్కడైనా గానీ ప్రభుత్వ నిరంకుశవాద ధోరణిని విమర్శించే హక్కు విడదీయరానిది.


అదానీ అంశంపై బీజేపీ వ్యవహారం ఆశ్చర్యం గొలుపుతోంది. ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా పలు ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఉభయసభల్లో జరిగిన చర్చకు సమాధానమిచ్చే సమయంలో అదానీ పేరును ఒక్కసారి కూడా ప్రస్తావించకుండానే ప్రధాని నరేంద్ర మోడీ గంటల తరబడి మాట్లాడిన తీరు చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఇది చూస్తుంటే హారీపోటర్ పుస్తకాల్లోని అత్యంత ప్రమాదకరమైన, శక్తివంతమైన పాత్ర లార్డ్‌వాల్డ్‌మార్ట్ గుర్తుకు వస్తుంది. 'అస్సలు పేరు చెప్పకూడని వ్యక్తి'గా చాలామంది అతడిని ప్రస్తావిస్తారు. ఇక మోడీ, అదానీల మధ్య సంబంధాల గురించి బయటపడకూడదంటే...న రేంద్ర మోడీ, బీజేపీకి సంబంధించింత వరకు... గౌతమ్ అదానీ అటువంటి 'అస్సలు పేరు చెప్పకూడని వ్యక్తి'.

పార్లమెంట్‌లో ప్రస్తుతం అమలవుతున్న ఎత్తుగడలు చూస్తుంటే, అదానీ గ్రూపుపై పార్లమెంటరీ సమీక్ష జరగకుండా నివారించేందుకు మోడీ ప్రభుత్వం, బీజేపీ ఎంత దూరమైనా వెళతాయని రుజువవుతోంది. ఇన్నేళ్ళ పాటు రెగ్యులేటరీ అధికారుల నోరు మూయించడమే కాకుండా, ఇప్పుడు అదానీ సామ్రాజ్యం గురించి, దాన్ని నిర్మించిన తీరు గురించి ప్రశ్నలు తలెత్తకుండా పార్లమెంట్ నోరు కూడా నొక్కేస్తున్నారు. చట్టానికి సంబంధించిన విధి విధానాల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వడానికి, ద్వంద్వ ప్రయోజనాలకు ఉపయోగించిన కొన్ని రుణాలను వదిలిపెట్టడానికి, హిండెన్‌బర్గ్ ఉదంతం బయటపడినప్పటి నుండి సంభవించిన నష్టాల్లో కొన్నింటినైనా భర్తీ చేసుకోవడానికి... అదానీకి కంపెనీకి కొంత సమయం ఇవ్వాలన్నది మోడీ ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. అదానీని రక్షించడంతో పోలిస్తే పార్లమెంట్‌ను స్తంభింపచేయడమనేది పెద్ద విషయమే కాదు. పార్లమెంట్‌ను అదేపనిగా కించపరచడం, దాని ప్రాధాన్యత లేకుండా చేయడం అనేది అదానీ వ్యవహారంలో పాలక పార్టీ మరింత వేగంగా చేసింది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

---

# కుప్పకూలుతున్న అమెరికన్ బ్యాంకులు


ప్రభాత్ పట్నాయక్

అమెరికాలోని సిలికాన్ వ్యేలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌లు కుప్ప కూలడం వెనక ఉన్న కారణాలు అంత నిగూఢమైనవీ కావు, అర్థం చేసుకోలేనివేమీ కాదు. అంతే కాదు, పెట్టుబడిదారీ ప్రపంచంలోని యావత్తు బ్యాంకింగ్ వ్యవస్థ పైన కారుమబ్బులు కమ్ముకోవడం కూడా అటువంటి విషయమే. ఒకసారి ఆ వ్యవస్థలో కొన్ని భాగాలు పతనం అవుతాయి, ఇంకోవైపు తక్కిన భాగంలోని సంస్థలు మోయలేనంత "విషపూరిత" ఆస్తులతో (పారు బకాయిలు, దివాళాకు సిద్ధంగా ఉన్న కంపెనీల షేర్లు వగైరాలతో) సతమతమవు తుంటాయి. నిజానికి ఈ విషపూరిత ఆస్తులు పతనం చెందిన సంస్థల నష్టాలే. ఆ విధంగా మునిగిపోతున్న పార్శ్వం తక్కిన భాగంలోని సంస్థలను దిగలాగుతూ ఉంటుంది. తన బ్యాంకింగ్ వ్యవస్థ ఇంత తీవ్రమైన ఒత్తిడిలో పడిపోయే పరిస్థితిలోకి అమెరికన్ పెట్టుబడిదారీ విధానం ఎలా నెట్టబడింది? అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. బ్యాంకులు పతనం కావడం, అందునా సిలికాన్ వ్యేలీ బ్యాంక్ వంటిది పతనం కావడం కేవలం ఆ బ్యాంక్‌కి మాత్రమే సంబంధించిన అంతర్గత విషయం కాదు. అది అక్కడ వ్యవస్థలో తలెత్తిన వైరుధ్యాన్ని ప్రతిఫలిస్తోంది. ఇంతకూ ఏమిటా వైరుధ్యం?

ఈ రెండు బ్యాంకులూ పతనం చెందడం వెనుక మనకు కనిపించే తక్షణ కారణం వడ్డీ రేట్లు పెరగడం. ఇక్కడ మనం ప్రస్తుతానికి సిలికాన్ వ్యేలీ బ్యాంక్ వ్యవహారానికి మాత్రం పరిమితం అవుదాం. ఎందుకంటే అక్కడి వ్యవస్థలోని వైరుధ్యాన్ని ఆ బ్యాంకు ఉదంతం స్పష్టంగా వెల్లడి చేస్తోంది. అదే సిగ్నేచర్ బ్యాంక్ వ్యవహారం చూస్తే కాస్త భిన్నంగా ఉంటుంది. ఆ బ్యాంక్ ఎక్కువగా క్రిప్టో కరెన్సీ లావాదేవీలను నడిపింది. ఆ క్రిప్టో కరెన్సీలు దారుణమైన విధంగా అస్థిరతకు లోనవుతాయన్న

పెట్టుబడిదారీ ప్రపంచంలోని బ్యాంకింగ్ రంగానికి ఏర్పడిన ప్రమాదం ఇంకా పూర్తిగా తారాస్థాయికి చేరుకోలేదు. రానున్న కాలంలో వడ్డీ రేట్లను ఇంకా పెంచాలని ముందు అనుకున్న ఫెడరల్ రిజర్వు బోర్డు ఇప్పుడు రెండు పెద్ద బ్యాంకులు దెబ్బ తిన్న తర్వాత కాస్త నెమ్మదిగా ముందుకు కదలాలని అనుకుంటోంది. కాని ద్రవ్యోల్బణం కొనసాగినప్పుడు దానికి వడ్డీ రేట్లు మరింత పెంచడం మినహా వేరే మార్గం లేదు. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి నిరుద్యోగాన్ని పెంచడం ఒక్కటే దానిదగ్గరున్న మార్గం.

సంగతి తెలిసినదే.

వడ్డీరేట్లు పెరిగితే బాండ్ల ధరలు వాటంతట అవే తగ్గుతాయి. ఒక బాండు ఎంత కాలానికి ఇవ్వబడిందో ఆ మొత్తం కాలం అంతటికీ (దానినే బాండు జీవితకాలం అంటారు) దానిపై వచ్చే నిజ ఆదాయం బట్టి బాండు ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారపడి ఉంటుంది. (ఉదా హరణకు: ఒక బాండు మీద పదేండ్ల తర్వాత 10శాతం అదనంగా ఇస్తాం అని చెప్పి బాండు అమ్మారనుకుందాం. బాండును కొన్ననాటికి రూపాయి విలువ కన్నా పదేండ్ల తర్వాత ఆ రూపాయి విలువ పడిపోతే, అప్పుడు ఆ బాండు ద్వారా వచ్చే నిజ ఆదాయం తగ్గుతుంది) అందుచేత బ్యాంకుల వడ్డీ రేట్లు పెరిగితే కరెన్సీ నిజవిలువ తగ్గుతుంది గనుక బాండ్ల మార్కెట్ విలువ తగ్గిపోతుంది. అప్పుడు బ్యాంకు వద్ద తనఖా కింద ఉన్న బాండ్లకు విలువ తగ్గిపోతుంది. అంటే బ్యాంకు దగ్గర ఉన్న ఆస్తుల విలువ తగ్గుతుంది. ఆ మేరకు సాపేక్షంగా అప్పుల భారం పెరుగుతుంది. దాని వలన బ్యాంకులు ఒత్తిడికి లోనవుతాయి.

ఈ ఒత్తిడిని అధిగమించడానికి బ్యాంకు ఏవైనా చర్యలు చేపడితే అప్పుడు ఆ బ్యాంకు తాను ఒత్తిడిలో ఉన్నట్టు ఈ ప్రపంచం ముందు అంగీకరించినట్టు అవుతుంది. అటువంటి చర్యలు చేపట్టగానే ప్రజలకు దానిపై నమ్మకం సన్నగిల్లుతుంది. దానివలన ఆ బ్యాంకు వాటాల విలువ పడిపోతుంది. వాటాల విలువ పడిపోయిందని తెలియగానే డిపాజిటర్లు గాబరా పడి తమ డిపాజిట్లను వాపసు తీసుకోవడం ప్రారంభిస్తారు. ఒకసారి డిపాజిట్లు వెనక్కి తీసుకోవడం మొదలవగానే ఆ బ్యాంకు ఒక్కసారిగా కుప్పకూలుతుంది. అంటే ఒకసారి బ్యాంకు ఒత్తిడికి లోనవుతే, ఆ పైన దానినుండి బయటపడడానికి అది ఏమి చేసినా అది పతనానికే దారి తీస్తుంది. ఒత్తిడిని అధిగమించడానికి చర్యలు చేపడితే ఏమవుతుందో చెప్పాం. ఒకవేళ ఏ చర్యలూ చేపట్టకుండా ఉంటే అప్పుడు కూడా పతనం ఖాయం. అందుచేత ఆ బ్యాంకు పతనానికి బాధ్యత అంతా ఆ బ్యాంకుదే అని నెట్టెయ్యలేం. ఆ దేశంలోని స్థూల ఆర్థిక విధానాల ప్రభావం ఏమిటన్నదానిని పరిశీలించాలి.

వడ్డీ రేట్లు పెంచగానే బ్యాంకులు పతనం చెందుతాయన్న అభిప్రాయానికి ముందు చెప్పిన వాదనను బట్టి వచ్చేయ కూడదు. రిజర్వు బ్యాంకు ఆదేశాలమేరకు వడ్డీ రేట్లలో మార్పులు చిన్న చిన్న మోతాదుల్లో జరుగుతూవుంటాయి. ఒక చిన్న మోతాదులో వడ్డీ రేటు పెరిగితే దాని ఫలితంగా బ్యాంకు మీద వచ్చే ఒత్తిడిని తట్టుకోవడం సాధ్యమే. మార్కెట్‌లో ఎటువంటి అలజడికీ తావివ్వకుండా బ్యాంకులు తట్టుకో గలుగుతాయి. కాని హఠాత్తుగా కేంద్ర రిజర్వు బ్యాంకు వడ్డీ రేటును గణనీయంగా పెంచివేసిందనుకోండి. అప్పుడు తమ ఆస్తులు-అప్పుల నడుమ సమతూకం కొనసాగే విధంగా ఎటువంటి గందరగోళానికీ తావులేకుండా చర్యలు తీసుకోవడం బ్యాంకులకు అసాధ్యం అయిపోతుంది.

ఇప్పుడు అమెరికాలో వడ్డీ రేట్లను అక్కడి ఫెడరల్ రిజర్వు గణనీయంగా పెంచింది. 2022 ఫిబ్రవరిలో 0.25శాతం ఉన్న వడ్డీ రేటు ఫిబ్రవరి 2023 వచ్చేసరికి అమాంతం 4.75కి పెరిగింది. ఇంత తక్కువ వ్యవధిలో అంత ఎక్కువ స్థాయిలో వడ్డీ రేటును పెంచినందువలన బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను సర్దుబాటు చేసుకోవడం వాటికి అసాధ్యమే అయింది. ఇక్కడ ప్రశ్న ఏమంటే, అమెరికన్ ఫెడరల్ రిజర్వుబ్యాంకు ఎందుకు ఇంత హఠాత్తుగా ఇంత ఎక్కువ మోతాదులో పెంచింది?

నయా ఉదారవాద వ్యవస్థలో ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోగలిగిన ఒకే ఒక్క దారి అది అనుసరించే ద్రవ్య విధానమే. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో చాలా కాలం పాటు ప్రభుత్వం జోక్యం చేసుకో గలిగింది. అలా జోక్యం చేసుకోగలిగిన శక్తి నయా ఉదారవాద కాలంలో బాగా తగ్గిపోయింది. జీడీపీతో పోల్చినప్పుడు ద్రవ్యలోటు ఒకానొక స్థాయికి మించకుండా ఉండాలనే షరతును అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అన్ని ప్రభుత్వాల మీద విధించింది. అదే సమయంలో పెట్టుబడిదారుల పైన, సంపన్నులపైన పన్నులు పెంచడాన్ని కూడా నియంత్రించింది.

నయా ఉదారవాద వ్యవస్థలో ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోగలిగిన ఒకే ఒక్క దారి అది అనుసరించే ద్రవ్య విధానమే. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో చాలా కాలం పాటు ప్రభుత్వం జోక్యం చేసుకోగలిగింది. అలా జోక్యం చేసుకోగలిగిన శక్తి నయా ఉదారవాద కాలంలో బాగా తగ్గిపోయింది. జీడీపీతో పోల్చినప్పుడు ద్రవ్యలోటు ఒకానొక స్థాయికి మించకుండా ఉండాలనే షరతును అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అన్ని ప్రభుత్వాల మీద విధించింది.

అటువంటి పరిస్థితిలో దేశ ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకోడానికి వడ్డీ రేట్లు తగ్గించడం ఒక్కటే ప్రభుత్వానికి మిగిలిన దారి.

బడ్జెట్‌లో ద్రవ్యలోటును నియంత్రించే చట్టం (మన దేశంలో ఉన్నట్టు) ఏదీ అమెరికాలో లేదు. అమెరికా నుండి ద్రవ్య పెట్టుబడి ఇంకెక్కడికో బయటకు పోతుందన్న భయమూ ఆ దేశానికి లేదు. అటువంటప్పుడు ద్రవ్యలోటును పరిమితం చేసుకోవలసిన ఆవశ్యకత ఆ దేశానికి లేదు. కాని అమెరికాలో ద్రవ్యలోటును పెంచి ఆర్థిక వ్యవస్థవేగాన్ని పెంచాలనుకుంటే దాని వలన ఇతర దేశాల్లో ఉద్యోగాలు కొత్తగా కల్పించబడతాయి తప్ప అమెరికాలో కాదు. (అమెరికాలో ప్రజల కొనుగోలుశక్తి పెరిగితే వారికి కావలసిన సేవలు, సరుకులు విదేశాలనుండి తెచ్చుకోవలసిందే) పైగా విదేశీ రుణం పెరుగుతుంది. నిజానికి కరోనా మహమ్మారి కాలంలో అమెరికా తన ద్రవ్య లోటును భారీగా పెంచింది.




కొందరు దాని వల్లనే ఇప్పుడు ద్రవ్యోల్బణం పెరిగిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. హౌసింగ్ బుడగ పేలిపోయిన తరువాత (సబ్‌ప్రైమ్ సంక్షోభం) చాలా కాలం పాటు వడ్డీ రేట్లను కనిష్ఠ స్థాయి వరకూ తగ్గించివేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో ఊపు తీసుకురావడానికి అమెరికా ప్రయత్నించింది. దాదాపు సున్నా వడ్డీ రేట్లు అమలులోకి వచ్చాయి.

2008లోహౌసింగ్ బుడగ పేలిపోయింది. 2009 నుంచీ 2022 వరకూ అమెరికాలో వడ్డీ రేట్లు 0.25శాతం దగ్గర కొనసాగాయి. మధ్యలో 2016 నుండి 2020 కాలంలో దానిని క్రమంగా పెంచుతూ 2శాతం దాకా తెచ్చారు. ఆ తర్వాత మళ్ళీ 2022 దాకా తగ్గింది. ఇంత అసాధారణంగా దీర్ఘ కాలం పాటు ఇంత అసాధారణంగా తక్కువ వడ్డీ రేట్లు కొనసాగించడం వలన అమెరికన్ గుత్తాధిపతులు ఎటువంటి ఇబ్బందీ లేకుండానే తమ సరుకుల రేట్లను, దానితోబాటు లాభాలను పెంచుకుంటూ పోయారు. అది అంతిమంగా ప్రస్తుత ద్రవ్యోల్బణానికి దారి తీసింది. కాని అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో ఉపాధికల్పన చాలినంత ఎక్కువ స్థాయికి ఏమీ పెరగలేదు. అధికారిక లెక్కల ప్రకారం నిరుద్యోగం 4శాతానికి తగ్గింది. కాని అదే సమయంలో ఉత్పత్తి క్రమంలో కార్మికులు పాల్గొనే రేటు (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్‌రేట్) మాత్రం తగ్గింది. ఈ రేటు 2008 నాటి స్థాయిలోనే కొనసాగుతున్నట్టు అనుకున్నా నిరుద్యోగం మాత్రం అప్పటినుంచీ ఎక్కువ స్థాయిలోనే కొనసాగింది. ద్రవ్యోల్బణం పెరగ్గానే వడ్డీ రేట్లు అమాంతం పెంచివేశారు. ఈ విధంగా హేతువిరుద్ధంగా ద్రవ్య విధానంలో మార్పులు చేయడం, వడ్డీ రేట్లలో ఉన్నట్టుండి మార్పులు తేవడం చూస్తే అంతర్జాతీయంగా వేగంగా సంచరించే ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతున్నంతకాలం పెట్టుబడిదారీ విధానం పరిధిలో ప్రత్యామ్నాయాలు వేరే లేవు అన్నది కనిపిస్తోంది. ఈ విధంగా తలా తోకా లేని విధంగా వ్యవహరించడం అనేది ప్రభుత్వం వైపు నుండి తలెత్తిన లోపంగా అనుకోలేం. ఇది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం వలన తలెత్తిన ధోరణి.

ఈ విధంగా పెద్ద స్థాయిలో అటూ, ఇటూ మారిపోయే విధానం వెనుక మరో అంశం కూడా ప్రభావితం చేస్తున్నది. వడ్డీరేట్లు తగ్గిపోయి, దానివలన బాండ్ల విలువలు పెరిగిపోతే, దాని కారణంగా ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకోవడం జరిగినా, జరగకున్నా, బ్యాంకింగ్ వ్యవస్థకు మాత్రం దానివలన ఎటువంటి ముప్పూ ఉండదు. బ్యాంకుల ఆస్తుల విలువలు పెరగడం ఆ బ్యాంకులను ఏ విధంగానూ దెబ్బ తీయదు. కాని, వడ్డీ రేట్లు పెరిగి, బాండ్ల విలువలు పడిపోతే, బ్యాంకుల ఆస్తుల విలువలు వాటి అప్పుల విలువలతో పోల్చినప్పుడు పడిపోతాయి. దీని వలన మార్కెట్‌లో ప్రతిస్పందనలు కలుగుతాయి. అప్పుడు బ్యాంకులు తమ వ్యాపారాన్ని కొనసాగించలేని పరిస్థితులు వస్తాయి. ఈ విధంగా వడ్డీ రేట్ల పెంపు ఒక విధంగా, తగ్గింపు మరో విధంగా బ్యాంకులమీద ప్రభావం చూపడం వలన బ్యాంకింగ్ వ్యవస్థ మరింత దెబ్బ తింటుంది.

ఇప్పుడు వడ్డీ రేట్లు పెరిగినందువలన కేవలం అమెరికన్ బ్యాంకింగ్ వ్యవస్థ మాత్రమే కాదు, యావత్తు పెట్టుబడిదారీ వ్యవస్థలోని బ్యాంకింగ్ రంగం ముప్పునెదుర్కొంటోంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించ డానికి వడ్డీ రేట్లు పెంచడం ఒక్కటే అధికారికంగా మార్గంగా పరిగణిస్తున్న కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. చివరికి చాలా ప్రతిష్ఠ కల క్రెడిట్ అండ్ సూయిస్సె బ్యాంక్ కూడా తన వాటాల ధరలు పతనం అవుతున్న పరిస్థితిని చవిచూస్తోంది. దానికి ప్రధాన పోటీదారు అయిన యుబిఎస్ (స్విస్ బ్యాంక్) ఇప్పుడు స్వాధీనం చేసుకోడానికి సిద్ధపడుతోంది.

పెట్టుబడిదారీ ప్రపంచంలోని బ్యాంకింగ్ రంగానికి ఏర్పడిన ప్రమాదం ఇంకా పూర్తిగా తారాస్థాయికి చేరుకోలేదు. రానున్న కాలంలో వడ్డీ రేట్లను ఇంకా పెంచాలని ముందు అనుకున్న ఫెడరల్ రిజర్వు బోర్డు ఇప్పుడు రెండు పెద్ద బ్యాంకులు దెబ్బ తిన్న తర్వాత కాస్త నెమ్మదిగా ముందుకు కదలాలని అనుకుంటోంది. కాని ద్రవ్యోల్బణం కొనసాగినప్పుడు దానికి వడ్డీ రేట్లు మరింత పెంచడం మినహా వేరే మార్గం లేదు. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి నిరుద్యోగాన్ని పెంచడం ఒక్కటే దానిదగ్గరున్న మార్గం. నిరుద్యోగం పెరగాలంటే వడ్డీ రేట్లు పెంచాలి. ఇలా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంతో తలకిందులవుతున్న సమయంలో కార్మిక వర్గం యూరప్ యావత్తూ నిరసన ప్రదర్శనలతో హోరెత్తిస్తోంది. ఈ నయా ఉదారవాద దశలో పెట్టుబడిదారీ విధానం ముందున్న దారి మూసుకుపోయిందని ఇప్పటి పరిస్థితి సూచిస్తోంది.

- (స్వేచ్ఛానుసరణ)

---

# మోడీకి భారతీయుల ప్రశ్న!

"ప్రజల ప్రగతి కోసం పరిశ్రమిస్తూ, ప్రజాభిమానంతో విస్తరించేది ప్రజాస్వామ్య పార్టీ" "ప్రతిపక్షాల వారిని అణిచేసి విస్తరించేది ఫాసిస్టుపార్టీ" 'బీజేపీ' ఎలాంటి పార్టీయో మీ చర్యల ద్వారా తెలియజెప్పారు. ధన్యవాదాలు మోడీజీ!

కొందరు ఉగ్ర మూకలున్నంత మాత్రాన ముస్లింలంతా ఉగ్రవాదులనటం ఎంత తప్పో గాంధీని చంపిన గాడ్సే హిందువైనంత మాత్రాన హిందువులంతా హంతకులనడం అంతే తప్పు. నీరవ్ మోడీ, నిషన్ మోడీ, లలిత్‌మోడీ వంటివాళ్ళు వేల కోట్లు బ్యాంకుల ధనం కొల్లగొట్టినంత మాత్రాన, ప్రజాధనానికి కాపలాదారుగా ఉంటానన్న వాగ్దానంతో గద్దెనెక్కిన నరేంద్రమోడీ వాళ్ళను పట్టించుకోనంత మాత్రాన దొంగలందరికీ మోడీ ఇంటిపేరు ఏమిటి? అని రాహుల్ అడగడంలో తప్పేముంది. విజయ్‌మాల్యా, మెహుల్ చోక్సీ, నీరవ్ మోడీ, పుష్పేష్ బైద్యా, సస్వీకలారా, జతిన్ మెహతా, ఉమేష్ పరిఖ్, వినయ్ మిట్టల్, ఏకలవ్యగార్గ్, చేనేత జయంతిలాల్, రాజీవ్ గోయల్, రితేష్ జైన్, మయూరిబెన్ పటేల్, ఆశిష్ సురేష్‌భాయ్ మొదలైన 28మంది భారతీయ బ్యాంకుల నుండి కొల్లగొట్టిన ధనం అక్షరాలా 'పదిలక్షల కోట్ల రూపాయలు'. వీళ్ళంతా ఘరానా హిందూ వ్యాపారులే! అంతమాత్రాన హిందూ వ్యాపారు లంతా దొంగలనవచ్చా? పై 28మందిలో విజయమాల్యా తప్ప తక్కిన వాళ్ళంతా గుజరాతీయులే! అయినంత మాత్రాన గుజరాతీయులంతా దొంగలనవచ్చా? భారత స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్నే అర్పించిన మన జాతిపిత గాంధీ గుజరాతీయుడే గదా! వల్లభ్‌భాయ్ పటేల్ గుజరాతీయుడేగా?!


పాతూరి వెంకటేశ్వరరావు
9849081889

ప్రస్తుతం మన పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతలను మట్లాడనివ్వని మాట నిజం! చర్చకు పెట్టకుండానే బిల్లులు, చట్టాలను మోడీ ప్రభుత్వం చేస్తున్నదీ నిజం! అయినా సరే ఈ వాస్తవాలను విదేశాల్లో చెప్పకోవటం, మనదేశానికి అవమాన కరం కదా? అనేది మోడీ సర్కార్ వాదన. 'మా దేశపు గత పాలకులు ఏడు శతాబ్దాలుగా అభివృద్ధి చేయనందున భారతీయులు వలస వెళ్ళారు' అని నరేంద్రమోడీ విదేశాల్లో ఎలుగెత్తి చాటటమూ మనదేశానికి అవమానకరమే! ఆ మాటకొస్తే యూపీఏ పదేండ్ల పాలనలో వలస వెళ్ళిన భారతీయులకు రెట్టింపు సంఖ్యలో మోడీ పాలనలో వలస వెళ్ళినట్లు గణాకాంలు చెబుతున్నాయి.

ఎందుకంటే? ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానన్న వాగ్దానంతో గద్దెనెక్కిన మోడీ, కొత్త ఉద్యోగాలివ్వకపోగా, పెద్దనోట్ల రద్దు కారణంగా లక్షలాది పరిశ్రమలు మూతబడి, కోట్లాది కార్మికులు, ఉద్యోగులు వీధినపడ్డారు. వాళ్ళకు వలసలే గతయ్యాయి. మరి స్వదేశీ లోటుపాట్లను విదేశాల్లో వెల్లడించిన రాహుల్ గాంధీ దేశద్రోహి అయితే, అదే పని చేసిన మోడీ దేశభక్తుడెలా అవుతాడు? బీజేపీ ఆరెస్సెస్ వాళ్ళకిది భారతీయుల ప్రశ్న!

సరే.. ఒకసభలో దొంగల పేర్లన్నీ మోడీలే అన్నాడన్న నెపంతో అందుకు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసేదాకా, ప్రణాళికా బద్ధంగా మీరు చేసిన కృషికి, నెహ్రూ వారసుల అడ్డు తొలగించుకుంటే మీకిక ఎదురుండదన్న మీ ఎత్తుగడకు 'అభినందనలు!'. కానీ దేవాలయంగా భావించి మీరు ప్రణమిల్లిన నిండు లోక్‌సభలో 'నువ్వేతండ్రికి పుట్టావంటూ ఎంపీ రాహుల్‌గాంధీని ఘోరంగా అవమానించిన సన్నివేశం, కౌరవసభలో ద్రౌపతీ వస్త్రాపహరణ సన్నివేశాన్ని తలపించి భారతీయులంతా కుత కుత లాడిపోయారు మోడీజీ! కానీ మీకు చీమకుట్టినట్టు కూడా లేదు. ఎందుకంటే మీరా సభలో ధృతరాష్ట్రునిలా వ్యవహరించారు గదా? లేకుంటే దుశ్శాసనుని వంటి సదరు బీజేపీ ఎంపీని ఎందుకు శిక్షించలేదు? అది సరే, భర్త ఇంటిపేరు భార్యకు, తండ్రి ఇంటిపేరు బిడ్డకు వర్తిస్తుందని తెలిసికూడా నెహ్రూ పేరెందు కు పెట్టుకోలేదంటూ ఇందిరాగాంధీని, రాహుల్



గాంధీని అవహేళన చేసిన మీరు శిక్షార్హులు కాదా?

గత ప్రధానులందరికన్నా మామోడీ గొప్పవాడు, విశ్వగురువంటూ మీ బీజేపీ, మీ మీడియా ఊదరగొడుతున్నయి. మరి సర్వోత్తమ ప్రధానిగా భారతీయులకు కలకాలం గుర్తుండి పోయేలా మీరు చేసిన ఒక్కటంటే ఒక్క ఘనకార్యాన్ని చెప్పగలరా మోడీజీ? నెహ్రూగారి నుండి మన్మోహన్‌సింగ్ వరకు ప్రతి ప్రధానీ కొత్త కొత్త ప్రభుత్వ సంస్థల్ని నెలకొల్పి రిజర్వేషన్లు కల్పించి సామాజిక సమతుల్యతకు పాటుపడిన ప్రజానేతలే మోడీజీ! 'వాజ్‌పేయి' ఏడింటిని అమ్మినా, కొత్తగా 17 సంస్థల్ని నెలకొల్పాడు మన్మోహన్‌సింగ్ మూడింటిని అమ్మినా 23 సంస్థల్ని నెలకొల్పాడు. ప్రయివేటీకరణ పాపం కాంగ్రెస్‌దే అంటూ, మీరు పాపాన్ని కడిగేసుకో వాలనుకుంటున్నారు. పి.వి. 14 ప్రభుత్వరంగ సంస్థల్ని నెలకొల్పాడన్నది జగమెరిగిన సత్యం! కొత్తగా ఒక్కటంటే ఒక్క సంస్థను నెలకొల్ప కలిగారా? ఉన్న ప్రభుత్వ సంస్థల్ని తెగనమ్ముతున్న భారత ఏకైక ప్రధాని తమరే, తమరే, తమరే మోడీజీ!

పటేల్ విగ్రహాన్ని ఎందుకు నెలకొల్పాడుమోడీ! అడుగుతున్నారు ప్రజలు! లేకుంటే నాడు ఆరెస్సెస్‌ను నిషేధించిన పటేల్ విగ్రహాన్నెందుకు నెలకొల్పేవాడు? పోనీ పటేల్ పట్ల ప్రత్యేక గౌరవంతో నెలకొల్పాడనే అనుకుందాం! అదే నిజమైతే గుజరాత్‌లోని స్టేడియంకు పటేల్‌పేరు తొలగించి 'నరేంద్రమోడీ స్టేడియం' అని తన పేరెందుకు పెట్టుకున్నట్లు? అని కూడా చర్చించుకుంటున్నారు ప్రజలు.

స్వాతంత్ర్య సమర వీరునిగా ఏండ్ల తరబడి జైళ్ళలో మగ్గి, భారత తొలి ప్రధాని అయిన నెహ్రూ 32 ప్రభుత్వ రంగ సంస్థల్ని నెలకొల్పి, రిజర్వేషన్లు కల్పించి, సామాజిక సమతుల్యతకు బీజం వేశాడు! హీరాకుడ్, బాక్రానంగల్, నాగార్జున సాగర్ వంటి భారీ ఆనకట్టల ద్వారా వ్యవసాయాభివృద్ధికి - రూర్కెలా, భిలాయ్ వంటి ఉక్కు కర్మాగారాల ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ధృఢమైన పునాది వేసిన నెహ్రూతో మోడీకి పోటీనా?

'అధికార వాంఛ' ఎంత కర్కశంగా, కృతజ్ఞతారహితంగా వ్యవహరిస్తుందో ప్రతిపక్ష పార్టీలకు, ప్రజలందరికీ మీ చర్యల ద్వారా రుజువు చేస్తున్నారు! గుజరాత్ అల్లర్ల కారణంగా వాజ్‌పేయితో సహా దేశ దేశాల వారి మీ రాజీనామా డిమాండ్ నుండి కాపాడిన అద్వానీని అడ్డుతొలగించుకున్నారు. కాంగ్రెస్ వ్యతిరేక అవినీతి ఉద్యమం ద్వారా అన్నహజరేతో పాటు మీ విజయానికి తోడ్పడిన కేజ్రీవాల్‌ను అడ్డు

'అధికార వాంఛ' ఎంత కర్కశంగా, కృతజ్ఞతారహితంగా వ్యవహరిస్తుందో ప్రతిపక్ష పార్టీలకు, ప్రజలందరికీ మీ చర్యల ద్వారా రుజువు చేస్తున్నారు! గుజరాత్ అల్లర్ల కారణంగా వాజ్‌పేయితో సహా దేశ దేశాల వారి మీ రాజీనామా డిమాండ్ నుండి కాపాడిన అద్వానీని అడ్డుతొలగించుకున్నారు. కాంగ్రెస్ వ్యతిరేక అవినీతి ఉద్యమం ద్వారా అన్నహజరేతో పాటు మీ విజయానికి తోడ్పడిన కేజ్రీవాల్‌ను అడ్డు తొలగించుకునే పనిలో ఉన్నారు. అలాంటి మీరు రాహుల్‌గాంధీ పట్ల తద్భిన్నంగా వ్యవహరిస్తారని అనుకోవటం అవివేకమేననుకుంటున్నారు ప్రజలు.

తొలగించుకునే పనిలో ఉన్నారు. అలాంటి మీరు రాహుల్‌గాంధీ పట్ల తద్భిన్నంగా వ్యవహరిస్తారని అనుకోవటం అవివేకమేననుకుంటున్నారు ప్రజలు.

మన కష్టజీవుల ఓట్లతో గద్దెనెక్కిన మోడీ మనకోసం ఏమి చేయకపోగా మన పెద్దలు కూడ బెట్టిన సంస్థల్ని, బ్యాంకుల్లోని మనడబ్బును కార్పొరేట్లకు కట్టబెడుతున్నాడు. ఉదాహరణకు గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో పాటు 18వేల ఎకరాల భూముల్ని రూ.3వేల చొప్పున ఆదానీకి కట్టబెట్టాడు మోడీ! కార్పొరేట్లకు లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశాడు. వాళ్ళ టాక్సును 23శాతం నుండి 15శాతానికి తగ్గించాడు. ఆలోటు భర్తీ కోసం పిల్లలు తాగేపాలు, పెరుగు, రాసుకునే పుస్తకాలు, పెన్సిల్, రబ్బర్ల మీద సామాన్యులు వాడుకునే పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లపై భారీగా పన్ను విధించాడు! బీసీనని చెప్పకుంటూ బడాకార్పొరేట్ల సేవలో తరిస్తున్నాడు మోడీ! అంటూ బావురు మంటున్నారు ప్రజలు! రంగుతో వచ్చిన జట్టు నల్లదనం - ప్రచారంతో వచ్చిన నాయకుని గొప్పతనం ఆట్టే నిలవవు మోడీజీ!

మీ తొమ్మిదేళ్ళ పాలనలో, భారతదేశానికి వివిధ రంగాలలో మీరు సాధించిన అంతర్జాతీయ ర్యాంకులను బట్టి, గత ప్రధానుల కన్నా మీరేపాటి గొప్పవారో మీరే బేరీజు వేసుకోండి మోడీజీ!

# అమ్మాయిల తడాఖా...



'కంటే కూతుర్నే కనాలి' అనిపించేలా చేశారు మన భారతీయ మహిళా బాక్సర్లు. నిఖత్ జరీన్, లోవ్లినా బోర్గోహైన్, సావీటీ బూరా (స్వీటీ), నీతు ఘంఘాస్... సొంత గడ్డపై ఒకే సారి నాలుగు బంగారు పథకాలు సాధించి దేశం గర్వపడేలా చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) పోటీల్లో మహిళా శక్తిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన వారి పరిచయం నేటి మానవిలో క్లుప్తంగా...

## తొలి తెలుగు అమ్మాయి



ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ వరుసగా రెండో ఏడాది విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ఒళ్లంతా దెబ్బలు, రక్తంతో తడిసిన బిడ్డను చూసి తల్లి భయపడింది.. బాక్సింగ్ చేసే అమ్మాయికి పెండ్లి కాదని తండ్రిని భయపెట్టారు. అయినా వెనుకాడలేదు. సీనియర్ విభాగంలో దిగ్గజ మేరీకోమ్ తర్వాత ఒకటి కంటే ఎక్కువ సార్లు ప్రపంచ టైటిల్ నెగ్గిన రెండో భారత బాక్సర్‌గా నిఖత్ ఘనత సాధించింది. ఢిల్లీలో జరిగిన అంతర్జతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) వరల్డ్ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం 50 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్లో ఆమె 5-0 తేడాతో గెలుపొందింది. బాక్సింగ్‌లో రెండుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తొలి తెలుగు అమ్మాయిగా రికార్డ్ సృష్టించింది.

### తండ్రి ప్రోత్సాహంతో...

నిజామాబాద్‌లో పుట్టిపెరిగిన నిఖత్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. నిఖత్ జరీన్ తండ్రి మహమ్మద్ జమీల్ అహ్మద్ తన కుమార్తెను బాక్సింగ్‌లో ప్రోత్సహించి స్వయంగా తనే ఒక ఏడాది పాటు శిక్షణ ఇచ్చారు. 2009లో విశాఖపట్నానికి చెందిన ద్రోణాచార్య అవార్డీ ఐవీ రావు దగ్గర ఆమె శిక్షణ పొందింది. అప్పటి నుంచీ పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో ఆడుతూ వచ్చింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా టార్గెట్ ఒలంపిక్ పోడియం స్కీమ్‌కి ఎంపిక అయింది. 2011లో టర్కీలోని అంటాల్యాలో జరిగిన అంతర్జాతీయ విమెన్స్ యూత్ అండ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలవడం ఆమె కెరీర్‌లో తొలి పెద్ద అడుగు. గత ఏడాది తొలిసారి వరల్డ్ చాంపియన్‌గా నిలిచారు.

### బాక్సింగ్ ప్రస్థానం...

మొదట్లో నిజామాబాద్ పట్టణంలోని కలెక్టరేట్ గ్రౌండ్‌లో పరుగు ప్రాక్టీస్ చేసేది నిఖత్. ఆమె 100, 200, 300 మీటర్ల పరుగు ప్రాక్టీస్ చేసేది. ఆమెను గొప్ప అథ్లెట్‌గా తీర్చిదిద్దాలన్నది తండ్రి జమీల్ కల. రోజూ గ్రౌండ్‌కు తీసుకెళ్లి, తీసుకువస్తుండే వారు తండ్రి. గ్రౌండ్ తర్వాత స్కూల్. స్ప్రింట్ ప్రాక్టీస్ చేస్తోన్న నిఖత్ అదే గ్రౌండ్‌లో జరుగుతోన్న బాక్సింగ్ ట్రైనింగ్ కూడా గమనించేది. అక్కడ చాలా మంది అబ్బాయిలు శిక్షణ తీసుకునే వారు. ఒకరోజు ఆ శిక్షణ సాగుతున్నప్పుడు తాను బాక్సింగ్ నేర్చుకుంటాను అని అడిగింది తండ్రిని. 'అది మగ పిల్లల ఆట. రఫ్ గేమ్. దెబ్బలు తగులుతాయి. దెబ్బల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయి' అన్నాడు తండ్రి. కానీ తను మాత్రం కష్టపడతానంది. దాంతో తండ్రి ఒప్పుకున్నాడు. ఇలా 12 ఏండ్లకే క్రీడల్లో తన ప్రయాణం ప్రారంభించింది నిఖాత్. అలా చేరిన ఆమెను అప్పట్లో నిజామాబాద్‌లో మగవారికి బాక్సింగ్ శిక్షణ ఇస్తున్న కోచ్ ప్రోత్సహించారు. ఏడాదిలోనే బాక్సింగ్‌లో మంచి నైపుణ్యంతో జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం మొదలుపెట్టింది. జాతీయ స్థాయిలో బ్రాంజ్, తర్వాత గోల్డ్ సాధించి.

## ప్రపంచ ఛాంపియన్‌షిప్



**సావీటీ బూరా...** 2023 ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని, 2014 ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో లైట్ హెవీవెయిట్ విభాగంలో రజత పతకాన్ని గెలుచుకుంది. ఆమె సోదరి సివి బూరా కూడా భారతీయ బాక్సర్. బూరా 10 జనవరి 1993న హర్యానాలోని హిసార్ గ్రామీణ ప్రాంతంలో జన్మించింది. ఆమె తండ్రి మహేందర్ సింగ్, ఒక రైతు. అలాగే జాతీయ స్థాయిలో బాస్కెట్‌బాల్ ఆడాడు. బూరా 2009లో తన తండ్రి కోరిక మేరకు బాక్సింగ్‌కు మారింది. అంతకు ముందు ఆమె రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారిణి. ఆమె తన క్రీడా ప్రస్థానాన్ని ప్రారంభించిన కొత్తలో చౌదరి చరణ్ సింగ్ హర్యానా అగ్రికల్చరల్ యూనివర్శిటీ సమీపంలోని వ్యవసాయ భూములలో శిక్షణ పొందింది. క్రీడలోను తన కెరీర్‌గా కొనసాగించేందుకు హర్యానా నుండి ఢిల్లీకి వచ్చింది. ఈమె 7 జూలై 2022న దీపక్ నివాస్ హుడాను వివాహం చేసుకున్నాడు.

### ఫైనల్‌కు చేరిన ఏకైక భారతీయురాలు

జెజు సిటీలో జరిగిన 2014 ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బూరా లైట్ హెవీవెయిట్ (81 కిలోలు) ఈవెంట్‌లో ఫైనల్‌లో చైనా బాక్సర్ యాంగ్ జియోలీ చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని గెలుచుకుంది. 2015 ఆసియా మహిళల అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో వులాంచబులో జరిగిన ఈవెంట్‌లో ఫైనల్ చేరిన ఏకైక భారతీయురాలు బూరా. అదే ప్రత్యర్థితో ఓడిపోయి రజతం సాధించింది.

### ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లు

2017లో బూరా క్రీడా విజయాలకు హర్యానా ప్రభుత్వం నుండి భీమ్ అవార్డును అందుకుంది. 2018లో ఆమె తాను పోటీలో పాల్గొనే బరువును లైట్ హెవీవెయిట్ (81 కేజీలు) నుండి మిడిల్ వెయిట్ (75 కేజీలు)కి మార్చుకుంది. 2023 మార్చి 25న లైట్ హెవీవెయిట్ విభాగంలో చైనాకు చెందిన వాంగ్ లీనాను 4-3 తేడాతో ఓడించి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన 7వ భారతీయ బాక్సర్ ఈమె.

## బాక్సింగ్ వదులుకోవాలనుకుంది

**నీతు ఘంఘాస్...** 19 అక్టోబర్ 2000న హర్యానాలోని భివానీ జిల్లాలోని ధనసా గ్రామంలో జన్మించింది. ఆమె తండ్రి జై భగవాన్, చండీగఢ్‌లోని హర్యానా రాజ్యసభలో ఉద్యోగి. ఆమె తల్లి పేరు ముఖేష్ దేవి. నీతుకి అక్షిత్ కుమార్ అనే తమ్ముడు ఉన్నాడు. తల్లి చెప్పిన ప్రకారం నీతు ఒక కొంటె పిల్ల. తరచుగా తన తోబుట్టువులతో, పాఠశాలలో గొడవలు పడుతుండేది. తన బిడ్డకు కొత్త శక్తిని అందించడానికి, నిర్మాణాత్మక మార్గాన్ని చూపడానికి తండ్రి నీతూను బాక్సింగ్‌కు పరిచయం చేశాడు. ఆమె తన 12 ఏండ్ల వయసులో శిక్షణ పొందడం ప్రారంభించింది. కానీ మొదటి రెండెండ్లల్లో ఎటువంటి పోటీల్లో పాల్గొనలేకపోయింది. బాక్సింగ్‌లో ఎలాంటి పురోగతి లేక పోవడంతో ఇక విసుగు చెంది క్రీడను వదులుకోవాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో తండ్రి ఆమెను ప్రోత్సహించి అండగా నిలబడ్డాడు. బాక్సర్ కావాలనే తన కుమార్తె కలలను సాకారం చేసేందుకు తండ్రి తన ఉద్యోగానికి మూడేండ్ల పాటు సెలవు తీసుకున్నాడు. తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేశాడు. ఖర్చుల కోసం దాదాపు ఆరు లక్షలు అప్పు కూడా తీసుకున్నాడు. అతనే నీతూ శిక్షణ, తీసుకో వల్సిన ఆహార జాగ్రత్తలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాడు. ఈ కాలంలో ప్రఖ్యాత కోచ్ జగదీష్ సింగ్, ప్రఖ్యాత భివానీ బాక్సింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు విజేం దర్ సింగ్ మెంటర్‌లలో ఒకరైన నీతూ ఘంఘాస్‌ని గమనిం చారు. అప్పట్లో శ్రీ గురు గోవింద్ సింగ్ కాలేజీలో బీఏ విద్యార్థిని అయిన నీతూ భివానీ బాక్సింగ్ క్లబ్‌లో చేరి శిక్షణ కోసం తన తండ్రి స్కూటర్‌పై ప్రతి రోజూ 40 కిలో మీటర్లు ప్రయాణించేది.



## లవ్లీ పంచ్



**లోవ్లినా బోర్గోహైన్...** 1997, అక్టోబర్ 2న అస్సాంలోని గోలాఘాట్‌లో జన్మిం చింది. ఆమె 2020 ఒలింపిక్ క్రీడలలో మహిళల వెల్టర్ వెయిట్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన మూడవ భారతీయ బాక్సర్‌గా నిలిచింది. ఈ ఏడాది ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాన్ని, 2018 ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్, 2019 ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలను గెలుచుకుంది. అస్సాం నుండి ఒలింపిక్స్‌లో రాష్ట్రా నికి ప్రాతినిధ్యం వహించిన మొదటి మహిళా అథ్లెట్, రెండవ బాక్సర్ ఈమె. 2020లో అస్సాం నుండి అర్జున అవార్డును అందుకున్న ఆరవ వ్యక్తిగా నిలిచింది.

### తొలి దశలో...

ఆమె తల్లిదండ్రులు టికెన్, మమోని బోర్గోహైన్. ఆమె తండ్రి టికెన్ ఒక చిన్న స్థాయి వ్యాపారవేత్త. తన కూతురి కల నెరవేర్చడానికి ఆర్థికంగా కష్టపడ్డాడు. లోవ్లినా ముగ్గురు సోదరీ, సోదరులలో చిన్నది. ఆమె తన కవల సోదరీమణులైనా లిచా, లిమా కిక్‌బాక్సింగ్‌లో పాల్గొనడం చూసి తనూ అదే బాటను అనుసరించింది. బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. లోవ్లినా చదువుకున్న బర్పథర్ గర్ల్స్ హై స్కూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రయల్స్ నిర్వహించింది. బాక్సింగ్‌లో శిక్షణ పొందేందుకు ఆమె 2012 గౌహతిలో ప్రసిద్ధ కోచ్ పదమ్ చంద్ర బోడోచే ఎంపిక చేయబడింది. తర్వాత సంధ్యా గురుంగ్ వద్ద శిక్షణ పొందింది.

### ఎన్నో పతకాలు...

న్యూఢిల్లీలో జరిగిన 1వ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని, గౌహతిలో జరిగిన 2వ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది. కామన్వెల్త్ గేమ్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌లో యుకేకి చెందిన శాండీ ర్యాన్ చేతిలో ఓడిపోయింది. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో ఎంపిక కావడానికి ముందు ఆమె ఇండియా ఓపెన్‌లో విజయం సాధించింది. ఇది ఫిబ్రవరి 2018లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్. వెల్టర్‌వెయిట్ విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. నవంబర్ 2017లో వియత్నాంలో జరిగిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. జూన్ 2017లో అస్తానాలో జరిగిన ప్రెసిడెంట్స్ కప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అలాగే జూన్ 2018లో మంగోలియాలో జరిగిన ఉలాన్‌బాతర్ కప్‌లో రజత పతకాన్ని, సెప్టెంబర్ 2018లో పోలాండ్‌లో జరిగిన 13వ అంతర్జాతీయ సిలేసియన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

– సలీమ

# యే దాదాగిరి బంద్ కరో

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష సభ్యులు మార్చ్ నిర్వహించారు. 'యే దాదాగిరి బంద్ కరో, యే మోడీ గిరి బంద్ కరో' అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎన్‌సీపీ, సీపీఐ(ఎం), సీపీఐ, బీఆర్ఎస్‌లకు చెందిన ఎంపీలు నలుపు రంగు దుస్తులు ధరించగా, టీఎంసీ ఎంపీలు నోటికి నల్ల బ్యాడ్జిలు కట్టుకొని ఆందోళనలో పాల్గొన్నాయి. 'జాగో ఈడీ', 'ఈడీ మోదానీ భాయ్ భాయ్' అని రాసి ఉన్న ప్లకార్డులను ఎంపీలు పట్టుకొని మార్చ్‌లో కదంతొక్కారు.

**దద్దరిల్లిన ఉభయ సభలు**

సోమవారం పార్లమెంట్ ఉభయ సభల్లో రాహుల్ అనర్హత వేటు, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హెూరెత్తించారు. ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. దీంతో సోమవారం కూడా ఉభయ సభలు దద్దరిల్లాయి. లోక్‌సభలో సభ ప్రారంభం కాగానే కొంత మంది ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి కాగితాలను చించి విసిరారు. మరికొంత మంది ఎంపీలు నల్లరంగు క్లాత్‌ను ఊపారు. ఒక ఎంపీ చేతిలో ఉన్న బ్యానర్‌ను స్పీకర్ కుర్చీపైకి విసిరారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభను స్పీకర్ ఓం బిర్లా సాయంత్రం నాలుగు గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. 'ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది' అని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలిపారు. పలువురు సభ్యులు వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చినా లోక్‌సభ స్పీకర్ అనుమతించేది చైర్‌లో ప్యానెల్ స్పీకర్ రమాదేవి తెలిపారు. వెంటనే సభను మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే తీరు కొనసాగింది. సభ ప్రారంభం కాగానే కొందరు సభ్యులు వెల్లోకి దూసుకెళ్లి "మోడీ-అదానీ భాయ్, భాయ్" నినాదాలు చేశారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో సభను చైర్మన్ జగదీప్ ధన్కర్ మధ్యాహ్నం రెండు గంటల వరకు వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల నినాదాల మధ్య కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఆర్థిక బిల్లును ఆమోదించారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు.

**ప్రతిపక్షాల సమావేశం**

రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్షాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్,డీఎంకే, ఎస్పీ, జేడీయూ, ఆర్‌జేడీ, సీపీఐ(ఎం), సీపీఐ, ఆప్, బీఆర్ఎస్, ఎన్సీపీ, ఎన్‌సీ, శివసేన (ఠాక్రే), ఐయుఎంఎల్, ఎండీఎంకే, కేరళ కాంగ్రెస్,టీఎంసీ, ఆర్ఎస్పీ తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ముందుకు వచ్చిన వారికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధన్యవాదాలు తెలిపారు.

**ప్రభుత్వ బంగ్లా ఖాళీ చేయాలి : రాహుల్‌కు నోటీస్**

లోక్‌సభ ఎంపీ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీ ప్రస్తుతముంటోన్న ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలని లోక్‌సభ హౌసింగ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 22లోగా ఆయన తన బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొంది. ఖాళీ చేయడానికి ఆయనకున్న వ్యవధి 26 రోజులు మాత్రమే. 2014 నుంచి రాహుల్ ఢిల్లీ 12 తుగ్లక్ లేన్‌లోని ప్రభుత్వ బంగ్లాలో ఉంటున్నారు.

# జనచైతన్య యాత్రకు జనం జేజేలు...

(మొదటిపేజీ తరువాయి)

సైకిళ్ల యాత్రవెంట రెగ్యులర్ ఉంటుండగా, ఎక్కడిక్కడ స్థానికంగా అదనంగా మరికొన్ని చేరుతున్నాయి.దీంతో గ్రామాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల గుండా యాత్ర సాగుతున్నప్పుడు మంచి ప్రభావం పడుతున్నది.ప్రజల్లో యాత్ర పట్ల చర్చ నడుస్తున్నది.

**ఆటంకాలు ఏమైనా ఉన్నాయా ?**

ఆటంకాలు అంటే ప్రకృతి ప్రభావం కొంత ఉంది. భారీవర్షాలు ఒకవైపు, తీవ్రమైన ఎండలు మరోవైపు కొంత ఇబ్బందిపెట్టాయి. అయినా తట్టుకుని జనం కుదులుతున్నారు. యాత్రలో పాల్గొనడానికి యువత ఉత్సాహంగా ముందుకు వస్తున్నది.

**సభలకు ప్రజలు ఎలా వస్తున్నారు ?**

భారీగానే వస్తున్నారు. ప్రతిచోట కనీసం వెయ్యి నుంచి నాలుగైదు వేల వరకు ఆ సంఖ్య ఉంటున్నది. వర్షాలు, ఎండలు ఉన్నా, వస్తున్నారు. సాయంత్రం జరిగే సభలకు అధికంగా వస్తున్నారు. భూపాలపల్లిలో దాదాపు ఆరేడు వేల మంది వచ్చారు. కోదాడ, హుజూర్‌నగర్ సభలూ బాగానే జరిగాయి. మిర్యాలగూడలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీతోపాటు వేలాదిమందితో బహిరంగ సభ జరగడం విశేషం. అలాగే నల్లగొండ, నక్రికేకల్, చిట్యాల సభలు సైతం బాగా జరిగాయి. పనుల ఒత్తిడి ఉన్నా పాలేరు, మధిరలో పగటిపూట కూడా సభలు వేలాది మందితో .జరిగాయి.

**యాత్ర సందర్భంగా మీ దృష్టికొచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నారా?**



అవును చాలానే వస్తున్నాయి. వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. వరితోపాటు మిర్చి తదితర పంటలు కోల్పోవాల్సి వస్తున్నది. వీటిపై రైతులు, సాధారణ ప్రజలు స్పందిస్తున్నారు. వినతిపత్రాల రూపంలో యాత్ర దృష్టికితెస్తున్నారు. మిర్చి పంటపై ఖమ్మం జిల్లాలో చాలా ఫిర్యాదులు వచ్చాయి.ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం.

**సీఎం స్పందన ఎలా ఉంది ?**

ఇటీవల వడగండ్లతో పంటదెబ్బతిన్న జిల్లాల్లో సీఎం కేసీఆర్ పర్యటించిన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా బోనకల్‌కు వచ్చినప్పుడు ప్రభుత్వ ఆహ్వానం మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెళ్లారు. ఆ సందర్భంగా పంట నష్టపరిహారం ఎకరాకు కనీసం రూ. 20 వేలు ఇవ్వాలని అడిగాం. పాత జీవోల ప్రకారం ఎకరాకు రూ.3 వేలే ఇచ్చేవారు. పరిహారం పెంచాలని గట్టిగానే అడిగాం. మొత్తం పరిస్థితులను వివరించిన తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి ఎకరాకు రూ.10 వేలు ఇస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇది పార్టీ విజయం.

**కౌలు రైతుల గురించి ఏమైనా మాట్లాడారా ?**

అవును. కౌలు రైతుల గురించి కూడా సీఎంతో తమ్మినేని చర్చించారు. పంటలకు పెట్టుబడి పెట్టేది, నష్టపోయేది కౌలురైతులు కాగా, పరిహారం మాత్రం భూ యాజమానులకు అందుతుందని వివరించాం. అందుకే పరిహారం నేరుగా కౌలురైతులకు ఇవ్వాలని కోరాం. సమస్యను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

**రాహుల్‌గాంధీని ఎంపీగా అనర్హుడని ప్రకటించిన నేపథ్యంలో యాత్ర సందర్భంగా ఎదురైన పరిణామాలేంటి ?**

ప్రజల్లో కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంపై చర్చ జరుగుతున్నది. బీజేపీ ప్రభుత్వం ఇంత దారుణానికి ఒడిగట్టిందా ? అని భావిస్తున్నారు. దాదాపు అన్ని పార్టీలు ఖండించాయి. ఇది రాజకీయ కక్షసాధింపు చర్యలకు ఓ పరాకాష్టం.

**ఇప్పటివరకు ఎన్ని జిల్లాలు పూర్తయ్యాయి ?**

రాష్ట్రవ్యాప్తంగా మూడు చోట్ల నుంచి ఈ యాత్రలు ప్రారంభమయ్యాయి. మా యాత్ర వరంగల్ నుంచి ప్రారంభమైంది. నేటికి 11 రోజులు. ఎనిమిది జిల్లాల్లో యాత్ర పూర్తయింది. దాదాపు 1200 కిలోమీటర్లు సాగింది. 30కిపైగా కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించాం. వేలాది మంది ప్రజలు ఈసభల్లో పాల్గొన్నారు. 29న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ దగ్గర జరిగే బహిరంగసభతో ముగుస్తుంది.

# అదానీ కోసమే ఈ దిగజారుడు...

(మొదటిపేజీ తరువాయి)

విదేశీ డొల్ల కంపెనీలు, అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాయని విమర్శించారు. ఈ రూ.20 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం డొల్ల కంపెనీ ఎలా పని చేస్తున్నాయో పరిశీలించి, మార్గదర్శకాలు ఇవ్వాలని 2018లో ఒక టాస్క్‌ఫోర్స్‌ను నియమించిందని గుర్తు చేశారు. అదే ప్రభుత్వం అదానీ వ్యవహారం బయటపడిన తరువాత డొల్ల (షెల్) కంపెనీల గురించి నిర్వచనం లేదనీ, నిర్వచనం లేదు కనుక తమ వద్ద సమాచారం లేదని పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఈ ప్రభుత్వమే డొల్ల కంపెనీలను క్రమబద్ధీకరించేందుకు టాస్క్‌ఫోర్స్ నియమించి, ఇప్పుడు ఇదే ప్రభుత్వం డొల్ల కంపెనీలంటే తమకు తెలియదని అనడంలో అర్థమేమైనా ఉందా? అని ప్రశ్నించారు. అదానీని కాపాడేందుకు ప్రభుత్వం ఎంతలా దిగజారిందో స్పష్టంగా కనబడుతోందని తెలిపారు. సగానికిపైగా ఈడీ కేసులన్నీ డొల్ల కంపెనీలకు సంబంధించినవేననీ, కానీ ఇప్పుడు డొల్ల కంపెనీ అంటే ఏమిటో తెలియదని ప్రభుత్వం అంటుందని ఎద్దేవా చేశారు. దేశంలో మతోన్మాద ఘర్షణలు, మతోన్మాద దాడులు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతున్నాయనీ, వీటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున్న ప్రజా ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు.

**ఏపీలో నిర్మాణ సమస్యలు..**

"ఆంధ్రప్రదేశ్ పార్టీలో కొన్ని నిర్మాణ సమస్యలు ఉన్నాయి. ఆయా నిర్మాణ, అంతర్గత సమస్యలపై పొలిట్ బ్యూరోలో చర్చించాం. అలాగే ఆయా సమస్యలపై నిర్ణయాలు తీసుకున్నాం. వాటిని రాష్ట్ర కమిటీలో చర్చించి అమలు చేస్తాం. బివి రాఘవులు ఎన్నికైన పొలిట్ బ్యూరో సభ్యులు. ప్రస్తుతం కూడా ఆయన పొలిట్ బ్యూరో సభ్యులుగానే ఉన్నారు. కొనసాగుతారు. రాఘవులు సమస్య ఏమీ లేదు" అని అన్నారు. రాఘవులు లేఖకు సంబంధించి తాను మీడియాతో ఏమీ చెప్పలేదనీ, కానీ తాను చెప్పినట్టు ఒక ఛానెల్ (ఏబీఎన్ ఛానెల్) ప్రసారం చేసిందని పేర్కొన్నారు. దేశంలో నేర పరువు నష్టం కేసులు నడుస్తున్నాయనీ, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. తప్పుడు వార్తాలు ప్రసారం చేయొద్దని హితవు పలికారు. తాను ఎవ్వరితోనూ ఏమీ మాట్లాడలేదని స్పష్టం చేశారు. ఎంఎ గఫూర్ రాజీనామా చేసేందుకు ప్రయత్నించినట్టు వచ్చిన వార్తలపై విలేకరుల ప్రశ్నకు స్పందించిన ఏచూరి తమ వద్దకు అటువంటి సమాచారం ఏమీ రాలేదనీ, ఆయన మా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడని అన్నారు. అసలు ఇలాంటి వార్తాలు మీకు ఎలా వస్తున్నాయని విలేకరులను ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యమయ్యాయనీ, రాబోయే రోజుల్లో ఐక్యత, ప్రజా పోరాటాలు పెరుగుతాయని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

# కవిత పిటిషన్ విచారణ వాయిదా

**న్యూఢిల్లీ:** మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో కేంద్రమాజీ మంత్రి పి.చిదంబరం భార్య నళిని చిదంబరం 2018లో దాఖలు చేసిన పిటిషన్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం ట్యాగ్ చేసింది. అనంతరం మూడు వారాల పాటు విచారణను వాయిదా వేసింది. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఈడీ కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కె. కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ధర్మాసనం విచారించింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మహిళలను ఇంట్లో విచారించాలా? ఆఫీసులో విచారించాలా? అనేదే ప్రశ్నగా కపిల్ సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మధ్యలో జోక్యం చేసుకున్న ధర్మాసనం... ఈ వ్యవహారంలో మద్రాస్ హైకోర్టు చాలా స్పష్టంగా తన అభిప్రాయాన్ని వెల్లడించిందని పేర్కొంది. ధర్మాసనం వ్యాఖ్యలపై స్పందించిన ఈడీ తరవు న్యాయవాది రాజు, మద్రాస్ హైకోర్టు అభిప్రాయాన్ని ఈ ధర్మాసనం తీర్పు పక్కన పెట్టేదిగా ఉండకూడదని వాదించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) సెక్షన్ 50 అనేది కేవలం విచారణకు మాత్రమే అనీ, దర్యాప్తు కోసం కాదన్నారు. ఈ వ్యాఖ్యలపై సిబల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విజయ్ మదన్ లాల్ చౌదరి కేసుకు ముందు ఈ వ్యవహారం ఉత్పన్నం కాలేదన్నారు. మరోసారి జోక్యం చేసుకున్న జస్టిస్ రస్తోగి, త్రిసభ్య ధర్మాసనం ఈ అంశాన్ని పరిష్కరిస్తుందా? అని తీసుకోవాలనుకుంటున్నట్టు చెప్పారు.

దీనికి స్పందించిన కపిల్ సిబల్ కాదని సమాధానం ఇచ్చారు. అరెస్టుకు ముందు వరకు ప్రత్యేకమైన పద్ధతులు పాటిస్తామన్నారు. ఇదే అంశాన్ని విజయ్ మదన్ లాల్ కేసు కూడా చెబుతుందన్నారు. విజయ్ మదన్ లాల్ వ్యవహారంలో ఇంతకు ముందు వచ్చిన తీర్పు మీకు లాభం చేకూర్చదని న్యాయమూర్తి అన్నారు. దీనిపై సిబల్ వాదిస్తూ.. తమకు ఈ తీర్పు లబ్ది చేకూర్చుతుందన్నారు. పీఎంఎల్ఏ వ్యవహారంలో సమన్లు జారీ చేసేందుకు ఎలాంటి ప్రక్రియ లేదని సిబల్ వాదనలు వినిపించారు. జోక్యం చేసుకున్న ధర్మాసనం సెక్షన్ 50(2) స్పష్టంగా ఉందని వెల్లడించింది. అయితే అది ఎంక్వైరీ కోసం మాత్రమే అని వివరించారు.

కానీ, తమకు దర్యాప్తు కోసం ఈడి నుంచి సమన్లు పొందినట్టు చెప్పారు. పీఎంఎల్ఏ చాప్టర్ 8 లోని సమన్లు ఇచ్చే అధికారం కేవలం సాక్ష్యాధారాలు, డాక్యుమెంట్స్ సమర్పించేందుకు మాత్రమే ఉన్నదన్నారు. కానీ సమన్లు ఇచ్చేందుకు పీఎంఎల్ఏలో ఎలాంటి పద్ధతి లేదన్నారు. "ఫిర్యాదులో మమ్మల్ని నిందితులుగా పేర్కొన్నారు. అలాగే దర్యాప్తు జరుగుతోంది. నన్ను నిందితులుగానే ప్రస్తావిస్తున్నారు. దర్యాప్తు కోసమే నాకు సమన్లు జారీ చేశారు. అయితే పీఎంఎల్ఏ చట్టంలో ఇలాంటి పద్ధతి ఏదీ లేదు" అని అన్నారు. జస్టిస్ రస్తోగి జోక్యం చేసుకొని "మేం నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీ కేసుతో ఈ పిటిషన్‌ను జతచేసి విచారిస్తాం. ఆ కేసుతో ట్యాగ్ చేసి విచారించడమే సరైంది" అని అభిప్రాయడ్డారు. జోక్యం చేసుకున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిషేక్ బెనర్జీ వ్యవహారాన్ని దీంతో ముడిపెట్టదనీ, అది వేరే అంశమని కోరారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం... నళిని చిదంబరంతో కేసుతో ట్యాగ్ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# డబ్బులు ఇప్పించాలి

## బ్యాంక్ అధికారులను నిర్బంధించి తాళం వేసిన బాధితులు

నవతెలంగాణ-వర్ని

కెనరా బ్యాంక్‌లో పీడీ అకౌంట్ ఖాతాదారుల డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలోని బ్యాంక్ ఎదుట సోమవారం ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. బ్యాంకుకు తాళం వేసి బైటాయించారు. అ సందర్భంగా బాధితులు రామకృష్ణ, రఘు, బాబుమియ్య మాట్లాడుతూ.. బ్యాంక్ అధికారులు 45 మంది పీడీ ఖాతాదారులకు చెందిన సుమారు రూ.40 లక్షలను బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుమా ప్రసన్న, పీడీ ఏజెంటు శ్రీనివాసులు కలిసి కాజేశారని ఆరోపించారు. బ్యాంక్ అధికారులు విచారణ పేరిట రెండు నెలలుగా కాలయాపన చేస్తూ బాధితులకు డబ్బులు చెల్లించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయి బ్యాంక్ అధికారులు వెంటనే స్పందించి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రతిరోజు బ్యాంకు కార్యకలాపాలను అడ్డుకుంటూ ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కెనరా బ్యాంకు ఏజీఎంతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులను బ్యాంకుకు పిలిపించి నేడు డబ్బులు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని బ్యాంక్ అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

# పోలవరంపై విచారణ వాయిదా వేయండి

**న్యూఢిల్లీ:** పోలవరం ముంపుపై దాఖలైన పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. మూడు నెలల పాటు విచారణను వాయిదా వేయాలని కోరుతూ లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు వరద ముంపు తలెత్తుతున్నందున దానికి పరిష్కార మార్గాలు చూపాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం సుప్రీం కోర్టు విచారణ జాబితాలో ఉన్నాయి. ఈ పిటిషన్లు జస్టిస్ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ హస్నుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టుకు కేంద్రం లేఖ రాసింది. 2022 సెప్టెంబర్ 6న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నివేదికను ఖరారు చేయడానికి కొంత సమయం అవసరమని లేఖలో పేర్కొంది. కేంద్ర జలశక్తి శాఖమంత్రి, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సమావేశం ఇంకా సంప్రదింపుల దశలోనే ఉన్నదని తెలిపింది. పొరుగు రాష్ట్రాల్లో ముంపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలనీ, భాగస్వాములతో సమావేశం నిర్వహించాలనీ, అవసరమైతే ప్రభావిత రాష్ట్రాల సీఎంలు కూర్చొని మిగిలిపోయిన సమస్యలు పరిష్కరించుకోవాలని గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తుది నివేదిక అందించడానికి మూడు నెలల సమయం కావాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానానికి కేంద్రం లేఖ సమర్పించింది. అందుకే ఈ కేసును మూడు నెలల పాటు వాయిదా వేయాలని కోరింది. న్యాయమూర్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ఈ వాయిదా లేఖను అందజేయాలని లేఖలో పేర్కొంది.

# ఇది తెలంగాణ గడ్డ...మీ ఆటలు సాగవు




**నల్లగొండ జన చైతన్య యాత్ర నుంచి బి.బసవపున్నయ్య**

భారతీయతను నాశనం చేస్తున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రానీవ్వబోమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. దేశాన్ని కాపాడేందుకే రాష్ట్రవ్యాప్తంగా జనచైతన్య యాత్రలను చేపట్టినట్టు వెల్లడించారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ భయపడుతున్నాడనే విషయం అర్థమవుతున్నదని అభిప్రాయపడ్డారు. బీజేపీని ఓడించేందుకు దేశంలోని లౌకిక, ప్రజాస్వామిక శక్తులను కలుపుకుపోతామని చెప్పారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జనచైతన్యయాత్ర బహిరంగ సభ జరిగింది. సభకు పార్టీ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడం ద్వారా బీజేపీ తన రాజకీయ ప్రయోజనాలను నేరవేర్చుకునే పనిలో ఉందని విమర్శించారు. పార్టీ కుట్రలు, కుతంత్రాలను సాగనివ్వబోమని హెచ్చరించారు. దిగిపోయినా, తమ ప్రభావాన్ని కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో దుర్మార్గమైన ద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని తెలిపారు. క్రమపద్ధతి ప్రకారం తొమ్మిదేండ్లుగా రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య భావనలకు పాతరేస్తూ ఇష్టారాజ్యంగా పరిపాలించడం ద్వారా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని వివరించారు. బీజేపీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల పేదలు అవసరం లేదన్నారు. వారికి కేవలం కార్పొరేట్లు, పెట్టుబడిదారుల కావాలని వ్యాఖ్యానించారు. హిందువుల కోసం బీజేపీ ఎలాంటి పథకాలు తేవడం లేదనీ, కుల,మతాల రొచ్చును రుద్దుతూ సమాజాన్ని కలుషితం చేస్తున్నారని చెప్పారు. ఒకే కులం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆదానీ సంపదంతా అక్రమాల పుట్ట అని విమర్శించారు. వందల కోట్ల పేద ప్రజలపై మోడీకి ప్రేమ లేదనీ, కేవలం అదానీ, అంబానీలే కావాలని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేయడం ద్వారా రిజర్వేషన్లకు ఎసరు పెడుతున్నారని చెప్పారు. అందుకే బీసీ జనాభా లెక్కల గణనను చేపట్టడం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మోడీని దించడం ఖాయమని హెచ్చరించారు. చివరకు రాష్ట్రాలు అప్పులు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేశారని విమర్శించారు. బీజేపీ వ్యతిరేక శక్తులను పోగేసేందుకు సీపీఐ(ఎం), సీపీఐ ప్రయత్నం చేస్తున్నాయని గుర్తు చేవారు. కేరళలో బీజేపీకి ఉన్న సీటును విజయన్ ఊడబెరికారని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేపర్ లీకులతో సంబంధం ఉన్న దొంగలను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**మోడీ దుర్మార్గుడు: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

దేశాన్ని పాలిస్తున్న ప్రధాని మోడీ దుర్మార్గుడని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. మతోన్మాద చర్యల ద్వారా దేశాన్ని భ్రష్టుపట్టించే చర్యలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. మొత్తం దేశాన్ని అమ్మకానికి పెట్టారని అన్నారు. బీజేపీ అమానుష చర్యలను ప్రజలకు తెలియజేప్పేందుకు జనచైతన్య యాత్రను చేపట్టిన సీపీఐ(ఎం)ను అభినందించారు. అంబానీ, అదానీల కోసం ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారని అన్నారు. దేశంలో గతంలో ఏ ప్రభుత్వం, ఏ ప్రధాని చేయని విధంగా అప్పులు చేశారని చెప్పారు. మోడీ రూ.152 లక్షల కోట్ల అప్పులను ప్రజలపై రుద్దారని వివరించారు. 16 రకాల సంస్థలను ప్రయివేటుపరం చేయడాన్ని ఖండిస్తున్నట్టు వివరించారు. ఈడీ, మోడీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ భయపడబోరని చెప్పారు. బీజేపీని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**భిన్నత్వంలో ఏకత్వం భారత్:మల్లు లక్ష్మి**

మన దేశం భిన్నత్వంలో ఏకత్వంలా ఉంటుందనీ, అలాంటి దేశాన్ని కుల,మతాల పేరుతో చీల్చే ప్రయత్నం జరుగుతున్నదని సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. తొమ్మిదేండ్ల కాలంలో మహిళలు, రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని చెప్పారు. మహిళలకు బీజేపీ వ్యతిరేకమనీ, మనుధర్మాని అమలుచేయడం ద్వారా అణచివేతకు పాల్పడుతున్నదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం ద్వారా ఆర్థిక భారాలను ప్రజలు, మహిళలపై మోపుతున్నారని గుర్తు చేశారు. 2014 నుంచి ధరలు పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు. గ్యాస్, పెట్రోల్ తదితర ధరలు దారుణంగా పెరుగుతున్నాయన్నారు. రాజస్తాన్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో మహిళల్లో రక్తహీనత పెరుగుతున్నదన్నారు. ఎక్కువగా ఉండేదనీ, ఇప్పుడది దేశ్యాపితం అయిందని చెప్పారు. ఇందుకు బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. పిల్లలను పక్కదారి పట్టిస్తున్నారని వివరించారు.

**భారీ ర్యాలీ**

మిర్యాలగూడ నుంచి నల్లగొండ వరకు జనచైతన్య యాత్ర మోటార్ సైకిల్ యాత్రలో భారీగా జనం పాల్గొన్నారు. మధ్యలో ఆయా గ్రామాల ప్రజలు యాత్రకు స్వాగతం పలికారు. ఈ యాత్రకు సంఘీభావం చెప్పేందుకు బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీలు నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారీ ఐలయ్య, ఐద్వా నేత పాలడుగు ప్రభావతి, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### ఇండియన్ ఆయిల్‌తో మారుతి సుజుకి జట్టు



**ఇంధన వినియోగదారులకు రివార్డ్స్**

**న్యూఢిల్లీ :** దిగ్గజ చమురు రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి)తో మారుతి సుజుకి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగసామ్యంలో మారుతి వినియోగదారులకు అదనపు రివార్డ్స్ ప్రయోజనాలు, సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ఇండియన్ ఆయిల్ తన సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు పేర్కొంది. ఐఒసిఎల్ చొరవతో ఏప్రిల్ 1 నుంచి మారుతి సుజుకి రివార్డ్స్ యాప్‌లో పలు రివార్డ్స్‌ను పొందడానికి వీలుంది. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ల్లో ప్రతీ రూ.100కి రెండు ఎక్స్‌ట్రా రివార్డ్స్ పాయింట్లలో పాటుగా ఆన్‌బోర్డింగ్ బోనస్‌గా 100 ఎక్స్‌ట్రా రివార్డ్స్‌ను పొందవచ్చని పేర్కొంది. మూడు మాసాల్లో రూ.25,000 ఖర్చు చేసే వినియోగదారులకు అదనంగా రూ.105 విలువ చేసే 350 ఎక్స్‌ట్రా రివార్డ్స్ పాయింట్లను ఇవ్వనున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. ఈ ప్రోగ్రామ్‌లో వినియోగదారులకు అదనపు ఫీచర్లు, ప్రయోజనాలు సమకూరడంతో పాటుగా వారితో తమ కంపెనీకి బలమైన బంధాన్ని ఏర్పర్చుకోవడానికి దోహదం చేయనుందని మారుతి సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటివ్ శశాంక్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మారుతి సుజుకితో ఈ భాగస్వామ్యం వినియోగదారులకు మరింత మెరుగైన అనుభవాలను అందించడానికి దోహదం చేయనుందని ఐఒసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌమిత్ర శ్రీవాస్తవ తెలిపారు.


### ఓయో ఐపిఒ పరిమాణంలో కోత..!

**న్యూఢిల్లీ :** స్టాక్ మార్కెట్, టెక్ పరిశ్రమలోని కంపెనీలపై నెలకొన్న ప్రతికూలాంశాలు ఓయో పబ్లిక్ ఇష్యూపై పడిందని స్పష్టమవుతోంది. ఓయో బ్రాండ్‌తో ఆతిథ్య రంగంలో అగ్రిగేటర్‌గా ఉన్న ఓరావెల్ స్టేస్ లిమిటెడ్ తన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) పరిమాణాన్ని తగ్గించుకోవాలని యోచిస్తోందని రిపోర్టులు వస్తున్నాయి. స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకులకు తోడు కొత్తతరం టెక్ కంపెనీలు పలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఓయో తన ఇష్యూ పరిమాణాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. ఐపిఒకు సంబంధించి వారం రోజుల్లో మరోసారి ముసాయిదా పత్రాలను సమర్పించనుందని తెలుస్తోంది. కాగా.. ఇష్యూ పరిమాణాన్ని మూడింతలకు తగ్గించాలని నిర్ణయించినట్లు సమాచారం. 2021లో రూ.8,430 కోట్ల నిధుల సమీకరణ కోసం ఐపిఒకు దరఖాస్తు చేసుకోగా.. పలు కారణలతో ఇది వాయిదా పడుతోంది. ముసాయిదా పత్రాల్లో చాలా లోపాలు ఉన్నాయని.. మార్పులు చేసి పంపించాలని 2022 డిసెంబర్‌లో ఓయోను సెబీ ఆదేశించింది. దీనికి సంబంధించిన గడువు అతి త్వరలో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే మరోసారి సవరించిన అంచనాలు, ముసాయిదా పత్రాన్ని ఈ వారంలోనే సెబీకి సమర్పించే అవకాశం ఉంది.

### హెరిటేజ్ ఫుడ్స్ నుంచి కొత్త పానియాలు




**హైదరాబాద్ :** ప్రముఖ డెయిరీ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ప్రస్తుత వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా నూతన శ్రేణీ మజ్జిగ ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఎ-వన్ బ్రాండ్ పేరుతో వీటిని ఆవిష్కరించినట్లు పేర్కొంది. అదే విధంగా అతి సులభంగా అందించేలా నూతన శ్రేణీ మిల్క్ షేక్స్‌ను కార్టన్ బాక్స్‌లలో విడుదల చేసినట్లు తెలిపింది. హెరిటేజ్ 'ఎ-వన్' స్పెషల్ బటర్‌మిల్క్ అతి తక్కువ కేలరీ నేచురల్ రిఫ్రెషనర్ అని పేర్కొంది. అల్లం, పచ్చిమిరపలతో పాటుగా ఉప్పు, పులుపులను మిళితం చేసిన 180 మిల్లీ లీటర్ల ప్యాక్‌ను రూ.20కే అందిస్తున్నట్లు హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. నూతన శ్రేణీ మిల్క్‌షేక్‌లలో వెనీలా, స్ట్రాబెర్రీ వంటి ప్రాచుర్యం పొందిన వేరియంట్లతో ఆవిష్కరించింది. ఈ మిల్క్‌షేక్‌లు 180 మిల్లీలీటర్ల ప్యాక్ రూ.40, 125 మిల్లీ లీటర్ రూ.15 లభ్యం కానున్నాయని ఆసంస్థ వైస్ ఛైర్‌పర్సన్, ఎండి భువనేశ్వరి నారా తెలిపారు. "బాదమ్ చార్జర్‌ను ఇతర రుచుల మిల్క్ ప్రొడక్ట్‌తో పోలిస్తే 30 శాతం తక్కువ షుగర్‌తో అందించడంతో పాటుగా కృత్రిమ రంగులు కూడా జోడించలేదు. సహజసిద్ధమైన బాదములను దీనిలో జోడించాము" అని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు.




# రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకగా 'మేడే'

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకగా 'మేడే'ను నిర్వహిస్తున్నట్టు కార్మికశాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మే 1వ తేదీ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బెస్ట్ మేనేజ్‌మెంట్స్ అవార్డులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులకు శ్రమశక్తి అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. దీనికోసం నామినేషన్లను ఆహ్వానించారు.




ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు యాజమాన్యాలు, కార్మిక సంఘాల నాయకులు నామినేషన్లను కార్మిక శాఖ వెబ్‌సైట్ www.labour.telangana.gov.in ÅÊ పంపాలని కోరారు. ఆఫ్‌లైన్ నామినేషన్లను అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లోని మొదటి అంతస్తు, జీ సెక్షన్‌లో స్వీకరిస్తారని తెలిపారు.

# జర్మనీలో స్తంభించిన రవాణా వ్యవస్థ



**బెర్లిన్ :** రైళ్లు, విమాన, ప్రజారవాణాకు చెందిన పలు ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మె సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైంది. ఈ సమ్మె వారాంతపు ప్రయాణాలకు అంతరాయం కలిగించింది. అన్ని రైళ్లు, విమానాలు, బస్సులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా ప్రజారవాణా స్తంభించింది. ప్రభుత్వంతో యూనియన్‌లు జరుపుతున్న చర్చల్లో ప్రతిష్టంభన నెలకొందని పలు ట్రేడ్ యూనియన్లు పేర్కొన్నాయి. దీంతో మూడో రౌండ్ చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. సమ్మెకు పిలుపునిచ్చినట్లు జర్మనీ అతిపెద్ద యూనియన్ వెర్డి తెలిపింది. బెర్లిన్ బ్రాండెన్‌బర్గ్ (బీఈఆర్) విమానాశ్రయం తప్ప దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాలపై సమ్మె ప్రభావంపడింది. విమానాల రద్దు, ఆలస్యం కారణంగా సుమారు నాలుగు లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హబ్, ఫ్రాంక్‌ఫర్ట్‌ల్లో అన్ని విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని విమానాల షెడ్యూల్‌లో మార్పులు చేయబడ్డాయి. సమ్మె, దాని ప్రభావాలను ఊహించిన మ్యూనిచ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఇప్పటికే ఆదివారం విమానాలను నిలిపివేసింది. సోమవారం కూడా పలు విమానాలు రద్దయ్యాయి. సమ్మె కారణంగా ప్రధాన నౌకాశ్రయాలు, ఓడరేవుల వద్ద వాణిజ్య, ప్రయాణికుల రవాణా కూడా నిలిచిపోయింది.

అలాగే రైళ్ల నెట్‌వర్క్ కూడా స్తంభించిపోయింది. అన్ని రైళ్లను నిలిపివేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. జర్మనీలోని ఏడు ప్రధాన రాష్ట్రాలు బాడెన్, వుర్టమ్ బెర్గ్, హెస్సే, లోయర్ సాక్సోనీ, రైన్‌ల్యాండ్-పాలటినేట్, సాక్సోని, బవేరియా, నార్త్‌రైన్-వెస్ట్ ఫాలియాల్లో ప్రజారవాణా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు.

మరోవైపు ప్రభుత్వంతో ట్రేడ్ యూనియన్‌ల మూడో రౌండ్ చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ చర్చలకు రెండు యూనియన్‌లు దూరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**"మనుగడకు సంబంధించిన అంశం" : ట్రేడ్ యూనియన్లు**

పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ సమ్మెను "మనుగడకు సంబంధించిన అంశం " అని జర్మనీలోని అతిపెద్ద యూనియన్ అభివర్ణించింది. దశాబ్దాల్లో జర్మనీలోనే అతిపెద్ద సమ్మెతో రవాణా రంగం తీవ్రంగా ప్రభావితమౌతుందని స్థానిక మీడియా తెలిపింది. తక్కువ వేతనం, ఎక్కువ పనిగంటలతో కార్మికులు అధిక ఒత్తిడి గురవుతున్నారని వెర్డి లేబర్ యూనియన్ అధ్యక్షుడు ఫ్రాంక్ వెర్నెక్ తెలిపారు. జర్మనీ వినియోగదారుల ధరల సూచీ ఫిబ్రవరిలో ఊహించిన దానికన్నా 9.3 శాతం పెరిగింది. వేతనాల పెరుగుదల లేకపోవడంతో ఈ సమ్మె మనుగడకు సంబంధించిన విషయంగా పేర్కొన్నారు.

# 'బిల్కిస్ బానో' దోషితో బీజేపీ

- గుజరాత్‌లో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే నిర్వాకం
- వేదికపై ముందు వరుసలో కూర్చున్న శైలేశ్ భట్
- స్పందించడానికి ఎంపీ జస్వంత్‌సిన్హ్ నిరాకరణ
- తాను చూడలేదన్న ఎమ్మెల్యే శైలేశ్‌భాయ్
- సోషల్‌మీడియాలో నెటిజన్ల ఆగ్రహం



**అహ్మదాబాద్ :** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన బిల్కిస్ బానో కేసులో దోషులుగా తేలినవారిలో ఒకరైన శైలేశ్ భట్.. బీజేపీ ఎమ్మెల్యే ఎంపీలతో కలిసి గుజరాత్‌లోని ఒక ప్రభుత్వ కార్యక్రమంలో వేదిక పంచుకున్నాడు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముందురుసలో కూర్చున్నాడు. వీటికి సంబంధించిన ఫోటోలను ఎమ్మెల్యే, ఎంపీలిద్దరూ తమ ట్విట్టర్ ఖాతాల్లో సైతం పోస్టు చేయటం గమనార్హం.

**మాకు ఆశ్చర్యం అనిపించలేదు : బిల్కిస్ భర్త రసూల్**

బీజేపీ ప్రజాప్రతినిధులతో వేదిక పంచుకున్నది శైలేశ్ భట్ అని బిల్కిస్ బానో భర్త యాకుబ్ రసూల్ కూడా ధ్రువీకరించాడు. "వీరు (దోషులు) జైలు నుంచి బయటకు వచ్చినపుడు సత్కారాలు అందుకున్నారు. అధికారంలో ఉన్నవారితో వారు వేదిక పంచుకోవడం మాకు ఆశ్చర్యంగా అనిపించడం లేదు. ఇప్పుడు మాకున్న ఏకైక ఆశ సుప్రీంకోర్టే" అని రసూల్ అన్నారు. మహిళపై సామూహిక లైంగికదాడి కేసులో దోషిగా తేలి.. ప్రస్తుతం పెరోల్‌పై బయట ఉన్న వ్యక్తిని బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు తమ కార్యక్రమాల్లో భాగం చేయడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి తీరు పట్ల సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దహోడ్ జిల్లా సింగ్వడ్ తాలూకాలోని కర్మాడీ గ్రామంలో గుజరాత్ నీటి సరఫరా మరియు మురుగునీటి బోర్డు (జీడబ్ల్యుఎస్ఎస్‌బీ) ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ దహోడ్ ఎంపీ జస్వంత్‌సిన్హ్ భభోర్, లిమ్ఖేడ ఎమ్మెల్యే శైలేశ్‌భాయ్ భభోర్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను భభోర్ సోదరిలిద్దరూ తమ ట్విట్టర్ ఖాతాల్లో షేర్ చేశారు. దహోడ్ జిల్లా సమాచార విభాగం కూడా ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను విడుదల చేసింది.

**నేను పాల్గొన్నది పబ్లిక్ ఈవెంట్ : శైలేశ్‌భట్**

ఇందులో భట్.. వేదికపై ముందు వరుసలో జస్వంత్‌సిన్హ్, సింగ్వడ్ పంచాయతీ అధ్యక్షులు కాంతా దమోర్‌లకు మధ్యలో కూర్చున్నట్టు కనిపించింది. అయితే, తాను హాజరైన జీడబ్ల్యుఎస్ఎస్‌బీ కార్యక్రమం అనేది ఒక పబ్లిక్ కార్యక్రమమనీ, తాను ఇంతకంటే చెప్పడానికి ఏమీ లేదని భట్ మాట్లాడటం గమనార్హం. ఈ తతంగంపై మాట్లాడటానికి జస్వంత్‌సిన్హ్ నిరాకరించారు. ఎమ్మెల్యేగా తాను చాలా బిజీగా ఉండటం కారణంగా వేదికపై ఉన్నది ఎవరో తాను చూడలేదని శైలేశ్‌భాయ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భట్ వచ్చాడన్నదానిపై తాను పరిశీలిస్తానని తెలిపారు. వేదికపై ముందు వరుసలోనే కూర్చున్న భట్ తనకు కనిపించలేదని ఎమ్మెల్యే చెప్పడం గమనార్హం.

భట్‌ను ఈ కార్యక్రమానికి ఎవరు ఆహ్వానించారో తనకు తెలియదని జీడబ్ల్యుఎస్ఎస్‌బీ డిప్యూటీ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం మా ద్వారానే నిర్వహించబడినప్పటికీ.. నీటి సరఫరా విభాగం నుంచి ఆహ్వానాలు పంపలేదని చెప్పారు. పంచాయతీ సభ్యులే అతిథులను ఆహ్వానించి ఉండొచ్చని అన్నారు. బిల్కిస్ దోషి ఈ కార్యక్రమానికి హాజరుకావడంపై టీఎంసీ ఎంపీ మహువా మోయిత్రా ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్ లాంటి 'క్రూరుడిని' తిరిగి జైలులో ఉంచాలని పేర్కొన్నారు.

### బిల్కిస్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వానికి కేంద్రం నోటీసు

బిల్కిస్ బానో కేసులో దోషులను ముందస్తుగా విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ బిల్కిస్ బానో దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. దీంతో కోర్టు కేంద్రం, గుజరాత్ రాష్ట్రానికి, 11 మంది దోషులకు నోటీసులు జారీ చేసింది. న్యాయమూర్తులు కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై వివరణాత్మక విచారణకు ఏప్రిల్ 18వ తేదీని ఖరారు చేసింది. విచారణ సందర్భంగా బెంచ్ 'దోషులు చేసిన నేరం భయంకరమైనదని, భావోద్వేగాలకు లోనుకాదు' అని వ్యాఖ్యానించింది.

**విడుదల సంబంధిత ఫైళ్లను సిద్ధంగా ఉంచుకోండి**

విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును బెంచ్ మినహాయింపు ఇచ్చే ముందు సంప్రదించారా? అని ప్రశ్నించింది. దీనిపై ఏఎస్జీ ధర్మాసనానికి ఈ విషయంలో కేంద్రాన్ని తగు విధంగా సంప్రదించినట్లు తెలిపారు. దీనిపై, తదుపరి విచారణ తేదీన దోషుల విడుదలకు సంబంధించిన అన్ని ఫైళ్లను సిద్ధంగా ఉంచాలని జస్టిస్ జోసెఫ్ గుజరాత్ రాష్ట్ర న్యాయవాదిని కోరారు. ఈ కేసు విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేస్తూ, విచారణ ఏ పరిధిలో జరగాలనే విషయాన్ని ముందుగా నిర్ణయిస్తామని కోర్టు స్పష్టం చేసింది.

## ఓయూలో మైనింగ్ ఇంజినీరింగ్‌కు కోల్ ఇండియా ఆర్థిక సహాయం


**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఉస్మానియా యూనివర్సిటీలో మైనింగ్ ఇంజినీరింగ్ నిర్వహణకు కోల్ ఇండియా ఆర్థిక సహాయాన్ని అందచేసింది. ఆ విభాగం అధ్యాపకుల జీతాల కోసం రూ.3 కోట్లు డిపాజిట్ చేసింది. దీనికి సంబంధించిన ఎమ్ఓయూపై ఓయూ వైస్ చాన్సలర్ డీ రవీందర్, కోల్ ఇండియా చైర్మెన్ ప్రమోద్ అగర్వాల్ సోమవారం సంతకాలు చేశారు. పూర్వ విద్యార్థుల పట్టుదలతో ఇది సాధ్యమైందని వారు చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలో తిరిగి మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాన్ని పునరుద్ధరించి, బీటెక్, ఎంటెక్ కోర్సులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఉస్మానియా మాజీ విద్యార్థి, ప్రస్తుత కోలిండియా డైరెక్టర్ టెక్నికల్ బి వీరారెడ్డి పాల్గొన్నారు.

## సైబర్ చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలి

- న్యాయాధికారులు, పోలీసులతో సీఐడీ డీజీ మహేశ్ భగవత్
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మూడ్రోజుల న్యాయాధికారుల శిక్షణ ప్రారంభం

**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**



న్యాయాధికారులు, పోలీసులు సైబర్ చట్టాలు, నేరాలపై సంపూర్ణ అవగాహనను కలిగి ఉండాలని సీఐడీ రాష్ట్ర అదనపు డీజీ మహేశ్ భగవత్ అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడ్రోజుల పాటు సైబర్ లా, సైబర్ నేరాలపై జరిగే శిక్షణ శిబిరాన్ని మహేశ్ భగవత్ సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణా శిబిరంలో 33 మంది న్యాయాధికారులు, కొత్తగా నియమితులైన జూనియర్ జడ్జిలకు శిక్షణనిస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ భగవత్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అన్ని నేరాల కంటే సైబర్ నేరగాళ్ల విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవటం కష్టతరంగా మారిందన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో చూసినా సైబర్ నేరాలు పెచ్చరిల్లిపోతున్నాయనీ, వాటిని అరికట్టడం దర్యాప్తు అధికారులకు సవాలుగా మారిందని తెలిపారు. ముఖ్యంగా, సైబర్ నేరాలకు సంబంధించిన ఒక నేరాన్ని పరిష్కరిస్తుంటే వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త నేరాలు పుట్టుకొస్తున్నాయని ఆయన అన్నారు. వీటిని నిరోధించటానికి ఎప్పటికప్పుడు కొత్త చట్టాలను రూపొందించటం, ఉన్న చట్టాలను మరింతగా బలోపేతం చేయడం వంటి చర్యలు నిరంతరం సాగుతున్నాయని తెలిపారు.

సైబర్ నేరగాళ్లకు కళ్లెం వేయాలంటే ఆ నేరాలను దర్యాప్తు చేసే పోలీసు విభాగాన్నే గాక అలాంటి కేసులను విచారించే న్యాయమూర్తులు సైతం సదరు నేరాలపై పూర్తి అవగాహనను కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థల మధ్య తగిన సమన్వయం కూడా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ఈ విషయంలో కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర సీఐడీ విభాగం గతంలో సైతం శిక్షణా శిభిరాలను సంబంధిత అధికారులు, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. మూడ్రోజుల పాటు జరిగే ఈ శిక్షణా శిభిరంలో సైబర్ లా, సైబర్ నేరాలకు సంబంధించిన ప్రముఖ నిపుణులు, ఈ నేరాల దర్యాప్తులో ఆరితేరిన అధికారులు శిక్షణనివ్వడం జరుగుతుందని మహేశ్ భగవత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సంక్షేమ విభాగం అభిలాష బిస్త్‌తో పాటు పలువురు అధికారులు, న్యాయాధికారులు పాల్గొన్నారు.

## ఫస్ట్ సిటిజన్ బ్యాంక్ చేతికి ఎస్‌విబి

**వాషింగ్టన్ :** తీవ్ర సంక్షోభంలో చిక్కుకుని దివాళా తీసిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి)ని ఫస్ట్ సిటిజన్ బ్యాంక్ కొనుగోలు చేసింది. ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డిఐసి) స్వాధీనంలో ఉన్న ఎస్‌విబి డిపాజిట్లు, రుణాలను ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ ఆధీనంలోకి వచ్చాయి. దీంతో సోమవారం నుంచి ఎస్‌విబి ఖాతాదారులందరూ ఇకపై ఫస్ట్ సిటిజన్ బ్యాంక్ ఖాతాదారులుగా మారనున్నారు. 2023 మార్చి 10 నాటికి ఎస్‌విబికి 167 బిలియన్ డాలర్ల ఆస్తులు, 119 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. ఫస్ట్ సిటిజన్ బ్యాంక్‌కు ప్రస్తుతం 109 బిలియన్ డాలర్ల ఆస్తులు, 89.4 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. తాజా కొనుగోలు నేపథ్యంలో ద్రవ్య లభ్యత సమస్య తలెత్తకుండా ఫస్ట్ సిటిజన్ బ్యాంక్‌కు ఎఫ్‌డిఐసి రుణ మద్దతును అందించనుంది.

## వియు నుంచి ప్రీమియం టివి 2023 ఎడిషన్




**న్యూఢిల్లీ :** అమెరికన్ టెక్నలాజీ కంపెనీ వియు భారత మార్కెట్లోకి కొత్తగా 43, 55 అంగుళాల్లో ప్రీమియం టివి 2023 ఎడిషన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. వీటి ధరలు వరుసగా రూ.23,999గా, రూ.32,999గా నిర్ణయించినట్లు పేర్కొంది. ఆన్‌లైన్‌లో వీటిని అమ్మకానికి పెట్టినట్లు తెలిపింది. స్పష్టమైన చిత్రం కోసం ఎ ప్లస్ గ్రేడ్ 400 ఎన్‌ఐటిఎస్ ప్రకాశవంతమైన ఐపిఎల్ ప్యానెల్‌ను కలిగి ఉందని వెల్లడించింది.

# బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు

## సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి

**నవతెలంగాణ- నకిరేకల్**

దేశంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం కానరావడం లేదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర సోమవారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మోటార్లకు మీటర్లు పెట్టాలని, ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాలు తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. మరోవైపు నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శతకోటీశ్వరులను తయారు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని విమర్శించారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులను లాక్కుంటుందని, వాస్తవాలను అర్థం చేసుకొని ప్రజలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ మళ్లీ గెలిస్తే అదాని, అంబానీ, కార్పొరేట్ శక్తులు తప్ప ప్రభుత్వ రంగ సంస్థలు ఉండవన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటుపరం చేసి కార్మికులను వీధిన పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌకిక విధానం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) దేశవ్యాప్తంగా పోరాడుతుందన్నారు.

**పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులే..**

**ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

పేదల పక్షాన నిలబడి వారి సంక్షేమం.. హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌కు చేరుకున్న జన చైతన్య యాత్రకు సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను ఎండగట్టేందుకు పేద ప్రజల పక్షపాతిగా కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని చెప్పారు.

ప్రజల కోసం పని చేయడం తప్ప ఏనాడూ అధికారం కోరుకోని వారు కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టుల ఆలోచన విధానాలు రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికుల సంక్షేమం వైపే ఉంటాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిలబడి పోరాడే పార్టీలకు అండగా ఉండి వారి పోరాటాల్లో భాగస్వాములు అవుదామని చెప్పారు. బీజేపీ పెత్తందారుల కొమ్ముకాస్తూ ప్రజా సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష పార్టీలపై కక్షగట్టి ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య రాచకొండ వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నిఖత్ జరీన్‌కు సీపీఐ(ఎం) అభినందనలు : తమ్మినేని

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**



ప్రపంచ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రత్యర్థులతో ధీటైనా పోటీని ఎదుర్కొని పంచ్‌పవర్‌తో అద్భుత ప్రతిభను కనపరచి పసిడి పతకాన్ని సాధించిన నిఖత్ జరీన్‌కు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నిజామాబాదు జిల్లాకు చెందిన నిఖత్ విజయం తెలంగాణ క్రీడాకారులకే కాకుండా భారతదేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా నిఖత్ మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసి,వారికి అవసరమైన శిక్షణనిచ్చి క్రీడారంగంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**ఆవాజ్ అభినందనలు**

ప్రపంచ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రత్యర్థులతో ధీటైన పోటీని ఎదుర్కొని పంచ్‌పవర్‌తో అద్భుత ప్రతిభను కనపరచి పసిడి పతకాన్ని సాధించిన నిఖత్ జరీన్‌కు ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దేశం తరుపున మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నిజామాబాదుకు చెందిన నిఖత్ విజయం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే కాదు భారతదేశానికే గర్వకారణం. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నికత్ జరీన్ ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగడం హర్షనీయమని పేర్కొన్నారు. నిఖత్ ఎదుగుదలకు చేయూత నిచ్చిన కుటుంబానికి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో నిఖత్ ఇంకా ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసి, వారికి అవసరమైన శిక్షణనిచ్చి క్రీడారంగంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని కోరారు.

## 500 మందికి ఉచితంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ టెస్ట్‌సిరీస్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

టీఎస్‌పీఎస్సీ జూన్‌లో నిర్వహించబోయే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో 500 మందికి ఉచితంగా ప్రతిరోజూ టెస్ట్‌సిరీస్ నిర్వహించనున్నట్టు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మెన్ పి క్రిష్ణప్రదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దయి, అభ్యర్థులు ఆర్థికంగా, మానసికంగా ఆందోళనలో ఉన్న నేపథ్యంలో వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి లాటరీ పద్ధతిలో 500 మందిని ఎంపిక చేసి వారికి ఉచితంగా టెస్ట్ సిరీస్ నిర్వహించబడుతుందని వివరించారు. అభ్యర్థులు తమ పేర్లను వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. టెస్ట్ సిరీస్ వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-350521219133237733 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# ఆలీబాబా అరడజను దొంగలకు మోడీ రక్షణ

**ప్రశ్నించే వారు దేశద్రోహులు.. దోపిడీదారులు దేశభక్తులా?**

- మోడీ చేసిన తప్పులకు వందేండ్ల శిక్ష వేయాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**నవ తెలంగాణ - మహబూబ్‌నగర్**

భారతదేశంలో ప్రజల సంపదను దోచుకుంటున్న ఆలీబాబా అరడజన్ దొంగలను నరేంద్ర మోడీ రక్షిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, రక్షణ రంగం లాంటి సంస్థలను దోచుకుంటున్న కార్పొరేట్ వ్యాపారులకు మోడీ రక్షణగా ఉన్నారని ఆరోపించారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తున్న బీజేపీ పుట్టకముందే ఈ దేశంలో హిందూమతం ఉందని గుర్తు చేశారు. ప్రశాంతంగా ఉన్న దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామ్య దేశంలో కులాల పేరుతో, మతాల పేరుతో విభజించి పాలిస్తున్నారన్నారు. దేశంలో కార్పొరేట్ వ్యాపారులు అత్యధికంగా నిధులు ఇస్తున్నది ఒక్క బీజేపీ పార్టీకేనని, అందుకే వారి కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. భారతదేశంలో ఎన్నికలు మొత్తం అవినీతిమయంగా మారాయని, కార్పొరేట్‌లు, బడా పెట్టుబడుదారులు మాత్రమే చట్టసభలకు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తూ.. ప్రజలను దోపిడీ చేస్తున్న వారిని దేశభక్తులా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిదేండ్ల కిందట ఎక్కడో ఉన్న అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీ నేడు ప్రపంచంలో రెండో స్థానానికి ఎలా ఎదిగిందని ప్రశ్నించారు. దేశ సంపదను దోచుకుని స్వేచ్ఛగా విదేశాలకు పారిపోతున్న వారిని ఏమీ చేయలేని మోడీ ప్రభుత్వం.. ప్రశ్నిస్తున్న వారిని మాత్రం చట్టసభల నుంచి బహిష్కరించడం అన్యాయమన్నారు. అలా అయితే.. మోడీ చేసిన తప్పులకు వందేండ్ల శిక్ష పడాలన్నారు.

కమ్యూనిస్టులకు చట్టసభల్లోకి వెళ్లడానికి బలం లేకపోయినా ప్రజలకు అన్యాయం చేసే పార్టీలను ఓడించే సత్తా ఉందన్నారు. తెలంగాణలో పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, జిల్లా మాజీ కార్యదర్శి పరమేశ్వర్‌గౌడ్, గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, సురేష్, రాము, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పాడుదాం..పోరాడుదాం

## 'జనచైతన్య గీతాలు' పుస్తకావిష్కరణలో డీజీ నర్సింహారావు, ఆనందాచారి




**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**




మతోన్మాదంపై, ప్రజావ్యతిరేక పాలనపై పాడుదాం.. పోరాడుదామంటూ ఎక్కుపెట్టిన అక్షరాయుధాలే 'జనచైతన్యగీతాలు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు.సోమవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జనచైతన్యగీతాలు పుస్తకాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ.జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె ఆనందాచారి, జె బాబురావుతో కలిసి డీజీ నర్సింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పాడుదాం..పోరాడుదాం..! అనే నినాదంతో సాంస్కృతిక పోరాటాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. దేశంలో మతోన్మాద ప్రమాదం ఆవరించిందని చెప్పారు. ఈ దశలో కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు తమ ఆలోచనలకు పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి మూడు జనచైతన్య యాత్రలు సాగుతున్నాయని తెలిపారు. ఈ యాత్రలకు ప్రజలనుంచి అపూర్వ స్పందన వస్తున్నదన్నారు. మోడీ ప్రభుత్వం మోపిన వివిధ రకాల భారాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని చెప్పారు. మోడీ, అమిత్‌షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ, ప్రజలపై భారాలను మోపుతున్నదని చెప్పారు. 23 కోట్ల మందిని పేదలుగా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశమంటే ఆదానీ, అంబానీల సొత్తుగా మార్చేశారని విమర్శించారు. ఆనందాచారి మాట్లాడుతూ గొంతెత్తిన ప్రజాగీతాలు జన చైతన్య యాత్రకు కవాతు గీతాలై మేల్కొల్పుతున్నాయని తెలిపారు. 20 మంది ప్రముఖ రచయితలు పాలకుల దుష్ట విధానాలపై ఎక్కుపెట్టిన అక్షరాయుధాలే జనచైతన్య గీతాలన్నారు. రాష్ట్ర శాసనమండలి సభ్యులు గోరెటి వెంకన్న జానపద శైలిలో రాసిన పాట మోడీ విధానాలపై ఝళిపించిన పదునైన కత్తిలా ఉందని చెప్పారు. భార్యాభర్తల సంవాదంతో పాటలున్నాయన్నారు. జానపద శైలిలో ఎంకీబావ సంవాదంతో సాగే గేయాలు కూడా ఉన్నాయని చెప్పారు. కేంద్రంలోని నేటి ప్రభుత్వ మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టటమే ఈ పాటల ఉద్దేశమన్నారు. మోడీ ఆర్థిక విధానాలతో పేదలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించటమే లక్ష్యంగా 'పాడుదాం..పోరాడుదామంటూ' ఉద్యమాన్ని సాగించాల్సిన అవశ్యకత పెరిగిందని చెప్పారు.

## మాజీ ఎంపీ డి.శ్రీనివాస్‌కు భద్రత కల్పించాలి : డీజీపీకి కాంగ్రెస్ పార్టీ వినతి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మాజీ ఎంపీ డి.శ్రీనివాస్‌కు భద్రత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ డీజీపీ అంజనీ కుమార్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ డీజీపీకి లేఖ రాశారు. డి.శ్రీనివాస్‌కు ఆయన కుమారుడు డి.సంజయ్‌కు మధ్య జరిగినట్టుగా ప్రచారంలోకి వచ్చిన సంభాషణ ద్వారా డీఎస్ వేధింపుల మధ్య ఉన్నట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు. ఆ సంభాషణలో డీఎస్ స్వయంగా తాను వేధింపులకు లోనవుతున్నట్టు చెప్పుకున్నారని గుర్తుచేశారు.

# మెరుగైన సేవల కోసం ఏసీ స్లీపర్ బస్సులు

**ప్రయివేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ బస్సులు**

మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

- 9 ఏసీ స్లీపర్ బస్సులు ప్రారంభం





**నవతెలంగాణ-హయత్ నగర్**

తెలంగాణలో ప్రయివేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ బస్సులు ప్రవేశపెడుతుందని, ప్రజలకు మెరుగైన సేవల కోసం ఏసీ స్లీపర్ బస్సులు నడుపుతుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. సోమవారం ఎల్బీనగర్‌లోని విజయవాడ మార్గంలో 9 ఏసీ స్లీపర్ బస్సులను టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సుల్లో వైఫై సౌకర్యం కూడా ఉంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. హైటెక్ హంగులతో ఈ బస్సులను టీఎస్ఆర్టీసీ తీసుకొస్తుందని చెప్పారు. మొదటి విడతగా 16 ఏసీ స్లీపర్ బస్సులను వాడుకలోకి తెస్తోందని.. అందులో భాగంగా ప్రస్తుతం 9 బస్సులు ప్రారంభించినట్టు తెలిపారు. ఇవి సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కర్నాటకలోని బెంగళూరు, హుబ్లీ, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తిరుపతి, తమిళనాడులోని చెన్నై మార్గాల్లో ఈ 16 కొత్త ఏసీ స్లీపర్ బస్సులను సంస్థ నడపనుందని చెప్పారు.

ప్రయాణికులకు మెరుగైన,నాణ్యమైన సేవలను అందించాలనే ఉద్దేశంతో ఇటీవల టీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ 630 బస్సులను, నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ 8 బస్సులను, నాన్ ఏసీ స్లీపర్ 4 బస్సులను ప్రారంభించిన విషయం తెలిసిందే. నాన్ ఏసీ స్లీపర్ బస్సుల మాదిరిగానే ఏసీ స్లీపర్ బస్సులకు 'లహరి-అమ్మఒడి అనుభూతి'గా నామకరణం చేసింది. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఈడీలు మునిషేకర్, పురుషోత్తం, వినోద్ కుమార్, యాదగిరి, ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ,ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి, జోనల్ కమిషనర్ పంకజ, డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేండ్లలో 50వేల ఉద్యోగాలు కల్పిస్తాం

- ఫెడరల్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్




**నవ తెలంగాణ- మహబూబ్ నగర్**

రెండేండ్లలో మహబూబ్‌నగర్ జిల్లాలో 50వేల ఉద్యోగాలు కల్పిస్తామని ఎక్సైజ్, పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా రెండు కొత్త బ్యాంకులు ప్రారంభం అవుతున్నాయని, పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. భారీ కంపెనీలు మహబూబ్‌నగర్ వైపు దృష్టి సారిస్తున్నాయని తెలిపారు. లిథియం అయాన్ గిగా పరిశ్రమ ఏర్పాటుతో వేలాదిగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. విద్యుత్ వాహనాలకు అవసరమైన లిథియం బ్యాటరీలను ప్రపంచానికి సరఫరా చేసే కేంద్రంగా మహబూబ్‌నగర్ గుర్తింపు పొందనుందన్నారు. తమిళనాడు లాంటి రాష్ట్రాలు పోటీపడినా తెలంగాణలో ఉన్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ ప్రభుత్వం, మంత్రి కేటీఆర్ కారణంగా పరిశ్రమ మనకు దక్కిందని చెప్పారు. త్వరలో ఐటీ కారిడార్‌ను ప్రారంభించబోతున్నామని, పలు ఐటీ కంపెనీలు ఇప్పటికే తమ సంస్థలను ఇక్కడ నెలకొల్పేందుకు ఉత్సాహంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఫెడరల్ బ్యాంకు జోనల్ హెడ్ దిలీప్, రీజినల్ హెడ్ ప్రమోద్, మేనేజర్ శరత్ చంద్ర, కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్, రిటైర్డ్ ఎక్సైజ్ అధికారి ఫరూక్, అడ్వకేట్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## చరిత్ర అధ్యయనం ద్వారా నూతన చరిత్రను నిర్మించగలం

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి



**నవతెలంగాణ-ఓయూ**

చరిత్ర అధ్యయనం ద్వారా మాత్రమే నూతన చరిత్రను నిర్మించగలమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. ఐసీహెచ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్) సహకారంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఓయూలోని అంబేద్కర్ సెంటర్ సెమినార్ హాల్లో రెండ్రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ కొండా నాగేశ్వర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.లింబాద్రి మాట్లాడుతూ.. వేల సంవత్సరాలుగా తెలంగాణ జీవన విధానంలో బహుళ సంస్కృతులు ప్రోది చేసుకున్నాయని తెలిపారు. బౌద్ధ, జైనుల కాలం నుంచి ఈ ప్రాంతం మత సామరస్యానికి, ఉన్నత మానవతా విలువలకు, సహజీవనానికి కేంద్ర బిందువుగా ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు వారి వారి గ్రామాల చరిత్రపై, ప్రాంతాల చరిత్రపై లౌకిక స్ఫూర్తితో రచనలు కొనసాగించి, మరుగున పడిన మట్టి మనుషుల చరిత్రను గ్రంథీకరించాలని సూచించారు. అంబేద్కర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కొండ నాగేశ్వర్ మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు గత చరిత్రను అధ్యయనం చేయడానికి ఎంతో సుముఖంగా ఉన్నారని, వారికి కావాల్సిందల్లా ప్రోత్సాహకమేనని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త వేద కుమార్, ప్రముఖ ఆర్కియాలజీ నిపుణులు శివ నాగిరెడ్డి, ప్రముఖ హిస్టరీ విభాగ రిటైర్డ్ ఆచార్యులు ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, హిస్టరీ విభాగధిపతి ప్రొ. జి.అంజయ్య, ప్రొ. లావణ్య, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొ.సుధారాణి, ఆర్కియాలజీ విభాగ ఆచార్యులు ప్రొ. శ్రీనివాసన్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సెల్ డైరెక్టర్లు ప్రొ.మంగు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అజిమున్నీసా, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొ.సూర్యనారాయణ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బీజేపోళ్లకు దమ్ముంటే..పంట నష్టపరిహారం ఇవ్వండి

## మేం రూ.పది వేలు ఇస్తున్నాం

- ఫసల్‌బీమా మోడీ రాష్ట్రంలో ఎందుకు అమలు చేయట్లేదు
- ధరలు పెంచుడు.. మీటర్లు పెట్టుడే.. బీజేపీ పని
- పంచాయతీ ఖాతాల్లో నేరుగా నిధులు
- సీపీఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి : ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు



**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్న బీజేపోళ్లు ముందుగా ప్రధాన మంత్రి మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఫసల్ బీమా ఎందుకు అమలు చేయట్లేదో సమాధానం చెప్పాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌లో దీన్‌దయాళ్ జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని జిల్లా స్థాయి గ్రామ పంచాయతీలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు రూ.10 వేల సాయం ఇస్తున్నామని, బీజేపీ వాళ్లు మాత్రం రూ.పది వేలు సరిపోవు అంటున్నారని, వాళ్లకు దమ్ముంటే ఢిల్లీ నుంచి రూ.10 వేలు తెచ్చి ఇస్తే ఇద్దరం కలిసి రూ.20 వేలు ఇద్దామని తెలిపారు. బీజేపీకి రైతుల గురించి మాట్లాడే నైతికత లేదన్నారు. ధరలు పెంచుతూ మీటర్లు పెట్టుడు బీజేపోళ్ల పని అని విమర్శించారు. రెండు రోజుల కిందట సోలాపూర్ నుంచి కొందరు కౌన్సిలర్లు వచ్చారని, నాలుగైదు రోజులకు ఒకసారి నీరు వస్తుందని, బీదర్‌లో బావుల దగ్గర నుంచి నీళు తెచ్చుకుంటున్నామని తెలిపారన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న కర్నాటక, మహారాష్ట్రలో ఉన్న పరిస్థితి ఇదేనని తెలిపారు. మన దగ్గరప్రతి ఇంటికీ ప్రతి రోజూ నీరు వస్తుందని, ఇది తెలంగాణ మోడల్ అని చెప్పారు. ప్రధాన మంత్రి సంసద్ యోజనలో పదికి పది ఆవార్డులు తెలంగాణలోని పంచాయతీలే దక్కించుకున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల కృషితోనే ఇది సాధ్యమయిందని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లోకి డబ్బులు వేస్తామని ప్రకటించారు. పని చేసిన వెంటనే బిల్లులు చెల్లించుకునే అవకాశం సర్పంచ్‌లకే ఉంటుందన్నారు.

**ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు సీపీఆర్**

ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు సీఎం కేసీఆర్ సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని శిక్షణ ఇప్పిస్తున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డిలో సీపీఆర్‌పై శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శరీరంలోని అన్ని భాగాలకు విశ్రాంతి ఉంటుందని, ఒక్క గుండె మాత్రం నిరంతరం పనిచేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి రోజూ 4 వేల సడెన్ కార్డియాక్ అరెస్టులు జరుగుతుండగా ఇందులో 90 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రాణాపాయం లో ఉన్న వ్యక్తికి ఎవరైనా సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడొచ్చన్నారు. పారామెడికల్, వైద్య, మున్సిపల్, పోలీసు, కమ్యూనిటీ వాలంటీర్లు, ఉద్యోగులు, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్ ప్రతినిధులు, ఇతర వర్కర్లకు సీపీఆర్ మీద శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్య విభాగంలో 1240 మంది మెడికల్ ఆఫీసర్లు, 1300 మంది స్టాఫ్ నర్సులు, 8500 మంది ఏఎన్ఎంలు, 26 వేల ఆశాలు శిక్షణ తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో రూ.15 కోట్ల వ్యయంతో 1200 ఏఈడీ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. అనంతరం జిల్లాలోని నారాయణఖేడ్‌లో 50 పడకల ఎంసీహెచ్ ఆస్పత్రిని మంత్రి ప్రారంభించారు. వైద్య ఆరోగ్య రంగంలో తెలంగాణ ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. అదే విధంగా ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి పర్యటనలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, మాణిక్యరావు, భూపాల్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన మంత్రి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 3వ డివిజన్ అల్మాస్ గూడ గ్రామంలోని సీఎంఆర్ కాలనీకి చెందిన గుగ్గిల రమ్యశ్రీకి మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.42 వేల 500 మంజూరు చేయించారు. ఆ చెక్కును మంత్రి తన నివాసంలో బాధితురాలు కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, నాయకులు చప్పిడి సుభాన్ రెడ్డి, తుఫాన్ రెడ్డి,కెంచ నాగేందర్ గౌడ్, భాస్కర్, మహిళా నాయకురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అభినందనలు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్ అండ్ సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ బషారత్ అల్లాహ్ సోమవారం స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి రంజాన్, శుభకృత్ తెలుగు నామ సంవత్సరం, ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్ అండ్ సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ సమాజ సేవలో ముందుండాలన్నారు అనంతరం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారు రెగ్యులరైజ్ చేసుకోవాలి

- 2020 జూన్ 2 వరకు కట్టుకున్న వారికి అవకాశం
- ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- 58, 59 జీఓ లపై అధికారులతో సమీక్ష



మీర్‌పేట్‌లో అధికారులతో మంత్రి సబితా సమావేశం

నవతెలంగాణ-మీర్‌పేట్

ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్న వారు రెగులరైజ్ చేసుకోవటానికి ముఖ్యమంత్రి కేసీఆర్ మరొక అవకాశం కల్పించారని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి రెవెన్యూ అధికారులతో 58, 59 జీఓ లకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో 2014 వరకు కట్ ఆఫ్‌గా ఉండగా తాజాగా 2020 జూన్ 2 వరకు కట్టుకున్న వారికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే నెల ఏప్రిల్ 1వ తేదీ నుంచి 58,59 జీఓ లకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం అవుతుందని మంత్రి తెలిపారు. నోటరీ, ఇతరత్రా ప్లాట్లపైన కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు. అదేవిధంగా మహేశ్వరం నియోజకవర్గంలో 58 జీఓ ద్వారా 966 మంది లబ్ధిదారులకు హక్కులు కల్పించినట్టు, త్వరలో వాటిని పంపిణీ చేస్తామన్నారు. ఏప్రిల్ 1 నుంచి 30 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్, తహశీల్దార్‌లు జనార్దన్ రావు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నాగోల్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం**

నాగోల్ : నాగోల్ డివిజన్‌లోని కాత్యాయని ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, కార్పొరేషన్ చైర్మెన్‌లు ఉప్పల శ్రీనివాస గుప్త, అమరవాది లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో ఆలోచిస్తూ రాష్ట్ర అభివృద్ధి ప్రజాసంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందన్నారు. ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించి బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కార్యకర్తలకు



నాగోల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి

నాయకులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఎల్బీనగర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లడం జరిగిందన్నారు. నాగోల్ డివిజన్‌లో దేశంలోనే ఎక్కడా లేని విధంగా మూడు మతాలకు ఒకే చోట ముక్తి ఘాట్ ను ఏర్పాటు చేసుకోవడం, ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకుగాను నూతనంగా ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అలాగూ నాగోల్ డివిజన్‌లో వర్ష కాలం లో ముంపునకు గురవుతున్న తరుణంలో బండ్లగూడ చెరువు నుంచి నాగోలు చెరువుకు నాగోల్ చెరువు నుంచి మూసీ నదికి బాక్సు డ్రయినేజీని నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. కార్యకర్తలు సమిష్టిగా, సమన్వయంతో మెలుగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**బడంగ్‌పేట్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం**

బడంగ్‌పేట్ : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో ఆదివారం రాత్రి బడంగ్ పేట్ కార్పొరేటర్లు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశానుసారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేసీఆర్ ఒక విజన్ ఉన్నటువంటి మహా నాయకుడని, నిరుపేద కుటుంబాలకు ఎప్పుడు ఏ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలను కింది స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఎంతైనా ఉందన్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనం ద్వారా డివిజన్ల అభివృద్ధి, ఆత్మీయ అభిమానం మరింత ప్రజలకు దగ్గర అవడానికి దోహద పడుతుందని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడానికి కూడా తోడ్పడుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి బాటలు వేయాలని ప్రతీ డివిజన్ పరిధిలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ శ్రీధర్, కార్పొరేటర్లు పి.శోభా ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,అర్జున్, బీమిడి స్వప్న జంగారెడ్డి, లిక్కి మమత కృష్ణారెడ్డి,గుర్రం స్వప్న వెంకట్ రెడ్డి,వివిధ డివిజన్ల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళలు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి

## ఆర్టీసీ బస్సులో గంజాయి పట్టివేత

- ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారీ
- 30.9 కేజీల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఆర్టీసీ బస్సులో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన ఇమాజ్ ఇర్ఫాన్ సయ్యద్, మహ్మద్ అలీ, ప్రదీప్ చింతామన్ కాంబ్లీలతో పాటుగా శివ తరుణ్ అధిక డబ్బు కు ఆశ పడి ఛతీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు ఆర్టీసీ బస్సులో అక్రమంగా గంజా యిని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులతో పాటుగా ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖ అధికారులు సంయుక్తంగా కలిసి సోమవారం అబ్దుల్లా పూర్‌మెట్ మండలంలోని రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద వాహ నాల తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా ఆర్టీసీ బస్సులో ఇమాజ్ ఇర్ఫాన్ సయ్యద్, మహ్మద్ అలీ, ప్రదీప్ చింతామన్ కాంబ్లీలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 30.9కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శివ తరుణ్ పరారీలో ఉన్నాడు. ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, శ్రీనివాస్ , ఎస్ఐ సరళ, లక్ష్మీ నారాయణ, విష్ణు, కూర్మ తదితరులు ఉన్నారు.

## కాలనీలో మౌలిక వసతులకు పెద్దపీట

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి
- రామంతపూర్ డివిజన్‌లో డ్రయినేజీ సివరేజి పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ డివిజన్‌లోని సాయి కృష్ణ కాలనీలో మౌలిక వసతులకు పెద్దపీట వేసి అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు సోమవారం రూ. 30 లక్షలు 34 లక్షల వ్యయంతో డ్రయినేజీ సివరేజి పనులను స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ మాట్లాడుతూ రామంతపూర్ భగాయత్‌లోని అన్ని కాలనీలకు రోడ్లు డ్రయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి కాలనీల రూపురేఖలే మారుస్తామని పేర్కొన్నారు. జలమండలి అధికారులు జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీజీఎం రజనీకాంత్ రెడ్డి, మేనేజర్ పల్లె రవీందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనం పల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గరిక సుధాకర్, శాగ రవీందర్, ఎం. డి. ముస్తాక్, జహంగీర్, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

హైదరాబాద్ : కల్యాణ లక్ష్మి వంటి పథకాలు నిరుపేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే, కార్పో రేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, శాంతి సైజన్ శేఖర్, బండారు శ్రీవాణి , జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గడ్డం రవి, గారికే సుధాకర్, డివిజన్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, ముత్యం రెడ్డి, ముస్తాక్, కిరణ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది డిప్యూటీ తాసిల్దార్, ఫీల్డ్ అసిస్టెంట్ సుధా తదితరులు పాల్గొన్నారు.




# బల్దియా ప్రగతికి జక్కన్న భారీ పద్దు

- రూ.236 కోట్లతో పీర్జాదీగూడ బల్దియా 2023-24 అంచనా బడ్జెట్
- నిరంతర నీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం
- పన్నుల ద్వారా రూ.52 కోట్లు రాబడి..
- రూ.184 కోట్లు ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్లు వస్తాయని అంచనా..
- అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా వార్షిక బడ్జెట్ : మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

నగరంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తూ మేయర్ జక్కావెంకట్ రెడ్డి రూ. 236 కోట్ల భారీ పద్దుతో ప్రవేశపెట్టిన పీర్జాదిగూడ బల్దియా 2023-24 సంవత్సర అంచనా బడ్జెట్ కు ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మేయర్ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బడ్జెట్‌ను సభ ముందుంచారు. ప్రతిపాదించిన పద్దులో రూ.52. 58 కోట్లు ఆస్తి పన్నులు, భవన నిర్మాణ అనుమతుల ఫీజుల రూపేనా కాగా రూ.183.71 కోట్లు ప్లాన్, నాన్ ప్లాన్, గ్రాంట్లు ఇతర గ్రాంట్లు వస్తాయని భారీ ఆశలతో అంచనా వేశారు. వీటిలో ప్రధానంగా 24 గంటల నీటి సరఫరాకు సంబంధించి రూ.55 కోట్లు ప్రభుత్వం నుంచి వస్తాయని అంచనాలు రూపొందించారు. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 40 లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతుండగా నిరంతరం 24 గంటలు పాటు నీటి సరఫరాకు రూ.55 కోట్లు వ్యయం ప్రభుత్వం నుంచి వస్తాయని అంచనా వేశారు. ఈ మొత్తంతో కార్పొరేషన్లో మిషన్ భగీరథ ఫేస్ 2లో భాగంగా నగర పరిధిలో తాగు నీటి సమస్యలేకుండా ఇప్పటికే 90 లక్షల లీటర్ల కెపాసిటి కలిగిన రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని తద్వారా రానున్న కాలంలో 24 గంటలు మంచి నేటి సరఫరా కు వీలు కలుగు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా క్రమంతప్పకుండ మంచినీరు సరఫరా చేసి, అవసరమైన చోట కొత్త పైప్ లైన్‌తో పాటు జంక్షన్ నిర్మించడం, వరద ముంపునకు శాశ్వత పరిష్కారానికి సుమారు రూ. 110 కోట్లతో ఎస్ఎన్డీపీ నిధులతో నిర్మిస్తున్న స్ట్రాం వాటర్ డ్రైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఈ వర్షాకాలం నాటికి పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వీధి వ్యాపారులకోసం ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న "స్ట్రీట్ వెండింగ్ జోన్ " త్వరగా పూర్తి చేసి అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. పీర్జాదిగూడ కమాన్ నుంచి ప్రతాప్ సింగారం క్రాస్ రోడ్ వరకు సుమారు 25.36 కోట్లతో నిర్మిస్తున్న 4 లైన్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని తెలిపారు.చెరువుల సుందరీకరణలో భాగంగా సుమారు రూ.13 కోట్లతో పీర్జాదిగూడ పెద్ద చెరువు మైనర్ ట్యాంక్ బండ్ మాదిరిగా అభివృద్ధి చేస్తున్నామని త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు.

నగర పరిధిలో ఆహ్లాదకరమని వాతావరణం అందించడానికి మరిన్ని మోడల్ పార్కులను నిర్మించనున్నట్లు తెలిపారు. సుమారు రూ 7.5 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. దోమల నివారణకు అవసరమైన కొత్త ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేయడం జరిగిందని వాటి ద్వారా ప్రతీ రోజు వీధులలో ఫాగింగ్ చేస్తున్నామని అదేవిధంగా దోమల గుడ్లపు డెక్క తొలగించడానికి డ్రోన్ సహాయంతో క్రిమి సంహారక మందులతో పాటు యాంటి లార్వా మందులు పిచికారీ చేస్తున్నామని తెలిపారు. కుక్కల, పందుల, కోతుల నివారణకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని వాటిని అవలంభించాల్సిన ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా ఆపరేషన్ చేయబడిన కుక్కలకు గుర్తించుటకు వాటి మెడకు బెల్ట్ వేస్తున్నామని తెలిపారు. నగర పరిధిలో వేసవిలో మూగ జీవాల దాహార్తిని తీర్చడం కోసం ప్రత్యకంగా నీటి తొట్లు ప్రతి డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధి చేయడంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులతో కలిసి సిదిపేట, సిరిసిల్ల పట్టణాలకు స్టడీ టూర్ తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బోడిగే స్వాతి, తూంకుంట్ల ప్రసన్న లక్ష్మీబండారి మంజుల, ఎల్. మాధవి, కో ఆప్షన్ సభ్యురాలు సీహెచ్ వరలక్ష్మిలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న షాహిన్ నగర్‌లోని వాది ఈ హబీబ్ కాలనీలో పర్వీన్ బేగం(35) భర్త మహ్మద్ జబీర్, కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పర్వీన్ బేగం సోమవారం తన 9 ఏండ్ల కుమారుడు మహ్మద్ వజీర్‌ను ఉదయం ఆల్ఫాలహా పాఠశాలకు తీసుకొని వెళ్తుండగా వెనుక వైపు నుంచి అశోక్ లేలాండ్ వాహనం (నెంబర్ టీఎస్ 07 యు.జీ.1491) డ్రైవింగ్ నిర్లక్ష్యంతో అతివేగంగా వచ్చి ఢీ కోట్టింది. దాంతో పర్వీన్ బేగం అక్కడికక్కడే మృతి చెందింది. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పీస్ మీటింగ్

నవతెలంగాణ-హయత్‌నగర్

శ్రీ రామ నవమి, హనుమాన్ జయంతి, రంజాన్ ఉపవాస దీక్షలు ఒకేసారి రావడంతో శాంతి భద్రతల దష్ట్యా హయత్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ లో సోమవారం పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్ నగర్‌లో ఇంతవరకు ఒక మతకల్లోలం కూడా జరగలేదని రానున్న రోజుల్లో కూడా సోదర భావంతో మెలుగుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ వారికీ సహకరిస్తూ వేడుకలు జరుపుకుందాం అని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా వారు ముందుగా హిందువులకు శ్రీరామనవమి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఉగాది ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి గోవింద చారి, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, సభ్యులు సతీష్, కడారి యాదగిరి యాదవ్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్ , మహేష్, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు చేయాలి

- సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ పెంటయ్య



నవతెలంగాణ-మీర్‌పేట్

ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మనెంట్ చేసి కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలన్నారు. ప్రతీ కార్మికునికి ఇన్సూరెన్స్ చేయించాలని, డ్రెస్సులు కుట్టడానికి ఇస్తున్న డబ్బులను పెంచాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు జతల బట్టలు, కుట్టడానికి కావాల్సిన ఖర్చులు, రెండు జతలు చెప్పులు, కామాటీలకు గ్లౌజులు, స్వీకర్లకు చీపుర్లు, పొడవైన కర్రలు, బెల్లము, నూనె, మాస్కులు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులకు ప్రమాద బీమా రూ. 6 లక్షలు ఇవ్వాలని, ఈఎస్ఐ, ఫిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యాదగిరి, దాసరి బాబు, కలమ్మ, లలిత, ప్రజా సంఘాల నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశ సంపదను కొల్లగొట్టింది నాడు బ్రిటిష్.. నేడు బీజేపీ

- టీపీసీసీ ఉపాధ్యక్షులు వేము నరేందర్ రెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

దేశ సంపదను నాడు బ్రిటిష్ వారు కొల్లగొడితే నేడు బీజేపీ కార్పొరేట్లకు దోచిపెడుతున్నదని టీపీసీసీ ఉపాధ్యక్షులు వేము నరేందర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడానికి నిరసనగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు సత్యాగ్రహ సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేము నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కులమతాల పేరుతో కుట్రలు చేస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. పేద మధ్యతరగతి ప్రజలపై నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ నడ్డి విరుస్తున్నదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నాడని అక్కసుతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో దేశ సంపదను పెంచుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందించిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పైన పెట్టిన కేసును, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడానికి వెనక్కి తీసుకోవాలని లేనియెడల వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్‌రెడ్డి రంగారెడ్డి, అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రామ్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజు, అమరేందర్ రెడ్డి, దేపా భాస్కర్ రెడ్డి, జితేందర్, పీసీసీ కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి శేఖర్ గౌడ్ శివకుమార్, పీసీసీ కార్యదర్శి బంగారు బాబు, సామిడి గోపాల్ రెడ్డి, జయమ్మ, సిద్ధాల శ్రీశైలం, చల్ల బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి




నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికాభివృద్ధి సాధించాలని ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం చైర్మెన్ మద్రి నర్సింహా రెడ్డి అన్నారు.సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ సర్వసభ్య సమావేశం బ్యాంకు అవరణలో జరగగా చైర్మెన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మెన్ నర్సింహారెడ్డి,వైస్ చైర్మెన్ బంగారు బాబులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. సహకార బ్యాంక్ ప్రస్తుతం లాభాల బాట లో నడుస్తున్నదని, రైతులకు కావాల్సిన పంట రుణాలు, వ్యాపార రుణాలు, బంగారు రుణాలు సకాలంలో అందిస్తూ వారి ఆర్థికాభివద్ధికి తోడ్పడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రైతులు,వ్యాపారులు బ్యాంకు డిపాజిట్లు చేయటం జరిగిందని,ఇ ంకా కొందరు బ్యాంకులో డిపాజిట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సహకారంతో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను బ్యాంకు ద్వారా రైతుల కు సకాలంలో అందిస్తూ వ్యవసాయ, వ్యాపార రంగాల్లో అభివద్ధి చేయటానికి తన వంతు కషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మాజీ చైర్మెన్ పి.పుల్లారెడ్డి, డైరెక్టర్లు కందాడి జ్యోతి, వంక పోచమ్మ, నర్సింహ్మా, గిరిరాజ్, పెద్దబావి మోహన్ రెడ్డి, చిగిరింత శ్రీరాంరెడ్డి, మేనేజర్ నారాయణ రెడ్డి, అసిస్టెం ట్ మేనేజర్ సువర్ణ,బ్యాంకు సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

- కార్పొరేటర్ పద్మ ఐలయ్య యాదవ్




నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కార్పొరేటర్ పద్మ ఐలయ్య యాదవ్ అన్నారు. సోమవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలో జలమండలి సహకారంతో గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్మస్‌గూడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకుంటే కాలనీలలో బస్తీలలో నీటి కొరత ఉండదన్నారు. అదేవిధంగా కట్టబోయే ప్రతీ ఇంటికి ఇంకుడుగుంత నిర్మాణం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిజీఎం హరికృష్ణ, మేనేజర్ ప్రియాంకలు మాట్లాడుతూ నీరు అత్యంత విలువైందన్నారు. వర్షపునీరు నిల్వచేసుకోవాలన్నారు. గాయత్రి ఫౌండేషన్ అనేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నదని ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్20 లో పది రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కాబట్టి ప్రజలు ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ సిబ్బంది, గాయత్రి ఫౌండేషన్ అధినేత రవికుమార్, స్వాతి ,హర్షవర్ధన్ , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్


బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత సంవత్సరం మంత్రి కేటీఆర్ రూ.16కోట్ల 60 లక్షల నిధులతో ప్రారంభించిన వివిధ రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్ కష్ణ మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడంగ్ పేట్ కమాన్ నుంచి నాదర్ గుల్ వరకు రూ. 9కోట్లు,అల్మాస్ గూడ నుంచి గుర్రంగూడ వరకు రూ.3కోట్లు, విద్యా భారతి పాఠశాల నుంచి వినాయక హిల్స్ మీదుగా శ్రీశ్రీ హెూమ్స్ కాలనీ వరకు రూ.2 కోట్ల 20 లక్షలు, అల్మాస్ గూడ నుంచి టెలికాం కాలనీ మీదుగా సాగర్ సొసైటీ వరకు రూ.2కోట్ల 40లక్షలు మొత్తం 16కోట్ల 60లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను త్వరగా నాణ్యతగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.



చంద్రయ్య హట్స్ బస్తీలో ప్రజా సంఘాల సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఈ శ్వ ర్ రావ్, హైదరాబాద్ సౌత్ జిల్లా నాయ కులు శ్రావణ్ కుమార్, ఎం బాలు సత్తార్,కృష్ణ,మీనా,కిషన్, శ్రీనివాస్ నాగమణి,కవిత పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చడానికే చలి వేంద్రాల ఏర్పాటు

- అందెల శ్రీరాములు యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికే మానవతా హృదయంతో చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగతుందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మల్లాపూర్ గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు వరికుప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల వెంట తాగునీరు అందించడం వల్ల పేదలకు, వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ వేసవి తాపం నుంచి పక్షులు, మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు కూడళ్లు, ప్రతీ ఇంటి ముందు చిన్న చిన్న తొట్లను, గిన్నెలల్లో నీటిని మానవతా హృదయంతో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు టేకుల భాస్కర్ రెడ్డి, చిలివేరు ఈశ్వర్, రవి, దేరంగుల గోపాల్, వరికుప్పల నర్సింహా, అంజయ్య, బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల ఫౌండేషన్ చేయూత



నవతెలంగాణ-నాగోల్

నిరుపేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త చేయూతనిచ్చారు. నాగోల్ లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన పంతు నాయక్ తన కూతురు హేమ వివాహం కోసం ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసానికి వచ్చి సహాయం అందించాలని కోరారు. ఈ మేరకు ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త వారికి మంగళ సూత్రం, మెట్టెలు,చీర, గాజులు విరాళంగా అందజేశారు. ఈ విరాళం ఒక్క ఆర్యవైశ్యులకు మాత్రమే కాకుండా అన్ని కులాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి సహాయం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో.పెండ్లి కూతురు హేమ, వీరేశ్, ప్రశాంత్ గౌడ్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మీర్‌పేట్ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గొల్లూరి యాదగిరి కుమారుడు గొల్లూరి రమేశ్ మృతదేహాన్ని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



ఈ కార్యక్రమంలో షెరీఫ్, గొల్లూరి నరహరి, గొల్లూరి మనీష్, గొల్లూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ్‌నగర్ కాలనీలో రెండో విడత కంటి వెలుగు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కాప్రా

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలమేరకు ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని చర్లపల్లి డివిజన్ ఆదర్శ్ నగర్ కాలనీలో రెండో విడత కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నయనానందకరంగా ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని, ప్రతి ఒక్కరికీ కంటి చూపు సమస్యలు లేకుండా చేయాలన్నదే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో



డాక్టర్లు మెడికల్ ఆఫీసర్, విజయ్ కుమార్ రమాదేవి, ప్రమోద్ కుమార్, శ్యామ్ సుందర్, రవి కుమార్, విజయ, వైద్య సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు

- జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్
- ప్రజా వాణిలో వినతుల స్వీకరణ
- జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 108 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జిల్లాలో ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు.

సోమవారం శామీర్‌పేట కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్లో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణితో కలిసి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, విజ్ఞప్తులను స్వీకరిం చారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో మొత్తం 108 దరఖాస్తులు రాగా అందులో ఆయా శాఖలకు సంబంధిం చిన విజ్ఞప్తులు, దరఖాస్తులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి ఓనర్ పేరుతో ఇంటి ట్యాక్సులు ఇవ్వాలని వినతి



జవహర్‌నగర్-నవతెలంగాణ

జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్ ఆధ్వర్యంలో జవహర్ నగర్ సమస్యలపైన ప్రజాదర్బార్‌లో వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా రంగుల మాట్లాడుతూ సామాన్య నిరుపేదలు అధికంగా జీవించే జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అడ్డగోలుగా ఇంటి పన్నులు పెంచేసి నిర్ణీత సమయానికి కట్టని పక్షంలో నల్లా కనెక్షన్, కరెంటు కనెక్షన్ తొలగిస్తామని. ఇంటిని ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది లౌడ్ స్పీకర్లు పెట్టి అనౌన్స్‌మెంట్లు చేస్తూ అనునిత్యం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని జవహర్‌నగర్ బీజేపీ నుండి ఖండిస్తున్నాం అన్నారు. తెలంగాణా ప్రభుత్వమే కానీ కేసీఆర్, కేటీఆర్‌గాని మాకు స్థలాలు ఇవ్వలేదని, మా ఇల్లు కట్టుకోడానికి ఇటుకలు, సిమెంటు ఇసుక మరియు ఇంటిపర్మిషన్ ఇవ్వలేదని, జవహర్‌లో నివసించే ఎంతోమంది పేదవారు ఎన్నో కష్టాలు పడి ఇల్లు కట్టుకున్నారని, వారి స్థలాలను జప్తు చేస్తానంటే సహించేదిలేదని, ప్రజల ఇండ్ల స్థలాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని. 2020-2021 సంవత్సరంలో కరోన వల్ల ప్రజలు ఎంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

అటువంటి కష్ట సమయంలో తెలంగాణ ప్రభుత్వం టాక్స్ మినహా యింపు చేయకుండా వాటికి కూడా వడ్డీపై వడ్డీ వేస్తూ సామాన్య ప్రజలపై భారం మోపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ చెత్త డంపింగ్ యార్డ్ రాంకీ సంస్థ ప్రత్యక్ష బాధిత ప్రాంతమైన జవహర్ నగర్‌లో ఎలాంటి పెనాల్టీ లేకుండా టాక్స్‌లు తీసుకోవాలని చెప్పారు. జవహర్‌నగర్ ప్రభుత్వ భూమి విలువ 1800 ఉన్నదాన్ని ఇపుడు 4200గా పెంచి జవహర్ నగర్ పేద ప్రజల అధిక భారం వేస్తూ నిలువుదోపిడీ చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జవహర్నగర్‌లోని బీజేపీ నాయకులు కమల్, సునీల్ నేత, రాము నాయక్, ఆడిములం రాఘవేంద్ర చారి, శివ కేశవ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

## న్యాక్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ ప్రొగ్రామ్

**100శాతం ప్లేస్ మెంట్**

**ఎస్సీ, బీసీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, వసతి, భోజన సౌకర్యం**

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీసీ అభ్యర్థులకు బీ.ఇ లేదా బీ.టెక్ సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం 3 నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రొగ్రామ్‌ను అందిస్తున్నామని న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ శనివారం తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, భోజన వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 100శాతం ప్లేస్‌మెంట్ అందిస్తామన్నారు. శిక్షణలో చేరడానికి ఆసక్తిగల అభ్యర్థులు (7097114947 నెంబర్‌లో సంప్రదించాలని) ట్రైనింగ్ కోఆర్డినేటర్ వీ.భార్గవ చారిని సంప్రదించాలని కోరారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ9 ఏండ్ల పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ అన్నారు. పంజాగుట్ట నిమ్స్ హాస్పటల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నిమ్స్ యాజమాన్యానికి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 2021 ఏప్రిల్ 1 నుంచి వీడీఏ పాయింట్లు అమలు చేయాలని, ఏరియర్స్ డబ్బులు ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం కార్మికులను పర్మినెంట్ చేయాలని, నిమ్స్ హాస్పటల్‌లో పనిచేస్తూ రిటైర్ అయిన కార్మికులకు ఉచితంగా వైద్యం చేయాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మధ్యాహ్నం జనరల్ బాడీ సమావేశం నిమ్స్ హాస్పటల్‌లో జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం వెంకటేష్ మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ 9 సంవత్సరాల పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డదని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలన ఒక ఫాసిస్టు పద్ధతిలో దేశంలో కొనసాగుతున్నదని అన్నారు. మోడీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వాళ్లను సీబీఐ ఈడీ ఐటి సంస్థలను దుర్వినియోగం చేసి వేధించడం జరుగుతున్నది. అదానిని కాపాడడం కోసం రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేశారని అన్నారు. కొన్ని కోట్ల రూపాయలు కొల్లగొట్టిన అదానిపై ఈడీ, సీబీఐ, ఐటి సంస్థలు ఎందుకు కేసులు పెట్టట్లేదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం హయంలో బీజేపీలో ఉన్న వాళ్లకి ఒక న్యాయం, ప్రజలకు, ప్రతిపక్షాలకి ఒక న్యాయం లాగా తయారయిందని అన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని హైదరాబాదులో ఉన్న కార్మికవర్గం జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లు మార్చి 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిని ప్రవేశపెట్టింది. కార్మికులను ఎప్పుడంటే అప్పుడు తొలగించే స్వేచ్ఛను యజమానులకు అప్పగించి అదాని, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నది. కార్మిక వర్గాన్ని నట్టేట ముంచుతున్నది. ఇప్పటికే గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకులు ధరలు పెంచి పేదవారి నడ్డి విరిచింది. ప్రభుత్వ రంగంలో ఉన్న ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వే తదితర సంస్థలను నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతున్నది. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచుతున్నది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని విద్యుత్ సవరణ బిల్లులో పెట్టి రైతాంగానికి ద్రోహం చేస్తున్నది. తన ప్రజా వ్యతిరేక విధానాలను మరుగునపరచడానికి ప్రజల మధ్య కులం పేరుతో, మతం పేరుతో ఘర్షణ సృష్టించి తన పబ్బం గడుపుకుంటున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలలో ఎండగట్టాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరుగుతున్న కార్మిక, కర్షక, సంఘర్ష్ ర్యాలీ జరుగుతున్న ఈ సందర్భంగా హైదరాబాదులో ఉన్న అన్ని కార్మిక కేంద్రాలలో యూనియన్లలో కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనా, పోరాటాలు నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. సెక్రెటరీ ఈ.నర్సింహా తదిరులు పాల్గొన్నారు.

# నమూనాగా 100 మెట్రోపిల్లర్లు

**ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు ప్రారంభించాం : ఎండీ**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐకియా జంక్షన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టే మెట్రో ప్రాజెక్టు కోసం భూసామర్థ్య పరీక్షల (సాయిల్ టెస్టింగ్)ను సోమవారం ప్రారంభించినట్టు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎయిర్ పోర్ట్ మెట్రో పనుల కోసం సోమవారం భూసామర్థ్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు కోసం అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్ మార్కింగ్ పనులు ఇప్పటికే పూర్తిచేశామన్నారు. ఐకియా జంక్షన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టే మెట్రో పనుల కోసం దాదాపు 100 మెట్రో పిల్లర్లను నమూనాగా తీసుకుని భూసామర్థ్య పరీక్షలు చేట్టామన్నారు. ఈ పనులు పూర్తి కావడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చని చెప్పారు. మెట్రో పిల్లర్స్ వేసే ప్రతిచోట భూమి ఉపరితలం నుంచి సుమారు 40 అడుగుల లోతు వరకు తవ్వి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహిస్తామని, మరికొంత మట్టి నమూనాలను పరీక్షలు పంపించడం జరుగుతుందన్నారు. రెండు నమూనాల పరిశీలించన తర్వాత భూ సామర్థ్యాన్ని నిర్ణయిస్తామని తెలిపారు. దాంతో టెండర్లలో పాల్గొనే బిల్డర్లకు ప్రాజెక్టుపై అంచనా వస్తుందన్నారు. భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, బారికేడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. చీఫ్‌ప్రాజెక్టు మేనేజర్ బి.ఆనంద్ మోహన్, సూపరింటెండెంట్ ఇంజినీర్ సాయపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- నాగారంలో రెండుకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరైయారు. మున్సిపాలిటీలోని 6వ వార్డు శిల్పనగర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన ఓపెన్ జిమ్ పార్కును, 20వ వార్డులో కోటి రూపాయలతో అతి సుందరంగా నిర్మించిన వైకుంఠధామాన్ని, మెయిన్ రోడ్డు బీటి రోడ్డును మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.... మున్సిపాలిటీ అభివృద్ధికి అతిత్వరలో 206 కోట్ల నిధులతో మెయిన్ రోడ్డు విస్తరణ డివైడర్ సెంటర్ లైటింగ్ పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రరెడ్డి, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్, కమిషనర్ వాణిరెడ్డి, కౌన్సిలర్లు లావణ్య శ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి, సబిత ఆంజనేయులుగౌడ్, మమతా కృష్ణారెడ్డి, అనిత సుధాకర్ రెడ్డి, రేణుక జగన్మోహన్ రెడ్డి, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, పంగ హరిబాబు, సుర్వి శ్రీనివాస్ గౌడ్, అన్నంరాజు సుమిత్ర సురేష్, కో-ఆప్షన్ సభ్యులు ఆదాం షఫీ, జలాల్ పాషాభాయ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్, సాయినాథ్ గౌడ్, దయాకర్‌రావు, యువ నాయకుడు కౌకుట్ల రాహుల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వామన్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, డీ.ఈ రఘు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ రామ్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బస్తీ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**లాస్య నందిత**



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మంట. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం. నిరంతరం కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె లాస్య నందిత అన్నారు. సోమవారం మోండా డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, జేపీ నగర్, లోయా నగర్‌లలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పర్యటించారు. ముఖ్యంగా స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మంచినీరు సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దివంగత ఎమ్మెల్యే జీ సాయన్న గతంలో డ్రైనేజీ సమస్య తీర్చుటకు నిధులు మంజూరు చేశారని, అందులో భాగంగా మరో వారం వ్యవధిలో డ్రైనేజీ పనులు ప్రారంభమ వుతాయని ఆమె వెల్లడించారు. అనంతరం లోయ నగర్‌లో పర్యటించి అంగన్‌వాడి కేంద్రం కోసం 10 లక్షల రూపాయలు మంజూరు చేపిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నివేదిత, టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్, నాగనేని సరిత, సదానంద్ గౌడ్, సంతోష్ యాదవ్, పిట్ల నగేష్, నారాయణ, రాజయ్య, భాస్కర్, నిత్యానంద్, మురళి యాదవ్, తేజ్‌పాల్, కాశీరెడ్డి, నరేష్, శేఖర్, జోడీ బ్రదర్స్, నర్సింగ్, రాము, భవాని, శివకుమార్, వాజిద్, భసీర్, ఝాన్సి పాల్గొన్నారు.

# సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రను విజయవంతం చేయండి

- బంగారు నర్సింగ రావు
  సీపీఐ(ఎం) నేరేడ్ మెట్ డివిజన్ కార్యదర్శి




నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 28న తలపెట్టిన జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) నేరేడ్‌మెట్ డివిజన్ కార్యదర్శి బంగారు నర్సింగ రావు పిలుపు ఇచ్చారు. సోమవారం నేరేడ్‌మెట్ డివిజన్లోని ఆర్కేపురం, అంతయ్య కాలనీలో సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా అదిలాబాదు నుండి ప్రారంభమైన (బస్సు యాత్ర) జనచైతన్య యాత్ర మంగళవారం మధ్యాహ్నం 3.00గంటలకు ఔషపూర్ ఘట్కేసర్ వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ యాత్ర ఘట్కేసర్, మేడిపల్లి, ఉప్పల్, చిలుకానగర్, నాచారం, మల్లాపూర్ మీదుగా ఈసీఐఎల్ వరకు ఉంటుందన్నారు. అనంతరం ఈసీఐఎల్ చౌరస్తాలో సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అధిక సంఖ్యలో రెడ్ షర్టు/రెడ్ చీరలు ధరించి వాహనాలతో యాత్రలో పాల్గొనేందుకు ఔషాపూర్ చేరుకోవాలని ఆయన కోరారు. సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తానందు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సుమిత్ర, సునంద, నాగమణి, పద్మ, లక్ష్మీబాయి, మంజుల, నర్సమ్మ, బుజ్జి, లత తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో కృష్ణ ఉమెన్, చిల్డ్రన్ హాస్పిటల్‌లో పసికందు మృతి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



వైద్యుల నిర్లక్ష్యం వల్ల పసికందు మృతి చెందింది. ఈ ఘటన నాంపల్లి కృష్ణ ఉమెన్, చిల్డ్రన్ హాస్పిటల్‌లో సోమవారం జరిగింది. సిద్దిపేటకు చెందిన మల్లేశం 2 నెలల బాబు నిమోనియా సమస్యతో 15 రోజుల క్రితం కృష్ణ హాస్పిటల్ చేరారు. 3 రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామన్న వైద్యులు 15 రోజులు గడిచాక బాబు మృతి చెందినట్టు చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బాబు మృతి చెందాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. బాబు మృతికి కారణమైన హాస్పిటల్ యాజమాన్యం వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

## బీఆర్ఎస్ పాలనలోనే మహిళలకు అధిక భద్రత

- నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం తార్నాక డివిజన్‌లోని మహిళలు బీఆర్ఎస్ చేపడుతున అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం దేశంలో మరెక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. పార్టీ సిద్ధాంతాలు, పథకాల అమలు చేస్తున్న తీరును చూసి మహిళలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు సులోచన, నిర్మల, వీణ, రమ, లత, విద్య, సుధ, టీటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమవత్ నాను నాయక్, జల్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధానికి సిద్ధం కావాలి




- ప్రజల సొమ్మును కార్పొరేట్ శక్తులకు ధారబోత
- మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సిరెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ యుద్ధానికి సిద్ధం కావాలని, ప్రజల సొమ్మును కార్పొరేట్ శక్తులకు ధారబోస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సిరెడ్డి అన్నారు. సోమవారం అంబర్‌పేట తిలక్‌నగర్ సిగ్నల్ వద్ద బీజేపీ, మతోన్మాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సిరెడ్డి, సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కార్యవర్గ సభ్యులు మహేందర్, జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాస్, ఐద్వా కార్యదర్శి నాగలక్ష్మి, సీఐటీయూ కార్యదర్శి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, యాత్ర ఇన్‌చార్జి మారన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల నర్సిరెడ్డి మాట్లాడుతూ మోడీ అమిత్‌షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాన్ని మోపుతున్నాయన్నారు. దేశమంటే అంబానీ ఆదానిలా సొత్తుగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు మూడు నుంచి నాలుగు రెట్లు పెంచి పేదవాడి నడ్డి విరుస్తున్నారని అన్నారు. రూ. లక్షల కోట్లు ఖర్చుపెట్టి బలోపేతం చేసిన ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అమ్మేస్తూ భూములను మార్కెట్లను పరిశ్రమలను ఉపాధి కల్పించే రంగాలను పూర్తిగా కార్పొరేటీకరణ చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా ఒక్క శాతం ఉన్న బడా కార్పొరేట్ వద్ద 40 శాతం సంపద పోగు పడిందని తెలిపారు. ప్రపంచ మానవ అభివృద్ధి ఆకలి సూచికలో మన దేశం 141 స్థానంకి దిగజారిందని.. విద్యలో 30వ స్థానంలో ఉందన్నారు. రూ. లక్షల కోట్ల నల్లధనాన్ని తెచ్చి ప్రతీ కుటుంబానికి 15 లక్షలు ఇస్తానని ఎన్నికల ముందు చెప్పి గద్దెనెక్కి మోసం చేశారన్నారు. తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద మనం రోజు వాడుకునే ప్రతీ వస్తువు మీద జీఎస్టీ విధించి నిత్యావసర ధరలను ఆకాశానికి అందేలా చేశారని మండిపడ్డారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు తీసుకువచ్చి అత్యంత ప్రమాదకరమైన విద్యుత్ చట్టాన్ని అమలు చేస్తూ రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తున్న మోడీ విధానాల వల్ల ఏటా 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, 2006 అడవి హక్కు చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని రైతాంగం కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకే భాష పేరుతో హిందీ సంస్కృతిని మనపై రుద్దుతున్నారన్నారు. విద్యలో జ్యోతిష్యాన్ని పాఠ్యాంశాంగా మార్చారన్నారు. దళిత, గిరిజన, మహిళ, మైనారిటీ బీసీలపై నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు ఎందరో వీరులు తమ ప్రాణాలను అర్పించి సాధించిన స్వతంత్ర భారతం నేడు మతోన్మాదుల కూరల్లో చిక్కి విలవిలలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. బిజెపి మోడీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకిస్తూ మార్చి 29న ఇందిరా పార్క్ వద్ద జరుగు భారీ బహిరంగ సభను భారీగా తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యవర్గ సభ్యులు ఎం మహేందర్, ఐద్వా కార్యదర్శి నాగలక్ష్మి సీఐటీయూ కార్యదర్శి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు నరేష్, మోహన్, రాములు, సుబ్బారావు, నిరంజన్ పాల్గొన్నారు.

## పేదల నోటికాడి బువ్వను లాగేస్తున్న కేంద్రం పాలన



- ఐద్వా సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ

నవతెలంగాణ-హైదరాబాద్

పేదల నోటికాడి బువ్వను కేంద్ర బీజేపీ పాలన లాగేస్తున్నదని ఐద్వా సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ అన్నారు. 4 రోజులుగా హైదరబాద్ సౌత్ జిల్లాలో కార్మివాడలు పర్యటించిన ప్రజా సంఘాల జీపు జాతా సోమవారం ఇంద్రానగర్ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌లకు ఇచ్చే సబ్సిడీని అక్రమంగా రద్దు చేసి రూ.560 ఉన్న ధరను రూ.1155లకు పెంచిందన్నారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ పాలన వల్ల పేద కుటుంబాల మహిళలు స్టవ్ ఆన్ చేయాలంటే ఎప్పుడు గ్యాస్ అయిపోతుంది? మళ్లీ అన్ని డబ్బులు ఎక్కడ అప్పు తెచ్చి చెల్లించాల్సి వస్తుంది ? అని ఆందోళనతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి.నాగేశ్వర్ మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి పరోక్షంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ద్వారా పొందే ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. సహజ వనరులను అదానీ, అంబానీలకు అప్పగించి వారిచ్చే లంచాలతో ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రశ్నించే వారిని జైళ్ల పాలు చేస్తూ నిరంకుశ పాలన చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 29వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## జన చైతన్య యాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలి



- పోస్టర్ ఆవిష్కరణలో జోన్ కన్వీనర్ సత్తార్

నవతెలంగాణ-హైదరాబాద్

సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర ముగింపు మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్‌పుర జోన్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ అన్నారు. చార్మినార్, బహదూర్‌పురా జోన్ కమిటీ ఆధ్వర్యంలో 29వ తేదీన ఇందిరాపార్క్ దగ్గర జరిగే ముగింపు మహాసభ విజయవంతం చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న బీజేపీ, మోడీ ఇజం అరాచకత్వం ప్రజలను ఇబ్బందుల గురి చేస్తుందన్నారు. కార్మిక, కర్షక, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టేదే మహాసభ అన్నారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) పోలీస్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్, బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు కె.వీరయ్య, నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వక్తలు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాల పై కార్మిక, కర్షక, పేదల, మైనారిటీల, మహిళల, యువకుల సమస్యలపై, ప్రజాస్వామ్య ఉల్లంఘనపై ఈ మహాసభలో ఉపన్యాసిస్తారన్నారు. నగర ప్రజలందరూ ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు ఎం.మీనా, బాబర్ఖాన్, షేక్ యాకూబ్, సయ్యద్ ఇబ్రహీం, ఆవాజ్ నాయకులు, అలీ అబ్బాస్, మహమ్మద్ కలీముద్దీన్, మహమ్మద్ అన్వర్ ఖాన్, వలి మహమ్మద్, షేక్ అంజద్, గులాం నసీర్, సయ్యద్ అలీమ్, తదితరులు పాల్గొన్నారు.




## 'రౌషన్ కుమార్ సిన్హాపై అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి, బీహార్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రౌషన్ కుమార్ సిన్హాను 16 మార్చి 2023న అరెస్టు చేసి జైలులో నిర్బంధించారనీ, అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు సంబంధించిన తప్పుడు, కల్పిత ఆరోపణలతో అతన్ని ఇరికించారనీ, వెంటనే అతనిపై నమోదు చేసిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ జాతీయ సమితి పులుపులో భాగంగా రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్ నగర్ లోని 'వై' జంక్షన్ కూడలి వద్ద కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్లకార్డులు చేతబూని నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం దేశంలోని యువతను మోసం చేయడానికి, జాతీయ భద్రతను బలహీనపరిచేందుకు ఉద్దేశించిన వినాశకరమైన పథకమన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బీహార్‌లో శాంతియుత పద్ధతిలో రౌషన్ కుమార్ నేతృత్వంలో పోరాటం నిర్వహిస్తే, తప్పుడు సాక్ష్యాలు ఆరోపణలతో రౌషన్ కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసులు బనాయించి, జైలుకు పంపారని గుర్తు చేశారు. ఏఐవైఎఫ్ నేతలు హింసను విశ్వసించరనీ, తమ అసమ్మతిని ఎల్లప్పుడూ శాంతియుత పద్ధతిలో ప్రదర్శిస్తారని స్పష్టం చేశారు. అగ్నిపత్ నిరసనలో హింసకు సంబంధించిన కల్పిత కేసుల కింద కామ్రేడ్ రౌషన్ కుమార్ సిన్హాను అరెస్టు చేయడం ఉద్దేశపూర్వకంగా అసమ్మతి, ప్రజాస్వామ్య స్వరాలను తగ్గించడానికి ప్రయత్నమనీ, పాలనపై విమర్శకులలో భయాన్ని కలిగించడానికి ఒక దుష్ట చర్యగా తాము భావిస్తున్నామన్నారు. రౌషన్ కుమార్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు మాజీద్, రాష్ట్ర సమితి సభ్యులు శ్రీమాన్, నేతలు కళ్యాణ్, శ్రీను, నారాయణ, రఘు, వినోద్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు తక్షణమే వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి

- ప్రజాసంఘాల నాయకులు డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్



దుకాణాలకు, ట్రాన్స్ పోర్ట్‌ల్లో నిత్యం సరుకులు మోసే హమాలీలకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయకుండా దేశంలో దాదాపు 60 లక్షల మందికి బీజేపీ ప్రభుత్వం నష్టం చేస్తున్నదని సీఐటీయూ హైదరబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్ అన్నారు. హక్కుల సాధనకు, కార్మికు లకు ఉపయోగం లేని యజమానులు ఇంకా కార్మికులను దోపిడీ చేసేందుకు వీలు కల్పించే ఉద్దేశంతో మోడీ సర్కార్ తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్ ధరలను తగ్గించాలనీ, తదితర డిమాండ్ల సాధనకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కార్మికుల ను చైతన్యం చేస్తూ నిరసన సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరుగుతున్న భారీ బహిరంగ సభకు హమాలీ, ఆటో స్టాండ్ లలో పనిచేసే తదితర కార్మికులు అధిక సం ఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల జన చైతన్య జీపు జాతా సోమవారం మహరాజ్ గంజి, మహబూబ్ గాంజ్, కిషన్ గంజి హమాలీ కార్మికులు వందలాదిగా పనిచేసే ప్రాంతాలు, నగర ప్రజా జీవితానికి వివిధ ప్రాంతాలకు సులువుగా చేరుకోవడానికి సహకరిస్తు న్న ఆటో డ్రైవర్లు ఉండే (సాలర్జంగ్ మ్యూజియం, అఫ్జల్గంజ్,) ఆటో స్టాండ్‌లలో సీఐటీయూ, ఐద్వా, ఆవాజ్, డీవైఎఫ్ఐ, టీజీఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులు శశికళ, అబ్దుల్ సత్తార్, ఎం.బాలు, ఏ కృష్ణ, కే.జంగయ్య, పి.నాగేశ్వర్, కోటయ్య, మీనా, తదితరులు పర్యటించారు. మహారాజ్ గంజి, కిషన్ గంజి, ఆటో స్టాండ్లలో జరిగిన సభల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పి.చెన్నయ్య, అర్.సాయిలు, పి.కుర్మయ్య సవతప్ప, మహబూబ్, హన్మంతు, బాబా, ఎండీ. ఈక్బాల్, భీమ్, తాయప్ప పాల్గొన్నారు.

## దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలోనే అమలు

నవతెలంగాణ-అడిక్‌మెట్



దేశంలో ఎక్కడా లేని కనీవిని ఎరగని సంక్షేమ పథకాలు తెలంగాణలోనే అమలవుతున్నాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ ఆర్ కన్వెన్షన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, సాయి కిరణ్ యాదవ్ బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలన్నారు. కేసీఆర్‌ను ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విభేదాలను పక్కన పెట్టి నాయకులంతా ఒకే తాటిపైకి వచ్చేందుకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రైతులకు, దళితులకు బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. నియోజవర్గంలో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించుకొనున్నట్టు తెలిపారు. కేంద్రంపై గట్టిగా మాట్లాడితే ఈడీ కేసులతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ ఎంపీ హోదాలో ముషీరాబాద్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి నిధులను తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ముఠా జై సింహ, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు రవీందర్, ముఠా పద్మ, బీఆర్ఎస్ నాయకులు సాయి కిరణ్, ఎస్.యాదగిరి, షరిపుద్దిన్, లూక్, కల్వ గోపి, మాధవి, పద్మజ, వల్లాల శ్రీనివాస్ యాదవ్, కార్తీక్ యాదవ్, దుర్గస్వామి, విక్కి, ప్రభాకర్, ముకుంద్ రెడ్డి, చంద్రశేఖర్, వేణు, పలు డివిజన్ల అధ్యక్షులు రాకేష్ కుమార్, ఆర్.మోజెస్, ప్రధాన కార్యదర్శులు ఆకుల అరుణ్, సాయికిరణ్, కరిక కిరణ్ కుమార్, బల్వీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర సంస్థల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ

నవతెలంగాణ-అడిక్‌మెట్

టీఎస్పీఎస్సీని వెంటనే రద్దు చేసి ప్రభుత్వ ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం లేని స్వతంత్ర సంస్థల ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. సోమవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన వారం రోజుల నుంచి టీఎస్పీఎస్సీ లీకేజీ అంశం విచారణలో సీట్ కేవలం కొంతమంది పాత్రధారుల, రాజకీయ నేతల విచారణతో సమయం వృధా చేస్తుందే తప్ప అసలైన నిందితులు, కుట్రదారులు మూల దోషుల విచారణకు ప్రయత్నం చేయడం లేదన్నారు. గత నియామకాల్లో ఎస్సై కానిస్టేబుల్ నుంచి 2016 గ్రూప్ 1 వరకు అవకతవకలు అక్రమాలు జరిగాయని తెలిపారు. రాజ్యాంగబద్ధతో, స్వతంత్య ప్రతిపత్తితో ఏర్పడిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ గత ఆరు నియామక ప్రక్రియల్లో లీకేజీలు, అక్రమాలు అవకతవకలు జరుగుతుంటే అందుకు ప్రభుత్వ పెద్దలే సూత్రదారులని వార్తలు వస్తుంటే, ప్రభుత్వ డైరెక్టు నియామక సంస్థలైన పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు, వైద్య విద్యా నియమక బోర్డు, ఎలక్ట్రిసిటి నియామక బోర్డు, గురుకుల నియామక బోర్డుల నియామకాలు సక్రమంగా జరుగుతాయని ఎలా నమ్మాలి అని ప్రశ్నించారు. ఇలాంటి అన్ని బోర్డులు, ఆ నియామకాలు, పద్దతులు వెంటనే రద్దు చేసి, స్వయం ప్రతిపత్తి గల సంస్థలతో మాత్రమే నియామకాలు జరిపే పద్ధతులను ప్రవేశ పెట్టాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో నీల వెంకటేష్, పి.సుధాకర్ ముదిరాజ్, రాజేందర్, అనంతయ్య రాంబాబు పాల్గొన్నారు.

## ప్రశ్నించే స్వరాలపై క్రూరమైన అణిచివేత దేశానికి హానికరం




- ఏఐటీయూసీ రాష్ట ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడి ఎమర్జెన్సీ కంటే దారుణమనీ, ప్రశ్నించే స్వరాలపై క్రూరమైన అణిచివేత దేశానికి హానికరమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే కోడ్, ఒకే ఎన్నికల కోసం స్పష్టమైన పిలుపుతో ఏకీకృత నిరంకుశత్వానికి అనుకూలంగా భారత రాజ్యాంగంలో నిక్షిప్తమైన సమాఖ్య, బహువచన నిర్మాణం ప్రధాని మోడీ ధ్వంసం చేస్తున్నారన్నారు. సోమవారం హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మూడో మహాసభల సావెనీర్‌ను ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, పి.ప్రేమ్ పావని, కె.ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, నండూరి కరుణకుమారి, శ్రామిక మహిళా ఫోరమ్ నాయకురాలు జ్యోతిశ్రీమాన్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక భావజాలం, కుట్రపూరిత సిద్ధాంతాలు, ప్రధాని మోడీ హింసాత్మకంగా నిశ్శబ్దంతో లౌకిక ప్రజాస్వామ్య భారతదేశ భవిష్యత్తుకు ఆసన్నమైన ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారిక ఎమర్జెన్సీ లేకుండా మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాల నేతలను తప్పుడు కేసులు బనాయించి, జైళ్లలోకి నెట్టిస్తున్నారనీ, ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. మోడీ నేతృత్వంలోని ఫాసిస్ట్ పాలనను కూలదోయడానికి పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలిపునిచ్చారు.

## లాల్ బహుదూర్ శాస్త్రికి దేశం ఋణపడి ఉంది

నవతెలంగాణ - హైదరాబాద్

ప్రపంచ నీటి దినోత్సవం 2023 సందర్భంగా, కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖామాత్యులు నరేంద్ర సింగ్ తోమార్ దివంగత భారత ప్రధాని మరియు భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి నాయకత్వాన్ని వేనోట పొగిడారు. ప్రధానమంత్రి నివాసంలో వ్యవసాయం చేయడానికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు భారతీయ రైతులు ఇప్పుడు ఆహార ధాన్యాల పరంగా స్వీయ సమృద్ధి సాధించడంలో స్ఫూర్తినందించాయన్నారు. శాస్త్రి వ్యక్తిత్వానికి సాటి ఎవరూ లేరు. 1965లో ఆహార సంక్షోభం ఎదురైనప్పుడు ఆయన తన అధికారిక నివాసంలో వ్యవసాయం చేయడం మాత్రమే కాదు, మన దేశ రైతులను జై జవాన్, జై కిశాన్ నినాదంతో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాల్సిందిగా పిలుపునిచ్చిన ఆయన ఇప్పుడు దేశం స్వీయ సమృద్ధి సాధించడంలోనూ తోడ్పడ్డారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుకు స్పందించి ఎంతోమంది గ్యాస్ సబ్సిడీని వదులుకున్నారని ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని ధనూక గ్రూప్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తోమార్ పాల్గొనడంతో పాటుగా లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటం ఆవిష్కరించారు. దీనితో పాటుగా లాల్ బహదూర్ శాస్త్రి మనవడు శ్రీ సంజయ్ నాథ్ సింగ్ రచించిన పుస్తకాన్ని సైతం విడుదల చేశారు.

## బాలబాలికలు తప్పనిసరిగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



పోషకాహార లోపంతో బాధపడే బాలబాలికలు తప్పనిసరిగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ జాయింట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గిరిజ, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి సునంద తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అడిక్ మెట్ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజ, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి సునంద హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి అధికంగా సమకూరుతుందన్నారు. చిరుధాన్యాలలో విటమిన్ సి అధికంగా ఉండటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుదల ఉంటుందన్నారు. చిరుధాన్యాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పోషణ పక్షం ద్వారా వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పరిశుభ్రతపై కూడా పిల్లలకు పూర్తిస్థాయిలో వివరించారు. గర్భిణులు, బాలింతలు పాటించాల్సిన నియమాలను ప్రత్యేకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్, హెల్త్ అండ్ న్యూట్రిషన్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, సూపర్వైజర్ కవిత, జాహ్నవి, అంగన్వాడీ టీచర్‌లు సంధ్య, అనుజ, అనురాధ, రాధ, ప్రమీల, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## నెక్ట్స్ ప్రీమియా మాల్‌లో ప్రారంభమైన బుక్ ఫెయిర్

నవతెలంగాణ - హైదరాబాద్



అత్యంత అందుబాటు ధరలలో పుస్తకాలను విక్రయించడం ద్వారా ఖ్యాతి గడించిన కితాబ్ లవర్స్ సంస్థ, నగరంలో తొమ్మిది (9) రోజుల పాటు బుక్ ఫెయిర్‌ను నిర్వహించబోతుంది. ఈ బుక్ ఫెయిర్ మార్చి 25వ తేదీన ఇర్రమ్ మంజిల్ మెట్రో స్టేషన్‌తో అనుసంధానితమైఉన్న నెక్ట్స్ ప్రీమియా మాల్ లోయర్ గ్రౌండ్ ఫ్లోర్ వద్ద ఏప్రిల్ 2వ తేదీ వరకూ జరుగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ బుక్ ఫెయిర్‌లో 20కు పైగా జెనర్స్‌లో 10 లక్షల కు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఈ ఫెయిర్ గురించి కితాబ్ లవర్స్ ఫౌండర్ రాహుల్ పాండే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బుక్ ఫెయిర్ నిర్వహించడం పట్ల సంతోషంగా ఉన్నాము. నగరంలో మేము నిర్వహిస్తోన్న 5వ కార్యక్రమమిది. ఈ బుక్‌ఫెయిర్‌లో అత్యంత సరసమైన ధరలలో పుస్తకాలను అందిస్తుండటం వల్ల అధిక శాతం మంది పుస్తకప్రేమికులకు సంతోషాన్ని అందించగలుగుతున్నాము. చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకూ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే జెనర్‌లో పుస్తకాలు లభ్యమవుతాయి"అని అన్నారు.

## '24 విభాగాల్లో సౌత్ టీవీ అవార్డ్స్'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ భాషా సంస్కృతికశాఖ సౌజన్యంతో వీవ్ మీడియాస్, పొట్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్, ఎడిట్ పాయింట్ ఇండియా ఆధ్వర్యంలో సినీ, బుల్లి తెర రంగాల్లో 24 విభాగాల్లో కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఏప్రిల్ 27, 28, 29 తేదీల్లో సౌత్ టీవీ అవార్డ్స్ అందిస్తున్నట్టు వీవ్ మీడియా చైర్మన్ కొప్పుల వసుంధర, పొట్ల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ పొట్ల శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, కొప్పుల వసుంధర, పొట్ల శ్రీనివాసులు, బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ మహిళా వింగ్ ప్రెసిడెంట్, రుసి ఫౌండేషన్ చైర్మన్ పట్లోల్ల రుపారెడ్డి, ఫొటోఫిన అధినేత ఇప్పలపల్లి రమేష్ తదితరులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సౌత్ టీవీ అవార్డ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించినట్టు వారు పేర్కొన్నారు. పదేండ్లుగా ఫొటోగ్రఫీ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఎడిట్ పాయింట్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ ఫొటోగ్రఫీ ఎక్స్పో ఫొటోఫినలో సినీ రంగమే కాకుండా వివిధ రంగాల ప్రముఖులను సత్కరిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. కళాకారులను గౌరవించడమే కాకుండా దాదాపు రూ.5 లక్షల విలువైన జీవిత బీమా, ఆరోగ్య బీమా అందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు కొప్పుల వసుంధరను సౌత్ టీవీ టీమ్‌ను అభినందిచారు. నార్సింగ్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్ హాల్‌లో ఏప్రిల్ 27, 28, 29 తేదీల్లో జరిగే అంతర్జాతీయ ఫొటోగ్రఫీ ఎక్స్ పో ఫొటోఫిన కార్యక్రమంలో అవార్డులతో పాటు స్టాల్స్, ఫుడ్ ఫెస్ట్, ఫ్యాషన్ షో తదితర కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగుతాయనీ, ఈ ఈవెంట్‌కు హాజరు కావాలన్న విజిటర్స్ రిజిస్ట్రేషన్ కోసం, అవార్డ్స్ నామినేషన్స్ కోసం ఫొటోఫిన డాట్ కామ్ వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

## టీఎస్పీఎస్సీ బోర్డును రద్దు చేసి చైర్మెన్‌ను తొలగించాలి

నవతెలంగాణ-ఓయూ



పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు బాధాకరమనీ, 30 లక్షల మంది విద్యార్థి, నిరుద్యోగులు నిరాశకు గురైతే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్పందించకుండా మొద్దునిద్రలో ఉందని బహుజన విద్యార్థి సంఘాలు అన్నాయి. సోమవారం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో మానవ హారం నిర్వహించారు. తక్షణం టీఎస్పీఎస్సీ చైర్మన్‌ను తొలగించి బోర్డును రక్షణ చేయాలన్నారు. ఈ కేసును సీట్‌కు అప్పగించాలని కోరారు. సిట్‌కు నాయకత్వం వహిస్తున్న ఏర్ శ్రీనివాస్‌పై అనేక ఆరోపణలు వస్తున్న క్రమంలో ఈ కేసును ఇంకా సిట్ ద్వారా కొనసాగిస్తామని చెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యమన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ కేసును సీబీఐకి బదలాయించాలనీ, లేదంటే రాష్ట్రం మరో తెలంగాణ ఉద్యమంగా మార్చడానికి విద్యార్థులంతా వారి భవిష్యత్ కోసం పోరాటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, బహుజన్ స్టూడెంట్స్ జాక్ చైర్మన్ వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, విద్యార్థి సంఘాల నాయకులు కాంపాటి వెంకన్న గౌడ్, కొర్ర ఈశ్వర్ లాల్, భాస్కర్ శ్రీనివాస్, సురేష్, రాకేష్, హర్షద్ సందీప్, సత్యం, సంతోష్, ఆనంద్, కుమార్, సతీష్, వెంకటేష్, ప్రభాకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-ఓయూ



తార్నాక డివిజన్‌లోని మానికేశ్వర్‌నగర్ మాదిగ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సోమవారం నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలనీ, కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ నూతనంగా ఎన్నికైన కాలనీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, కాలనీ సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ బి.కుమార్, జనరల్ సెక్రెటరీ ఎం.రవి, ట్రెజరర్ వి.సుధాకర్, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రెటరీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉగాది నంది అవార్డు రేగళ్ల సతీష్ రెడ్డికి కేంద్ర మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర నిరూప నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ శాఖ చైర్మెన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి, సరస్వతి ఉపాసకులు సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, బ్రహ్మశ్రీ కొడకండ్ల శివరాం శర్మ, బ్రహ్మశ్రీ వెల్లంకి కృష్ణ జ్యోతిష్య వేద పండితులు, ప్రముఖ నటి, నర్తకి జయలక్ష్మీ, ప్రముఖ సినీ గేయ రచయిత రాంబాబు గోసాల చేతుల మీదుగా నంది అవార్డు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ అవార్డు ప్రదానం చేసిన కళానిలయం పుష్పలత, సురేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

- నవతెలంగాణ,కాప్రా



## మంచినీటిని పొదుపుగా వాడాలి

**కార్పొరేటర్ కొనుకుల జగన్**

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

విలువైన మంచినీటిని పొదుపుగా వాడాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం గాజులరామారం సర్కిల్, డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రపంచ నీటి దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృధా చెయ్యవద్దని మీ ఇండ్లలో నీటి కొళాయికి వాల్ పెట్టుకోవాలని మీ తలితండ్రులకు తెలిజేయాలని విద్యార్థులను ఉదేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట జలమండలి మేనేజర్ అంకిత్, వర్క్ ఇన్స్పెక్టర్ రిజ్వాన్, సోమయ్యనగర్ బస్తి ప్రెసిడెంట్ టి .యాదగిరి బీఆర్ఎస్ నాయకులు జి.విట్టల్ ముదిరాజ్, మనోజ్, ప్రభాకర్, ముకేశ్, నరసింహారెడ్డి, సంపత్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ , సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, పాపుల్ గౌడ్, మహామూద్, పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడల్లో రాణించి దేశ ప్రతిష్ట ఇనుమడింపచేయాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్, స్పోర్ట్స్ డే వేడుకలు

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

విద్యార్థులు చిన్ననాటి నుండే విద్యతోపాటు క్రీడలు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించి దేశ ప్రతిష్ట ఇనుమడింపజేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్, భగత్‌సింగ్ మార్గ్‌లో గల శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన "గ్రాడ్యుయేషన్ డే" "స్పోర్ట్స్ డే" వేడుకలను ఆయనతోపాటు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, ట్రాఫిక్ ఏసీపీ కడాల వెంకటరెడ్డి, మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు కే.రామేశ్వర్ రెడ్డి, సంఘ సేవకులు జితేందర్ రెడ్డిలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అప్పుడే వారు అనుకున్న గమ్యాన్ని అవలీలగా సాధిస్తారని తెలిపారు. క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగాలు వస్తాయని, ఆ దిశగా ప్రయత్నించాలని సూచించారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్, మేడ్చల్ జిల్లా ట్రస్మ ఉపాధ్యక్షులు, బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటు బోధిస్తు వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు. తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలో చదువులో, క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ఫలితాలు సాధించేం దుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం చిన్నారి విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు, బహుమతులను వారు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బిర్రు శోభారాణి, పలు పాఠశాలల కరస్పాండెంట్స్ వినోద్ కుమార్ జాదవ్, దయాకర్, నర్సింలు గౌడ్, ప్రవీణ్ రెడ్డి, ఇమ్రాన్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ రషీద్, హజరత్ అలీ, సునీల్, ఉపాధ్యాయులు భాగ్యరేఖ, కృష్ణవేణి, మల్లేశ్వరి, రజిత, ప్రశాంతి, అన్నే ఫాతిమా, లక్ష్మీ ప్రసన్న, సుభాషిని, సాజిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జీఓ 58 రెగ్యులరైజ్‌తో నిరుపేదల జీవితాలకు భరోసా





**నవతెలంగాణ - బాలానగర్**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో జీఓ నెంబర్ 58 ప్రకారం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో గత కొంతకాలం నుండి ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న నిరుపేదలకు వారి స్థలాలను క్రమబద్ధీకరిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని 150మంది లబ్ధిదారులకు సోమవారం పట్టాలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండే ముఖ్యమంత్రి కేసీఆర్ అని, దశాబ్దాలుగా నివాసం ఉంటున్న లబ్ధిదారులైన నిరుపేదలకు జీవో నెంబర్ 58 ప్రకారం వారికి రెగ్యులరైజ్ చేసి జీవితంపై భరోసా కల్పించిన కేసీఆర్ గొప్ప మహానుభావుడన్నారు. ఎప్పుడూ మానవీయ కోణంలో ఆలోచించే వారికి మాత్రమే ఇటువంటి ఆలోచనలు వస్తాయని, అందుకనే రైతులకు అండగా రైతుబంధు, రైతు బీమా నిరుపేదల ఆడబిడ్డ పెళ్ళికి రూ.1లక్ష 116 అందిస్తూ ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపే సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. కేవలం సంక్షేమ పథకాలతోనే కాకుండా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను తీసుకువచ్చి అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, శాంతిభద్రతల విషయంలో రాజీ పడకుండా ఎక్కడకక్కడ పటిష్ట ప్రణాళికలు రచించడం వంటి చర్యలు తీసుకోవడం వల్ల కేవలం 9 ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, ఎంఆర్ఓలు, గోవర్ధన్, డి.అహల్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఈసీఐఎల్‌లో జన చైతన్య యాత్ర సభ



**కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళల బాలపీరు**

**నవతెలంగాణ-దుండిగల్**

బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నిర్వహిస్తున్న జనచైతన్య యాత్ర ఘట్కేసర్ ఔషాపూర్‌కు మంగళారం 3 గంటలకు చేరుకుంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంస్థ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జన చైతన్య యాత్ర జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నాగనిగల్ల బాలపీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషాపూర్ వద్ద నుండి 3గంటలకు అక్కడ నుండి ప్రారంభమై మేడిపల్లి, ఉప్పల్, చిలుకానగర్, నాచారం, మల్లాపూర్, మౌలాలి మీదుగా ఈసీఐఎల్ చేరుకుంటుందని, అనంతరం మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఈసీఐఎల్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు. ఇప్పటివరకు దేశంలో ఒక్క అధికార పార్టీ నాయకుడిపై కూడా దాడులు జరగలేదని అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో ప్రభుత్వ పరిశ్రమలు అన్నింటిని అభివృద్ధి చేయాలని, అలానే ఘట్కేసర్ పోచారంలో ఐటిఐఆర్ ప్రాజెక్టు రద్దు చేసిందాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరుగుతున్న జనచైతన్య యాత్రల ముగింపు సందర్భంగా మార్చి 29న ఇందిరాపార్క్ వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ శరత్ పాల్గొంటున్నారని తెలిపారు.



ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీలో విష్ణువర్ధన్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్రీ స్కూల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి కృష్ణ, వైస్ చైర్మెన్ పద్మారావు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, స్థానికులు, స్కూల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

- నవతెలంగాణ,దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్‌రెడ్డి, నిజాంపేట్ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. అనంతరం సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుక పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నవతెలంగాణ,దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డి నిజాంపేట్ డంపింగ్ యార్డు దగ్గర క్రీడా మైదానానికి కేటాయించిన స్థలాన్ని సోమవారం పరిశీలించారు. క్రీడా మైదాన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, ఆవుల జగన్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, ఎన్ఎంసి ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- నవతెలంగాణ,దుండిగల్

## నైపుణ్యం పదును పెట్టేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

**కార్పొరేటర్ కొలుకుల జగన్**

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

విద్యార్థుల నైపుణ్యం పదునుపెట్టెందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రాజీవ్ గృహకల్ప కాలనీలోని సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన ( వైజ్ఞానిక ప్రదర్శన 2023) ఎక్స్పో కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చేసిన మోడల్స్, నమూనాలను తిలకించారు.

ప్రదర్శనలో విద్యార్థులు వివరించిన తీరును అభినందిస్తూ ప్రశంసించారు. ఇదే ఉత్సాహంతో ఉన్నత ఆలోచనలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజుగౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన విధానాలకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ విద్యతో



పాటు క్రీడల్లోనూ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించే విధంగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. సామాజిక విలువల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూన మహాలక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇరగ దిండ్ల వెంకటేష్, షిరిడీ హిల్స్ అధ్యక్షులు సిహెచ్.దాసు, నాయకులు గిరి, వైష్ణవి స్కూల్స్ చైర్మన్ సిహెచ్. నర్సింహులు గౌడ్, తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ



**నవతెలంగాణ-దుండిగల్**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని 19,20వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభివృద్ధితోపాటు ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేస్తుందని ప్రభుత్వం చేపట్టిన ఉచిత కంటి వెలుగు పరీక్షలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు .కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, దుండిగల్ మున్సిపల్ చైర్పర్సన్ సుంకరి కృష్ణవేణికృష్ణ, వైస్ చైర్మన్ పద్మారావు, డా. ఆనంద్,కమిషనర్ సత్యనారాయణ, డా.నిర్మల, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి వనితబుచ్చిరెడ్డి, సునీతమురళి యాదవ్, మాదాసు వెంకటేష్, అర్కల అనంతస్వామి, బౌరంపేట్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్ గాజుల సుజాత, నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, పోలీస్ గోవింద్ రెడ్డి, సరుగారి ధర్మారెడ్డి, మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రగిరి సతీష్, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాంకీ పెరల్ అసోసియేషన్ అందరికీ ఆదర్శం



**ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ**

**నవతెలంగాణ - కూకట్‌పల్లి**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాంకీ పెరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రూపాయలు ఒక కోటి యాభై లక్షల రూపాయల అంచనావ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రాంకీ పెరల్ కాలనీ అసోసియేషన్ వారు ఆదర్శంగా నిలిచారని, వారు తమ స్వంత నిధులతో కాలనీలో రోడ్లు ఏర్పాటు చేసుకోవడం చాలా అభినదించదగ్గ విషయం అని, తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన తెలియచేశారు. అదేవిధంగా ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరం అని, అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయశక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, పార్కులను అన్ని రకాల మౌలిక వసతులతో, అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ గాంధీ తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాంకీ పెరల్ కాలనీ అసోషియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలి

**కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ**

పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాలాజీ నగర్‌లో డ్రైనేజ్ సమస్య పై అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కెపిహెచ్‌బీ డివిజన్లోని సీటీసీఐడి, ఎన్ఆర్ఎస్ఐ కాలనీలో ఓపెన్ జిమ్‌లను, వాటర్ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలాజీనగర్లో వెంటనే డ్రైనేజ్ సమస్య పునరుద్ధరించి రోడ్డు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని.. వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. ఎక్కడికక్కడ పార్కుల సుందరీకరించి ఓపెన్ జిమ్లను ఏర్పాటు చేశామని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, అధికారులు ఈఈ సత్యనారాయణ, డి ఈ ఆనంద్, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, ఏఈ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి
చేవెళ్ళ రంగారెడ్డి జిల్లా
I.A.NO. 68 OF 2023
IN
O.S.NO.108 OF 2008

మధ్యన :
శ్రీమతి అంజూరబాయి @ శాంతబాయి ...వాది
మరియు
శ్రీ కె.పెంటోజీరావు మరియు ఇతరులు ....ప్రతివాదులు

శ్రీయుత
జహ్రా సలాం బాయ్ మీన్ తండ్రి : సలాంబిన్ అహ్మెద్, వయస్సు :57 సం॥లు, వృత్తి : గృహిణి, నివాసము హౌస్‌నెం.3-5-781/1, కింగ్‌కోఠి, హైదరాబాద్. (ప్రతివాది నెంబర్ :10),
నూర్‌బాను భర్త: అహ్మెద్ బిన్ అబ్దుల్ల, వయస్సు : 50 సం॥లు, వృత్తి : గృహిణి, నివాసము : హౌస్ నెం.9-3-58/30, అహ్మెద్‌కాలనీ, మోటిదర్వాజా, గోల్కొండ, హైదరాబాద్. (ప్రతివాది నెంబర్ :11)
ఖాజా హమీద్ హుస్సైన్, తండ్రి : ఖాజా వహీద్ హుస్సైన్, వయస్సు :46 సం॥లు, వృత్తి : డాక్టర్, నివాసము : హౌస్‌నెం.2-3-190, నల్లకుంట, హైదరాబాద్, (ప్రతివాది నెంబర్ :12).
మహమ్మద్ ఫరాజ్ అలీ, తండ్రి : మహమ్మద్ ఫరీద్, వయస్సు : 30 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము : హౌస్‌నెం. 11-2-997/1/A, బజార్‌ఘాట్, హైదరా బాద్. (ప్రతివాది నెంబర్ : 14)
రవికుమార్ జైన్, తండ్రి : late పురంమల్ జైన్, వయస్సు:47 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము:హౌస్ నెం.14-6-286, చూడిబజార్, హైదరాబాద్ (ప్రతివాది నెంబర్: 15)
ఆరిఫ్ అలీ, తండ్రి : ఇనాయత్ అలీ, వయస్సు :64 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము : హౌస్ నెం. 9-11-150/A, మొలిమహేల్, గోల్కొండ ఫోర్ట్, హైదరాబాద్. (ప్రతివాది నెంబర్ :16)
మహమ్మద్ అబ్దుల్ వజీద్, తండ్రి : మహమ్మద్ అబ్దుల్ సలామ్, వయస్సు : 55 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము : హౌస్‌నెం.14-6-286, చూడిబజార్, హైదరాబాద్. (ప్రతివాది నెంబర్ :17)
మహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్, తండ్రి : అబ్దుల్ లతీఫ్‌ఖాన్, వయస్సు : 45 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము : హౌస్ నెం.9-11-36/35, కాజీ గల్లీ, గోల్కొండ ఫోర్ట్, హైదరాబాద్. (ప్రతివాది నెంబర్ :20)
మహమ్మద్ మెయిన్ ఖాన్, తండ్రి : మహమ్మద్ ఇక్బాల్ ఖాన్, వయస్సు : 42 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము హౌస్ నెం.16-9-582 E,ఓల్డ్ మలక్‌పేట్, మాన్‌జీద్ కాంప్లెక్స్, అంబర్‌పేట్, హైదరాబాద్. (ప్రతివాది నెంబర్: 22)

పైన తెలిపిన వాదులు గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి చేవెళ్ళ కోర్టులో ప్రతివాదులపైన Suit For Partition and Separate Possession దావా (O.S.No.108 OF 2008) సర్వే నెంబర్ 420/అ1, విస్తీర్ణం ఏకరములు 1-22 గుంటలు, సర్వే నెంబర్ 420/అ2, విస్తీర్ణం ఏకరములు 1-22 గుంటలు, సర్వే నెంబర్ 420/ఇ, విస్తీర్ణం ఏకరములు 1-22 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఏకరములు 4-26 గుంటలు, అప్పరెడ్డిగూడ గ్రామము, మొయినాబాద్ మండలము, రంగారెడ్డి జిల్లా గల భూమిపై దావా వేసియున్నారు. పై దావాలో ప్రతివాది నెంబర్ : 10,11,12,14,15,16,17,20,22, మిమ్మల్ని చేర్చినరు. గౌరవనీయ కోర్టు ఆర్డర్ ప్రకారం I.A.NO.68 OF 2023 IN OS NO. 108 OF 2008 తమరి హాజరుకై దావను 29-03-2023 నాటికి మార్చియున్నరు. కావున తమరు 29-03-2023 నాడు ఉదయం 10:30 గంటలకు గౌరవనీయ కోర్టు యందు స్వయముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాగలరు. లేనిచో కోర్టువారు ఏకపక్ష నిర్ణయము గైకొందురు.

//కోర్టు ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది//

ఇట్లు
శ్రీ పి.సంపూర్ణ ఆనంద్
అడ్వకేట్,
హౌస్ నెం.4-2-879/10/1,
నియర్ గౌతమి జూనియర్ కాలేజీ,
వికారాబాద్ మున్సిపాలిటీ & టౌన్
వికారాబాద్ జిల్లా
ఫోన్: 9440356499

## ఆరోగ్యంగా ఉండటానికి చిరు ధాన్యాలు దోహదం

**సర్పంచ్ సింగం ఆంజనేయులు**

**నవతెలంగాణ-శామీర్‌పేట**



ఆరోగ్యంగా ఉండటానికి చిరు ధాన్యాలు దోహదపడతాయని సర్పంచ్ సింగం ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరము పురస్కరించుకొని సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస ప్రభాకర్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ సింగం ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల అవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అంతేగాక చిరుధాన్యాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రజాప్రతినిధుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, వార్డు సభ్యులు బాలేష్, యువనాయకులు సాయి శ్రీనివాస్ చారి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్ రేణుక, అంగన్వాడి టీచర్లు ఎస్ శైలజ, కె వీరమణి, బి.మంజుల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు**

**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ**

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణవేణి కాలనీ, శ్రీరామ్ నగర్, సాయి ప్రశాంత్ నగర్ ఫేజ్ 1 , 2 కాలనీల్లో పలు సమస్యలపై చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది, జలమండలి అధికారులు, కాలనీ వాసులతో కలసి ఆయన సోమవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు, కాలనీ లోని డ్రైనేజ్ సమస్య మంచి నీటి సమస్యపై జలమండలి అధికారులు జీహెచ్ ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. హైదర్ నగర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్ వైజర్ నరేంద్ర, వాటర్ లైన్ మెన్ సత్యనారాయణ, జీహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ లైన్ మెన్ శ్రీనివాస్, స్ట్రీట్ లైట్ లైన్ మెన్ సుధాకర్, కాలనీవాసులు చందు నాయక్, రాజు సాగర్, గోపి, రాజు, దాస్, నాగబాబు, ప్రమోద్, గోవింద్, శ్రీనివాస్, సుమన్, వినోద్, రాజేందర్, మన్మథ, బాబులాల్, రేణుక, లక్ష్మి ఏలెంద్ర తదితరులు పాల్గొన్నారు.





కుషాయిగూడ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 30వ తేదీన నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని మాజీ మేయర్ రామ్మోహన్‌కి, కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్‌కి ఆహ్వాన పత్రికను ఆలయ ప్రధాన అర్చకులు వేణు అందించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- నవతెలంగాణ,కాప్రా

# మోడీ పాలనతో రగులుతున్న జనం

- ఉద్యమ బాటపడుతున్న ప్రజలు
- జన చైతన్య యాత్రలో.. : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జుకృష్ణన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య

**నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలను కాపాడుతూ ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతోందని, తొమ్మిదేండ్ల మోడీ పాలనలో ప్రజలు రగిలిపోతూ ఉద్యమబాట పడుతున్నారని, వారిని చైతన్యవంతం చేయడానికి జనచైతన్య యాత్ర చేపట్టినట్టు సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జు కృష్ణన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు. సిద్దిపేట పట్టణంలోని శివం గార్డెన్స్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన జనచైతన్య యాత్ర బహిరంగ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజ్జు కష్ణన్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే రూ.15 లక్షలు ఇస్తామన్న బీజేపీ ఎందుకు ప్రజలకు డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా 1,12,000 మంది రైతులు సంక్షోభంతో ఆత్మహత్యలు చేసుకున్నారని, 2,50,000 మంది దినసరి కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వమే తమ రిపోర్టుల్లో వెల్లడించిందన్నారు. మహారాష్ట్రలో పోషకాహార లోపంతో 9 వేల మంది చిన్నారులు మరణించారని తెలిపారు.



గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో దేశం 107వ స్థానానికి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఏవని, అగ్నిపథ్ ద్వారా ఎంపికైన అగ్ని వీరులు తమ కాంట్రాక్ట్ ముగిసిన తర్వాత బీజేపీ ఆఫీసుల్లో చౌకీదారుగా పని చేయాలని, పకోడీ అమ్ముకోవాలని అనడం బాధాకరమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న ప్రజల హక్కును కూడా ప్రయివేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 5న కార్మిక, కర్షకులతో ఢిల్లీలో ర్యాలీ ఉంటుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం వీరయ్య మాట్లాడుతూ.. మతాన్ని పావుగా వాడుకొని బీజేపీ, ఆర్ఎస్ఎస్ లబ్ది పొందుతున్నాయన్నారు. గతంలో గ్యాస్ ధర రూ.450 ఉంటే ఇప్పుడు రూ.1,155 చేశారని, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, పర్యవసానంగా నిత్యవసర ధరలు పెరిగాయని తెలిపారు. ఉపాధి హామీలో పని దినాలు తగ్గించారన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. బండి సంజయ్ తన సీటును, రాష్ట్ర అధ్యక్ష పదవిని కాపాడుకోవడం కోసమే పార్లమెంటులో కరీంనగర్, తెలంగాణ సమస్యల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నూతన విద్యా విధానంలో పీజీ, డిగ్రీ చేసేవారు మూడు నెలలు తమ కులవృత్తిని చేయాలని చెప్పడం ఎంతవరకు న్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ రిమోట్‌తో బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. యాత్ర సభ్యులు ఆశయ్య మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం గురించి చేపట్టిన తమ జనచైతన్య యాత్ర 29న హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. దీనికి పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్ హాజరవుతారని, సిద్దిపేట నుంచి కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని తెలిపారు. పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. జన చైతన్య యాత్ర బహిరంగ సభకు సీపీఐ, న్యూ డెమోక్రసీ, ఆర్ఎస్పీ నాయకులు సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో జన చైతన్య యాత్ర బృంద సభ్యులు స్కైలాబ్ బాబు, జయలక్ష్మి, బాలకృష్ణ, జగదీష్, అడివయ్య, జన చైతన్య యాత్ర రూట్ ఇన్‌చార్జి వెంకట్, నాయకులు వెంకటేష్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, జిల్లా నాయకులు దాసరి కళావతి, కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, ఎల్లయ్య, భాస్కర్, సత్తిరెడ్డి, వెంకట్ మావో, కిష్టారెడ్డి, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ సర్కార్‌పై ఐక్య పోరాటం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు ఎస్. వీరయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం జనచైతన్య యాత్ర జనగామ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నెహ్రూ పార్క్ వద్ద యాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి ర్యాలీ పట్టణంలోని గ్రౌండ్‌కు చేరుకుంది. పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోకు కనకారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య మాట్లాడారు. బీజేపీ మతోన్మాద రాజకీయం చేస్తుందని, బీజేపీ మత రాజకీయాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు ప్రజలకు చైతన్యవంతం చేయాలన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం శాంతియుతంగా పోరాటం చేసిన గాంధీజీని చంపిన గాడ్సేను బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ దేవుడని ప్రకటించినా ఆమెపై ఇప్పటికీ ఎలాంటి కేసు నమోదు చేయలేదన్నారు. ఈ ఎంపీ ఉగ్రవాద చర్యలకు పాల్పడినట్టు గతంలో కేసు నమోదై ఉన్నా, ఆమెకు ఎంపీ టికెట్ ఇచ్చి పార్లమెంట్‌కు పంపిందన్నారు. దేశంలో 23 వేల కోట్ల మంది పేదరికంలో మగ్గిపోతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి పేదల జీవితాలను దుర్భరం చేశారని తెలిపారు. రాష్ట్రంలో 50 కేంద్రాల్లో పెద్ద ఎత్తున భూ పోరాటాలు జరుగుతున్నాయన్నారు. కోటి మంది కార్మికులు కనీస



వేతనాలు అమలు చేయాలని పోరాటాలు చేశారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు న్యాయమైన తమ డిమాండ్ల కోసం సమ్మె చేశారని, వేలాది మంది విద్యుత్ కార్మికులు విద్యుత్ సౌధాను ముట్టడించారని తెలిపారు. పేదల కోసం పోరాటం చేసేది ఒక ఎర్రజెండా మాత్రమేనన్నారు. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలో ఇండ్లు లేని పేదలు ఎవరూ ఉండరని హామీ ఇచ్చిన మోడీ ఓట్లు దండుకుని ప్రధాని అయ్యాక హామీని తుంగలో తొక్కారన్నారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామం, సామాజిక న్యాయం కోసం సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రను నిర్వహిస్తున్నదని తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్ మాట్లాడుతూ.. దేశానికి బీజేపీ వంటి ప్రమాదకరమైన పురుగు పట్టిందని, ఆ పురుగు వెంటనే నివారించకపోతే దేశం నాశనం అవుతుందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. అదానీ కుంభకోణాలు ప్రశ్నించినందుకే ఆయన ఎంపీ పదవిని రద్దు చేశారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ రాష్ట్రానికి ఉత్తరప్రదేశ్ లాంటి పాలన అందిస్తామని చెబుతున్నారని, యూపీలో యువతపై లైంగికదాడి జరిగిందని ఫిర్యాదు చేస్తే ఆమె తండ్రిని అరెస్ట్ చేశారని, బాధితురాలు తరుపున పోరాటం చేసిన నాయకులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఇది యూపీ కాదు తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన గడ్డ అని, ఇలాంటి చర్యలకు పాల్పడితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. యాత్రలో బృంద సభ్యులు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మీ, టి. స్కైలాబ్‌బాబు, ఆశయ్య, లెల్లల బాలకృష్ణ, జగదీష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్రాజం, సాంబరాజు, అహల్య, రాపర్తి రాజు, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బొట్ల శేఖర్, బొట్ల శ్రీనివాస్, బూడిద గోపి, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎంపీల్లో సగం మంది దొంగలే...



(మొదటిపేజీ తరువాయి)

నడవగా ఎర్రసైన్యం కవాతు, బైకు ర్యాలీతో ఘన స్వాగతం పలుకగా.. యాత్ర ముందుకు సాగింది. జానపద కళాకారులతో వేసిన బొడ్డెమ్మ ఆట నృ త్యాలు అలరింపజేశాయి. కోయిల్‌సాగర్ కోటకొండ మీదగా దామరగిద్ద నుంచి నారాయణపేట మరికల్, అమరచింత, ఆత్మకూరు, మీదగా యాత్ర గద్వాల చేరుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా ఎర్రసైనికులు కోటకొండకు వరకు వచ్చి నారాయణపేట జిల్లాకు సాగనంపారు. కోటకొండ తదితర ప్రాంతాల్లో భగత్ సింగ్, అంబేద్కర్ విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జాన్‌వెస్లీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అవినీతికి పాల్పడ్డారంటూ ప్రతిపక్షాల ప్రజాప్రతినిదులను సీబీఐ విచారణ పేరుతో బీజేపీ ప్రభుత్వం వేధిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఎంపీలుగా ఉన్న బీజేపీ నేతలలో సగం మంది దొంగలే ఉన్నారని ఆరోపించారు. బీజేపీ హయాంలో పేద ధనికుల మధ్య తేడా పెరిగి.. ధనికులు కోటీశ్వరులుగా మారుతున్నారని.. పేదలు నిరుపేదలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుల మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు బీజేపీ ఎత్తుగడలు వేస్తుందని విమర్శించారు. బ్యాంకులను లూటీ చేసి కోట్ల రూపాయలను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టిన మోడీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపడమే సీపీఐ(ఎం) ఏకైక లక్ష్యమన్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా.. 20 లక్షల ఉద్యోగాలను తొలగించారని తెలిపారు. కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ రాష్ట్రానికి ఒక్క పక్కా ఇల్లు కూడా మంజూరు కాలేదన్నారు.

మోడీని ప్రశ్నించినందుకే.. ప్రతిపక్ష నేత.. పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేశారంటే.. బీజేపీ పరిపాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రాష్ట్ర విభజన నిబంధనల మేరకు పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కడానికి.. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చే యోచనలో బీజేపీ పాలకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఒకవైపు రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు చేస్తుంటే.. మరోవైపు రాజ్యాంగ ఫలాలు ప్రజలకు దక్కకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు చేయడం దారుణమన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ గెలిస్తే ఉద్యోగాలు వస్తాయన్న మాటలు నీటి మూటలుగానే మిగిలాయన్నారు. ప్రజా సంపద రెట్టింపు చేస్తామన్నారు. వారి సంపద ఏమోగానీ పేదలు నిరుపేదలుగా మారుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు 8 వేల కోట్లకు పైబడి ఆస్తులు ఉన్నవారు 80 మంది ఉంటే.. ఇప్పుడు వారి సంఖ్య 166కు చేరిందంటే ఈ ప్రభుత్వం ఎవరి పక్షమో ప్రజలు గ్రహించాలన్నారు. కారు చౌకగా దొరికే బొగ్గును అదానికి అప్పజెప్పి.. ఆయన నుంచి ఖరీదైన ధరకు కొనుగోలు చేస్తున్నారంటే మోడీకి పారిశ్రామికవేత్తల మీద ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కూలీలు కోరుతుంటే.. మరోవైపు బడ్జెట్లో నిధులు పూర్తిగా తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు, రమ, నాయకులు అరుణ, శ్రీకాంత్, వినోద్, విజయ్, ధర్మానాయక్, ప్రసాద్, వెంకట్రాంరెడ్డి, గోపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నవచిత్రం

# విజువల్ వండర్




డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కిస్తున్న విజువల్ వండర్ 'పొన్నియిన్ సెల్వన్ 2'. లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ బ్యానర్స్‌పై సుభాస్కరన్, మణిరత్నం భారీ బడ్జెట్‌తో ఈ పాన్ ఇండియా మూవీని నిర్మిస్తున్నారు.

గత ఏడాది సెన్సేషనల్ హిట్ అయిన హిస్టారికల్ మూవీ 'పొన్నియిన్ సెల్వన్ 1'కి కొనసాగింపుగా 'పొన్నియిన్ సెల్వన్ 2' రూపొందింది. రెండో భాగంపై హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. ఏప్రిల్ 28న వరల్డ్ వైడ్‌గా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

ప్రేమ, పగ, ప్రతీకారం, రాజకీయం, రాజ్యాధికారం, వీరత్వం..వంటి అంశాల చుట్టూ తిరిగే ఈ మూవీ ట్రైలర్, ఆడియో లాంచ్ చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈనెల 29న ఘనంగా నిర్వహించనున్నారు.

### రామ్‌చరణ్ బర్త్‌డే కానుకగా
# మెగా పవర్ ఫస్ట్‌లుక్

నిర్మాత అల్లు అరవింద్ ఆశీస్సులతో సత్య ఆర్ట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం. 1గా ఇటీవల ప్రారంభమైన చిత్రం 'మెగా పవర్'. శ్రీ కల్యాణ్, శశి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి గేదెల రవిచంద్ర దర్శకుడు. అడబాల నాగబాబు, సాయి నిర్మల, ఇల్లా అభిషేక్, సత్యమూర్తి గేదెల నిర్మాతలు. అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని దర్శకులు మెహర్ రమేష్, కె.ఎస్.రవీంద్ర (బాబీ) ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా చిరంజీవితో ఉన్న మా చిత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేశాం. మేం అడగ్గానే బిజీ షెడ్యూల్‌లో ఉన్నా మెహర్ రమేష్, బాబీ మా ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేసినందుకు కృతజ్ఞతలు. చరణ్ పుట్టిన రోజున మా సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే మెగా ఫ్యామిలీ హీరోల సపోర్ట్‌తో ముందుకెళ్తున్నాం. ప్రస్తుతం మా చిత్రం మొదటి షెడ్యూల్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మదర్ సెంటిమెంట్‌తో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. మెగా హీరోల అభిమానులు అందరి సపోర్ట్ మాకు ఉంటుందని ఆశిస్తున్నాం' అని చెప్పారు.


మెహర్ రమేష్, బాబీ, శ్రీకళ్యాణ్, శశి

పృథ్వీ, రఘుబాబు, మురళీశర్మ, రచ్చ రవి, రియాజ్, రెహమాన్, శ్రీకాంత్ అయ్యంగర్, సురేష్, సంగీత, ప్రభావతి వర్మ, కౌశల్య కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి డిఓపి: శ్రీకాంత్ గేదెల, కొరియోగ్రాఫర్‌ఫ శిరీష్ గేదెల, ఆర్ట్: విఠల్ కోసనం, సంగీతం: మ్యాడీ, ఎడిటర్: మార్తండ్ కె. వెంకటేశ్, స్టంట్ మాస్టర్: టి. రవిరాజుమాటలు: రావణ్ తోట, కథ - స్క్రీన్‌ప్లే - దర్శకత్వం: రవిచంద్ర గేదెల.

# మలయాళ నటుడు, నిర్మాత ఇన్నోసెంట్ ఇకలేరు


ఇన్నోసెంట్

ప్రముఖ మలయాళ హాస్యనటుడు ఇన్నోసెంట్ కన్నుమూశారు. కోవిడ్ సంబంధిత సమస్యతో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడటంతో సోమవారం తుది శ్వాస విడిచారు. నటుడు, నిర్మాత, రచయిత, సింగర్‌గా ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభతో బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన తనకంటూ ఓ ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకున్నారు. మలయాళం, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఆయన దాదాపు 750 సినిమాల్లో తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించారు. అలాగే పలు చిత్రాలను నిర్మించి అభిరుచిగల నిర్మాతగానూ, పలు పుస్తకాల రచనతో రచయితగానూ మంచి పేరొందారు. 2014 ఎన్నికల్లో ఎంపీగా గెలుపొంది, ప్రజా నాయకుడిగానూ సేవలను అందించారు. ఇన్నోసెంట్ మృతిపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ 'సినిమా చరిత్రలో ఒక ఐకానిక్ అధ్యాయానికి ముగింపు. రెస్ట్ ఇన్ పీస్ లెజెండ్' అంటూ సోషల్‌మీడియాలో తమ సంతాపం వ్యక్తం చేశారు.

## ఆటలు

# చాంపియన్ శ్రీజ

తెలంగాణ యువ కెరటం ఆకుల శ్రీజ రికార్డు సృష్టించింది. వరుసగా రెండో సారి టేబుల్ టెన్నిస్ జాతీయ చాంపియన్‌గా నిలిచింది. 84వ జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో నాలుగు విభాగాల్లో పోటీపడిన ఆకుల శ్రీజ ఏకంగా మూడు స్వర్ణాలు, ఓ కాంస్య పతకంతో సత్తా చాటింది. మెన్స్ విభాగంలో జి. సతియన్ నేషనల్ టైటిల్ అందుకున్నాడు.

- వరుసగా రెండో ఏడాది నేషనల్ టైటిల్
- జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్

**నవతెలంగాణ-జమ్ము**

జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్. తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ ఆర్‌బీఐ తరవున బరిలో నిలిచింది. జట్టు విభాగంలో సెమీఫైనల్లో తొలి మ్యాచ్‌లోనే ఓడిన శ్రీజ.. ఫైనల్లోనూ కీలక మ్యాచ్‌లో తడబడింది. దీంతో వ్యక్తిగత విభాగంలో శ్రీజ ప్రదర్శన ప్రశ్నార్థకమైంది. అంచనాలను తలకిందులు చేసిన 24 ఏండ్ల ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్ పసిడి పతకంతో పాటు మహిళల డబుల్స్ గోల్డ్, జట్టు విభాగం స్వర్ణం సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఓవరాల్‌గా నాలుగు విభాగాల్లో బరిలో నిలిచిన శ్రీజ.. మూడు స్వర్ణాలు, ఓ కాంస్యంతో నాలుగు పతకాలు కొల్లగొట్టి సరికొత్త చరిత్ర లిఖించింది. పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచిన జి. సతియన్‌తో సమానంగా రూ.2.75 లక్షల నగదు బహుమానం ఆకుల శ్రీజ సొంతం చేసుకుంది.

**శ్రీజ సూపర్**

మహిళల సింగిల్స్‌లో ఆకుల శ్రీజ టైటిల్‌ను నిలబెట్టుకుంది. మౌమ దాస్ (2005, 06) తర్వాత జాతీయ చాంపియన్‌షిప్స్‌లో వరుసగా రెండు సార్లు టైటిల్ నెగ్గిన ఏకైక ప్యాడ్లర్‌గా శ్రీజ నిలిచింది. పసిడి పోరులో 9-11, 14-12, 11-7, 13-11, 6-11, 12-10తో సీనియర్ క్రీడాకారిణి సుతీర్థ ముఖర్జీపై ఆకుల శ్రీజ అద్భుత విజయం నమోదు చేసింది. ఫైనల్లో సుతీర్థ ముఖర్జీ తొలి సెట్‌ను గెల్చుకుని శ్రీజపై ఒత్తిడి పెంచింది. కానీ వరుసగా మూడు సెట్లు నెగ్గిన ఆకుల శ్రీజ పసిడి దిశగా తిరుగులేని ఆధిక్యం సొంతం చేసుకుంది. ఐదో సెట్లో సుతీర్థ పైచేయి సాధించి పసిడి ఆశలు నిలుపుకున్నా.. ఆరో సెట్‌ను గెల్చుకున్న ఆకుల శ్రీజ 4-2తో ఘన విజయం సాధించింది. ' మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రణాళిక ప్రకారం ఆడాను. టైటిల్ నెగ్గటం సంతోషంగా ఉంది. జట్టు విభాగంలో ఓటములు విలువైన అనుభవాన్ని అందించాయి' అని ఆకుల శ్రీజ తెలిపింది.



ఇక పురుషుల సింగిల్స్‌లో జి. సతియన్ (పిఎస్‌పిబి) చాంపియన్‌గా నిలిచాడు. టైటిల్ పోరులో హర్మీత్ దేశాయ్ (పిఎస్‌పిబి)పై 11-9, 11-7, 11-8, 11-5తో వరుస సెట్లలో ఏకపక్ష విజయం సాధించాడు. మహిళల డబుల్స్‌లో ఆకుల శ్రీజ, దియ చితల (ఆర్‌బిఐ) 11-7, 11-7, 8-11, 14-12తో స్వస్తిక ఘోష్, అమృత (మహారాష్ట్ర)లను ఓడించి పసిడి పతకం అందుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో మానవ్, అర్చన జోడీ 11-5, 14-12, 11-3తో పశ్చిమ బెంగాల్ జంటపై గెలుపొందింది.

# సింధు మెరిసేనా?

- బరిలో సైనా, శ్రీకాంత్ సైతం
- నేటి నుంచి స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ



మాడ్రిడ్ (స్పెయిన్) : గత కొంత కాలంగా భారత బ్యాడ్మింటన్‌లో పతకాల జోరు తగ్గింది. సైనా నెహ్వాల్ పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తుండగా, పి.వి సింధు గాయం అనంతరం ఫామ్ సాధించలేదు. కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ సహా హెచ్.ఎస్ ప్రణయ్ అంచనాలను అందుకోవటం లేదు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ నిలకడగా రాణిస్తుండగా, ఇటీవల ఆల్ ఇంగ్లాండ్‌లో గాయత్రి, జాలీ జంట సెమీస్‌కు చేరుకుని ఆకట్టుకుంది. ఒలింపిక్ అర్హత ప్రక్రియ, పారిస్ ఒలింపిక్స్ ముంగిట భారత షట్లర్లు ఫామ్‌లోకి రావాల్సి ఉంది. మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ వేదికగా పి.వి సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ టైటిల్‌పై గురి పెట్టారు. నేటి నుంచి ఆరంభం కానున్న సూపర్ 300 టోర్నీలో డబుల్స్‌లో భారత్ పతకాలు ఆశిస్తోంది. వరల్డ్ నం.9, రెండో సీడ్ సింధుకు తొలి రౌండ్లో బై లభించింది. ప్రీ క్వార్టర్స్ వరకు సింధుకు సవాల్ ఎదురుకాదు!. సైనా నెహ్వాల్ తొలి మ్యాచ్‌లోనే మూడో సీడ్ బుసానన్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది. మాళవిక బాన్సోద్, ఆకర్షి కశ్యప్‌లు సైతం ఉమెన్స్ సింగిల్స్ బరిలో ఉన్నారు. మెన్స్ సింగిల్స్‌లో ఐదో సీడ్ శ్రీకాంత్ తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్ షట్లర్ తమసిన్‌తో తలపడనుండగా, బి. సాయిప్రణీత్‌కు నెదర్లాండ్స్ షట్లర్ ఎదురు కానున్నాడు. మిథున్ మంజునాథ్, సమీర్ వర్మలు సైతం ఆడనున్నారు. లక్ష్యసేన్, ప్రణయ్‌లు టోర్నీకి దూరంగా ఉన్నారు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీలకు తొలి రౌండ్లో జపాన్ షట్లర్లు సవాల్ విసరనుండగా, మహిళల డబుల్స్‌లో ఆరో సీడ్ గాయత్రి, ట్రెసా జంట సైతం జపాన్ జోడీతో ఢీతోనే టైటిల్ వేట మొదలెట్టనుంది.

# రన్నరప్ హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ



ముంబయి : రామ్‌దాస్ ఆల్ ఇండియా ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ రన్నరప్‌గా నిలిచింది. టైటిల్ పోరులో హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ, కెఎస్‌ఏ ముంబయి 90 నిమిషాల ఆటలో గోల్ చేయటంలో విఫలమయ్యాయి. అదనపు సమయంలోనూ ఫలితం తేలలేదు. దీంతో పెనాల్టీ షటౌట్ ద్వారా విజేతను తేల్చారు. టైబ్రేకర్‌లో హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ 4-5తో టైటిల్‌ను చేజార్చుకుంది. అబ్దుల్ ఖాదర్ (ఉత్తమ ఫార్వర్డ్), వికాస్ యాదవ్ (ఉత్తమ మిడ్ ఫీల్డర్)గా నిలువగా.. రన్నరప్‌గా హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ రూ.50000 నగదు బహుమతి అందుకుంది.

# త్వరలోనే ఒలింపిక్స్ బిడ్!

క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్



న్యూఢిల్లీ : భారత్ అతి త్వరలోనే ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వగల స్థాయిలో మౌళిక సదుపాయాలు కలిగి ఉండటం, ఒలింపిక్ బిడ్‌ను విజయవంతంగా దక్కించుకునే స్థితిలో ఉంటుందని కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. 'ఖేలో ఇండియా క్రీడల ద్వారా మూడు స్థాయిల్లో శిక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయగలిగాం. గత 18 నెలలుగా అన్ని క్రీడాంశాల్లో మహిళలకు ఖేలో ఇండియా లీగ్స్ నిర్వహించాం. మహిళలకు మరింత ప్రోత్సాహం ఇచ్చేందుకు 10కా దమ్ కార్యక్రమం 50 నగరాల్లో నిర్వహించాం. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్ విజయవంతమైంది. రానున్న కాలంలో మరిన్ని క్రీడాంశాల్లో మహిళల లీగ్‌లకు ఏర్పాటుకు డబ్ల్యూపీఎల్ మార్గం చూపింది. క్రీడలు రాష్ట్ర జాబితా. క్రీడాభివృద్దిలో రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాలని' అనురాగ్ ఠాకూర్ అన్నారు. 'ది హిందూ' జాతీయ క్రీడా సదస్సులో పాల్గొన్న ఠాకూర్ క్రీడల్లో మహిళలకు పెద్ద పీట వేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తపరిచారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# నవచిత్రం




## దసరా కానుకగా రిలీజ్

**బో**యపాటి శ్రీను, రామ్ పోతినేని కాంబోలో రూపొందుతున్న క్రేజీ సినిమా (బోయపాటిరాపో) శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఎక్కువగా ఉండబోతున్నాయి. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి అత్యంత భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

సోమవారం ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేశారు.దసరా కానుకగా అక్టోబర్ 20న వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. మాస్‌తో పాటు ఫ్యామిలీస్‌ని మెప్పించే సినిమాకి ఇది సరైన తేదీ. దసరా సెలవులు సినిమాకి కలిసివస్తాయనే భావనతో చిత్ర బృందం ఉంది.

అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో రామ్ తన చేతితో గంగిరెద్దు(ఎద్దు)ని లాగుతూ పోస్టర్‌లో రగ్డ్, మాస్‌గా కనిపిస్తున్నారు. డెనిమ్స్ షర్టు, జీన్స్‌లో క్లాస్‌గా, ఫ్యాషనబుల్‌గా కనిపిస్తున్నప్పటికీ, అతని ముఖంలో వైల్డ్ నెస్ కనిపిస్తుంది. రామ్‌ని బోయపాటి శ్రీను మాస్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారని ఈ పోస్టర్ చెప్పకనే చెప్పింది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో రామ్‌కు జోడిగా శ్రీలీల నటిస్తోంది. ఇందులో ప్రముఖ పాత్రలలో పలువురు నోటెట్ నటీనటులు కూడా నటిస్తున్నారు. ఈ సినిమా హిందీతోపాటు అన్ని సౌత్ ఇండియన్ భాషలలో విడుదల అవుతుంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, బ్యానర్: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్, సంగీతం: ఎస్ తమన్, డీవోపీ: సంతోష్ డిటాకే, ఎడిటింగ్: తమ్మిరాజు.

## గేమ్ ఛేంజర్‌గా రామ్‌చరణ్

**రా**మ్ చరణ్, శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం ఆర్‌సి15కి 'గేమ్ ఛేంజర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎన్నో సూపర్ డూపర్ బ్లాక్ బస్టర్ చిత్రాలను రూపొందించిన శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్ ఈ మూవీని నిర్మిస్తోంది. నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ అన్ కాంప్రమైజ్డ్‌గా అంచనాలకు దీటుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సోమవారం రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్ రివీల్ వీడియోను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. రామ్‌చరణ్ పాన్ ఇండియా ఇమేజ్‌కి తగ్గ టైటిల్‌ను డైరెక్టర్ శంకర్ ఖరారు చేశారని, టైటిల్ రివీల్ వీడియో చూస్తే హీరో క్యారెక్టరైజేషన్ లార్జర్ దేన్ లైఫ్‌గా ట్రాన్స్‌ఫర్‌మేటీవ్‌గా ఉందని తెలుస్తోంది. అలాగే ఈ సినిమాలోని రామ్ చరణ్ ఫస్ట్‌లుక్‌ను కూడా మేకర్స్ రిలీజ్ చేసి రామ్‌చరణ్ బర్త్‌డే కానుకగా ఆయన అభిమానులకు డబుల్ ధమాకా ఇచ్చారు. అయితే ఈ సినిమా విడుదల తేదీ ఎప్పుడనేది మాత్రం ప్రకటించలేదు. రామ్ చరణ్ సరసన కియారా అద్వానీ నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర తదితరులు ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి స్టోరీ లైన్: కార్తీక్ సుబ్బరాజ్, కో ప్రొడ్యూసర్: హర్షిత్, కెమెరా :ఎస్.తిరుణావుక్కరసు, మ్యూజిక్: తమన్, డైలాగ్స్: సాయిమాధవ్ బుర్రా, ఆర్ట్ డైరెక్టర్: అవినాష్ కొల్ల, ఎడిటర్: షామీర్ ముహ్మద్.




## గుండెలకు హత్తుకునే మాస్


నాని, కీర్తి సురేష్, దీక్షిత్ శెట్టి

**నా**ని నటించిన తొలి పాన్ ఇండియా ఎంటర్ టైనర్ 'దసరా'. శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. కీర్తి సురేష్ కథా నాయికగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో అనంత పురంలో 'దసరా' దూమ్ ధామ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, 'ఇన్ని రోజులు మిమ్మల్ని మెప్పించే మాస్ చూసి ఉంటారు. 'దసరా'తో మీ గుండెల్ని హత్తుకునే మాస్ చూపిస్తాను. ఇది నా ప్రామిస్. కళ్ళల్లో చిన్న గ్లిట్టర్‌తో విజిల్స్ వేసే ఆనందం 'దసరా'తో ఎక్స్ పీరియన్స్ చేస్తారు. 'దసరా' నా మనసుకు చాలా దగ్గరైనా సినిమా. ఏడాది కాలం పాటు దుమ్ము, ధూళి.. చాలా కష్టాలు పడి టీం అంతా హార్డ్ వర్క్ చేశాం. ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్‌ని నిర్మించిన నిర్మాతలు సుధాకర్, శ్రీకాంత్‌కి కృతజ్ఞతలు' అని అన్నారు.

దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ, "దసరా' లాంటి వండర్‌ఫుల్ ప్రాజెక్ట్‌లో నన్ను రిఫర్ చేసిన కో డైరెక్టర్ వినయ్‌కి, దీప్తి మేడమ్‌కి కృతజ్ఞతలు. దర్శకుడు శ్రీకాంత్ నన్ను ఎంతో కంఫర్ట్‌బుల్‌గా చూసుకున్నారు. ఆయన దేశంలోనే టాప్ దర్శకుడిగా ఎదుగుతారు. నానికి ఎప్పుడూ రుణ పడి ఉంటాను. ఇందులో సూరి అనే పాత్ర చేశాను. ఈ పాత్ర నేను బాగా చేశానని మీకు అనిపిస్తే దానికి కారణం కీర్తిసురేషే' అని చెప్పారు.

### వెన్నెలగా గుర్తుండిపోతా..

నేను నాని, 'నేను లోకల్' సినిమా చేశాం. కానీ 'దసరా'నే నాకు లోకల్ అనిపిస్తుంది. ఈ సినిమా తర్వాత మీ అందరికీ వెన్నెలగా గుర్తుంటాను. దర్శకుడు శ్రీకాంత్ చాలా కష్టపడి ఈ కథని రాశారు. ఈ కథని ఇంతపెద్ద కాన్వాస్‌పై రూపొందించే అవకాశం ఒక కొత్త దర్శకుడికి ఇచ్చిన మా నిర్మాతలకు కృతజ్ఞతలు. ఇది అన్ని ఎలిమెంట్స్ ఉన్న ఫుల్ ప్యాకేజీ. ఈ నెల 30న ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. ఎట్లయితే గట్లయితది చూసుకుందాం.

- కీర్తి సురేష్




## సమ్మర్ స్పెషల్‌గా బాలీవుడ్ ఛత్రపతి

**ప్ర**భాస్, రాజమౌళి కలయికలో రూపొందిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఛత్రపతి'. హిందీలో ఈచిత్ర రీమేక్‌తో హీరో శ్రీనివాస్ బెల్లంకొండను బాలీవుడ్‌లో లాంచ్ అవుతున్నారు. వివి వినాయక్ దర్శకత్వంలో ఈచిత్రాన్ని ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ పెన్ స్టూడియోస్ నిర్మిస్తోంది.

ఒరిజినల్‌కి కథను అందించిన రాజమౌళి తండ్రి కెవి విజయేంద్ర ప్రసాద్ రీమేక్ వెర్షన్‌కి కూడా రచయిత. ఇప్పటికే షూటింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. సోమవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసిన మేకర్స్, రిలీజ్ డేట్‌ని కూడా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'ఛత్రపతి' అని తెలుగు టైటిల్‌నే పెట్టడం విశేషం. సమ్మర్ స్పెషల్‌గా మే 12న ఈసినిమా థియేటర్లలోకి రానుంది. ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్ శ్రీనివాస్‌ని షర్ట్ లేకుండా బీస్ట్ మోడ్‌లో ప్రజంట్ చేసింది. కండలు తిరిగిన దేహంతో ఒక చేతిలో రాగి చెంబుతో నీటిలో నిలబడి, వీపుపై గాయాలతో కనిపించారు. పోస్టర్‌లో భీకరమైన మేఘాలు శ్రీనివాస్ పాత్ర అగ్రెసివ్‌ని సూచిస్తున్నాయి.

ఆయన్ని యాక్షన్ ప్యాక్డ్ పాత్రలో దర్శకుడు వి.వి.వినాయక్ ప్రెజెంట్ చేశారు. శీనివాస్ ఇప్పటికే డిజిటల్ వరల్డ్ వైడ్ బిగ్గెస్ట్ స్టార్‌లలో ఒకరు. ఆయన నటించిన 'ఖూంఖార్' (జయ జానకి నాయక హిందీ డబ్బింగ్) 700 మిలియన్ల వ్యూస్‌ని అధిగమించి రికార్డ్ క్రియేట్ చేసింది. డాక్టర్ జయంతిలాల్ గడా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండగా, పెన్ మరుధర్ సినీ ఎంటర్‌టైన్‌మెంట్ ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

## మిస్టర్ బ్రహ్మా ఏంటి ఈ డ్రామా?


రియా సచ్‌దేవ, మేఘాంశ్ శ్రీహరి

**మే**ఘాంశ్ శ్రీహరి, రియా సచ్‌దేవ ప్రధాన పాత్రలలో నూతన దర్శకుడు జి. భవానీ శంకర్ దర్శకత్వంలో ఎ2 పిక్చర్స్ బ్యానర్ పై సంధ్యా రాణి, స్వరూప రాణి నిర్మిస్తున్న చిత్రం 'మిస్టర్ బ్రహ్మ ఏంటి ఈ డ్రామా?'.

సోమవారం ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. హీరో, హీరోయిన్లపై హీరో మంచు మనోజ్ క్లాం కొట్టగా, చోటా కె నాయుడు కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బాబీ కొల్లి గౌరవ దర్శకత్వం వహించారు.

అనంతరం మంచు మనోజ్, బాబీ కొల్లి, చోటా కె నాయుడు టైటిల్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చిత్ర యూనిట్‌కు శుభాశీస్సులు అందించారు. ఈ సందర్భంగా హీరో మేఘాంశ్ శ్రీహరి మాట్లాడుతూ, 'దర్శకుడిని నమ్మి ఈ సినిమాకి అంగీకరించాను. మా నిర్మాత చాలా గొప్ప సపోర్ట్ ఇచ్చారు. గోపిసుందర్, రామ్ ప్రసాద్ లాంటి బెస్ట్ టెక్నిషియన్స్ ఈ చిత్రానికి పని చేయడం ఆనందంగా ఉంది. మమ్మల్ని నమ్మి ఇంత భారీగా సినిమాని నిర్మిస్తున్న నిర్మాతకు కృతజ్ఞతలు' అని తెలిపారు. 'ఈ కథని ఎక్కడా రాజీపడకుండా గొప్పగా నిర్మిస్తున్న నిర్మాతలకు కృతజ్ఞతలు. మంచి టెక్నిషియన్స్ ఇచ్చారు. వారి నమ్మకం వల్లే ఇది సాధ్యపడింది. ఎ2 పిక్చర్స్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను. గోపి సుందర్ ఇచ్చిన పాటలన్నీ బ్లాక్ బస్టర్ అవుతాయి. ఇందులో బ్రహ్మ పాత్ర సౌత్ ఇండస్ట్రీలో ఒక టాప్ హీరో చేయబోతున్నారు. అది త్వరలోనే అనౌన్స్ చేస్తాం. ఇది సోషియో ఫాంటసీ, మైథాలజీ, లవ్ ఫుల్ ఎంటర్‌టైనర్' అని దర్శకుడు భవానీ శంకర్ చెప్పారు.

సంగీత దర్శకుడు గోపి సుందర్ మాట్లాడుతూ, 'దర్శకుడు భవానీ చెప్పిన కథ చాలా నచ్చింది. ఇందులో ఆరు పాటలు ఉంటాయి. ఇది ఫుల్ ప్యాకేజ్. సబ్జెక్ట్ చాలా కొత్తగా ఉంటుంది' అని అన్నారు. 'ఈ ప్రాజెక్ట్‌లో చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. మంచి కథతో మీ ముందుకు వస్తున్నాం' అని నాయిక రియా సచ్‌దేవ తెలిపారు.

నిర్మాత మాట్లాడుతూ,'ఎ2 పిక్చర్స్ ద్వారా మేము నిర్మిస్తున్న మొదటి చిత్రం 'మిస్టర్ బ్రహ్మ ఏంటి ఈ డ్రామా?'. దర్శకుడు భవానీ శంకర్ చెప్పిన కథ చాలా బావుంది. కథపై నమ్మకంతో ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నాం. ఈ చిత్రానికి గోపీసుందర్, రామ్ ప్రసాద్ లాంటి పెద్ద టక్నీషియన్స్ ఉండటం మా అదృష్టం. మా మొదటి ప్రయత్నాన్ని అందరూ ఆదరించాలి' అని అన్నారు. పోసాని కృష్ణ మురళి, సునీల్, హర్ష వర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, నెల్లూరు సుదర్శన్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన, దర్శకత్వం – జి. భవానీ శంకర్, నిర్మాతలు – సంధ్యా రాణి, స్వరూప రాణి, ఎడిటర్ –ఎంఆర్ వర్మ, ఆర్ట్ – రఘు కులకర్ణి, లిరిక్స్ – శ్యామ్ కాసర్ల, శ్రీమణి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ – ముత్తినీడు గణేష్.

## నచ్చావులే... నచ్చావులే


సంయుక్త మీనన్, సాయిధరమ్ తేజ్


**సా**యిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్త మీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ నిర్మిస్తున్నాయి.

బాపినీడు బి.సమర్పణలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఏప్రిల్ 21న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటి వరకు విడుదలైన ప్రతి ప్రచార చిత్రానికి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా ఇటీవల విడుదల చేసిన టీజర్ అందరిలోనూ ఆసక్తిని, ఉత్కంఠను కలిగించింది.

తాజాగా ఈ చిత్రం నుంచి 'నచ్చావులే.. నచ్చావులే' అనే లిరికల్ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు సమకూర్చిన ఈ సాంగ్‌కు కృష్ణకాంత్ సాహిత్యం సమాకూర్చగా, కార్తీక్ ఆలపించారు. 1990లో జరిగే కథలో ఓ ప్రాంతంలో ప్రజలు విచిత్రమైన సమస్యతో బాధ పడుతుంటారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపడానికి హీరో ఏం చేశాడనేది అసలు కథ అని టీజర్ చూస్తే అర్థమవుతుంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, నేపథ్య సంగీతం సినిమాపై మరింత ఆసక్తిని

## జస్ట్.. రూ. 8.5 కోట్లు


కార్తికేయ



**భా**రతీయ సినీ చరిత్రలో ఆస్కార్ అందుకున్న తొలి తెలుగు సినిమాగా 'ఆర్ఆర్ఆర్' చరిత్ర సృష్టించింది. ఇందులోని 'నాటు..' పాటకు ఒరిజినల్ సాంగ్ విభాగంగా ఆస్కార్ పురస్కారం దక్కిన విషయం విదితమే. అయితే ఆస్కార్ ప్రమోషన్ కోసం రాజమౌళి బృందం రూ.80 కోట్లు ఖర్చు చేసిందనే వార్తలు పెద్ద దుమారాన్నే రేపాయి. ఈ నేపథ్యంలో తాజాగా రాజమౌళి తనయుడు కార్తికేయ దీనిపై క్లారిటీ ఇచ్చారు. 'హాలీవుడ్ సినిమాకు అయితే బిగ్ స్టూడియోస్ పబ్లిసిటీని చూసుకుంటాయి. 'ఆర్ఆర్ఆర్' కు అంత ఖర్చు చేసే స్టూడియో లేదు. క్యాంపెన్ కోసం మేము అనుకున్న బడ్జెట్ రూ.5 కోట్లు. అయితే నామి నేషన్స్ వచ్చిన తర్వాత మరికొంత బడ్జెట్ పెంచాం. దీంతో రూ.8.5కోట్లు అయింది' అని తెలిపారు.

అయితే కార్తికేయ చెప్పిన ఖర్చుపై సోషల్ మీడియాలో 'ఎట్టెట్టా..' ఇది సాధ్యమా?, మరీ ఇంత భారీ తేడా ఉండటం విడ్డూరమంటూ నెటిజెన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## ఉదయ్ శంకర్ కొత్త సినిమా షురూ


ఉదయ్ శంకర్

**యు**వ కథానాయకుడు ఉదయ్ శంకర్ కొత్త సినిమా ఫిల్మ్ నగర్ టెంపుల్‌లో సోమవారం ఘనంగా ప్రారంభం అయింది. మన్మోహన్ డైరెక్ట్ చేస్తోన్న ఈ చిత్రాన్ని శ్రీరామ్ మూవీస్ బ్యానర్ పై డాక్టర్ సౌజన్య ఆర్ అట్లూరి సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మిస్తున్నారు. ముఖ్య అతిథులుగా వచ్చిన శ్రీరామ్ సార్ ముహూర్త షాట్‌కు క్లాప్ కొట్టగా, దినేష్ చౌదరి కెమెరా స్విచ్ ఆన్ చేశారు.

ఈ సందర్భంగా హీరో ఉదయ్ శంకర్ మాట్లాడుతూ, హీరోగా నాకు ఇది ఐదో సినిమా. ఈ బ్యానర్‌లో రెండో సినిమా. నిర్మాత నారాయణరావుతో మరోసారి అసోసియేట్ కావడం చాలా హ్యాపీగా ఉంది. 'నచ్చింది గర్ల్ ఫ్రెండ్' తర్వాత మధునందన్‌తో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీలో అతనిది చాలా ఇంపార్టెంట్ రోల్. హిలేరియస్‌గా సాగే ఎగ్జైటింగ్ క్యారెక్టర్ చేస్తున్నాడు. మధునందన్ బ్రదర్ మన్మోహన్ అద్భుతమైన స్క్రిప్ట్‌తో వచ్చాడు. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. అతి త్వరలోనే రెగ్యులర్ షూట్‌కు వెళ్లబోతున్నాం' అని తెలిపారు. మధునందన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తోన్న మన్మోహన్ నా సొంత బ్రదర్. ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతకి థ్యాంక్యూ. ఉదయ్‌కి ఈ చిత్రం సూపర్ హిట్ ఇస్తుందని చెప్పగలను' అని అన్నారు. 'ఈ మూవీ ఏప్రిల్ మూడో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగబోతోంది. ఈ షెడ్యూల్‌లో మొత్తం కాస్ట్ అండ్ క్రూ ఉంటుంది. ఇది ఫ్యామిలీ, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో పాటు ఒక చిన్న ప్రేమకథ కూడా మిక్స్ అయి ఉంటుంది. మీ అందరికీ ఈ కథ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని దర్శకుడు మన్మోహన్ చెప్పారు.

నిర్మాత నారాయణరావు మాట్లాడుతూ, 'ఈ చిత్ర కథ చాలా బావుటుంది. స్క్రిప్ట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. ఉదయ్ శంకర్‌తో పాటు హీరోయిన్ మేఘా ఆకాశ్ పాత్రలు చాలా బావుంటాయి. మ్యూజిక్ శ్రీ చరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ జాంబిరెడ్డి ఫేమ్ అనిత్ కుమార్ అందిస్తున్నారు' అని తెలిపారు.

## పవర్‌ఫుల్ కథతో సివి భారతి

**కిం**గ్ డమ్ మూవీస్ పతాకంపై ఘర్షణ శ్రీనివాస్ సమర్పణలో రమణారెడ్డి గడ్డం దర్శకత్వంలో విశాల పసునూరి నిర్మిస్తున్న చిత్రం 'సివి భారతి'. నరేంద్ర, గరిమా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. సోమవారంహైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రారంభోత్సవం గ్రాండ్‌గా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మల్లారెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. నటుడు అలీ తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. అనంతరం మీడియాతో దర్శకుడు రమణారెడ్డి గడ్డం మాట్లాడుతూ, 'రొటీన్‌కి భిన్నంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం.

ఇదొక పవర్‌ఫుల్ స్టోరీ. మంత్రి మల్లారెడ్డి, నటుడు అలీ మా చిత్ర ప్రారంభోత్సవానికి రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఆవులు పశుగ్రాసం లేక చెత్త కుప్పల దగ్గర పేపర్లు తినే పరిస్థితి చూస్తున్నాం. దీని గురించి మా చిత్రంలో ఒక ట్రాక్ పెట్టాం. మా సినిమా ద్వారా వచ్చే రిటర్న్స్‌లో కొంత భాగం పశుగ్రాసం కోసం కేటాయిస్తాం. ఏప్రిల్ 10 నుంచి సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేస్తాం' అని తెలిపారు. 'దర్శకుడు రమణారెడ్డి చెప్పిన కథ నాకెంతో బాగా నచ్చింది. ఇంత మంచి చిత్రాన్ని నేను ప్రొడ్యూస్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది' అని సమర్పకులు ఘర్షణ శ్రీనివాస్ చెప్పారు. హీరో నరేంద్ర మాట్లాడుతూ,'రమణ రెడ్డి అద్భుతమైన కథతో ఈ సినిమా తీస్తున్నారు. ఐదు అద్భుతమైన పాటలున్నాయి. ఒక మంచి స్క్రిప్ట్‌లో హీరోగా నటించడం చాలా సంతోషం. నా క్యారక్టర్‌ని చాలా బాగా డిజైన్ చేశారు' అని చెప్పారు.

'ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు నా ధన్యవాదాలు. పవర్‌ఫుల్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా నాకు నటిగా మంచి గుర్తింపునిస్తుంది' అని నాయిక గరిమా అన్నారు.

ఈ చిత్రానికి కో–ప్రొడ్యూసర్ : రేణుక కాసుల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటేశ్వరరావు, మ్యూజిక్ : ప్రిన్స్ హెన్రీ, సినిమాటోగ్రాఫర్ : శ్రీనివాస రెడ్డి, ఎడిటర్ :రామారావు, ఆర్ట్ : ఆనంద్, డాన్స్ :హరి.


గరిమా, నరేంద్ర

## స్టార్స్ రేంజ్‌లో పరారీ పాటలు

**యో**గేశ్వర్, అతిథి జంటగా, సాయి శివాజీ దర్శకత్వంలో జీవివి గిరి నిర్మించిన చిత్రం 'పరారీ'. శ్రీ శంకర ఆర్ట్స్ బ్యానర్‌పై గాలి ప్రత్యూష సమర్పిస్తున్న ఈ చిత్రంలోని 'ఎల్ల ఎల్ల' సాంగ్‌ని దర్శకుడు నక్కిన త్రినాథ్ రావు విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఎల్ల ఎల్ల..' పాటను రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. నేను ఈ సినిమా చూసాను. ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. పాటలు కూడా ఓ రేంజ్‌లో ఉన్నాయి. పాటలు వింటుంటే చక్రి సంగీతం వింటున్నట్టు ఉంది. ఒక స్టార్ హీరో సాంగ్స్ ఎలా ఉంటాయో ఖర్చుకు వెనుకాడకుండా అలా తీశారు. రామ జోగయ్య శాస్త్రి అద్భుతంగా ఈ పాటను రాశారు. కామెడీ కూడా చాలా బాగుంది. గౌతం రాజు ఎడిటింగ్ చాలా బాగుంది. ఆయనకు ఈ చిత్రం అంకితమివ్వాలి అని నిర్మాత గిరికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ సినిమా ఈనెల 30న రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా రిలీజ్ అవుతుంది' అని అన్నారు. 'మ్యూజిక్ డైరెక్టర్ మహిత్ నారాయణ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. రామజోగయ్య శాస్త్రి అద్భుతమైన లిరిక్స్ ఇచ్చారు. మా హీరో యోగిని ప్రేక్షకుల ఆదరించాలని కోరుకుంటున్నాను. మా శంకర ఆర్ట్స్ బ్యానర్‌లో మరిన్ని మంచి సినిమాలు నిర్మిస్తాము. ఇందులో నటించిన ఆర్టిస్టులు టెక్నీషియన్స్ అందరూ మాకు బాగా సపోర్ట్ చేయటంతో సినిమా చాలా బాగా వచ్చింది' అని నిర్మాత జి.వి.వి.గిరి ఉన్నాయి.

సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్ మాట్లాడుతూ,' నక్కిన త్రినాథ్ రావు మా పాటను రిలీజ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పాటకు దీపక్ మంచి వాయిస్ ఇచ్చారు. మా సాంగ్స్‌ని ఆదరించి సినిమాని పెద్ద హిట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన ఇటువంటి సినిమాలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా తర్వాత నాకు మరిన్ని అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నాను' అని హీరో యోగిశ్వర్ అన్నారు. సుమన్, భూపాల్, శివాని సైని, రఘు కారుమంచి, మకరంద్ దేశముఖ్, షయాజి షిండే, అలీ, శ్రవణ్, కల్పాలత, జీవ తదితరులు నటించిన ఈ చిత్రానికి దర్శకత్వం: సాయి శివాజీ.


జి.వి.వి.గిరి, త్రినాథరావు నక్కిన, యోగేశ్వర్